
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



చిత్తూరు

బుధవారం, 30 ఆగస్టు 2017 | 16



దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన నెలసరి పెన్షన్ల మంజూరుకు సంబంధించి ఇంతవరకూ ఎలాంటి మార్గదర్శకాలూ జారీ కాలేదు.చంద్రన్న బీమా యోజన పోర్టల్ ద్వారా పెన్షన్ పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం ఆదేశించినా ఇప్పటి దాకా ఆ పోర్టల్‌లో సంబంధిత సమాచారమేమీ లభ్యం కావడం లేదు. వైద్యారోగ్య శాఖ, కార్మిక శాఖ సంయుక్తంగా పెన్షన్ మంజూరు ప్రక్రియను నిర్వహించాలని నిర్దేశించినా ఈ రెండు శాఖలకూ దీనిపై ప్రభుత్వం నుంచీ ఏ విధమైన స్పష్టతా రాలేదు.కిడ్నీ రోగులకు నెలకు రూ. 2500 పెన్షన్ కింద చెల్లిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించిన నేపథ్యంలో జీవో జారీ అయి నెల దాటుతున్నా అమలుకు నోచుకోలేదు.

జీవో సరే... అమలేదీ?

- కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పెన్షన్లపై ఇంకా అందని మార్గదర్శకాలు
- చంద్రన్న బీమాయోజన పోర్టల్‌లో కనపడని సమాచారం
- సీఎం హామీతో జీవో వచ్చి నెలవుతున్నా అమలు కాని వైనం

వివరాలు
6వ పేజీలో



చిత్తూరులో
సాకం నాగరాజుకు సత్కారం

తెలుగుభాషకు పట్టాభిషేకం

- వాడవాడలా వెల్లివిరిసిన మాతృ భాషాభిమానం
- చిత్తూరులో 26మంది సాహితీవేత్తలకు ఘనసత్కారం
- విజయవాడలో నలుగురికి సీఎం పురస్కారాల ప్రదానం

2

పచ్చదనం పెంచడమే ప్రధాన లక్ష్యంగా అటవీశాఖ అధికారులు అడుగులు వేస్తున్నారు.దీనికితోడు వర్షాలు కురుస్తూ అనుకూల వాతావరణం ఏర్పడడంతో మొక్కలు నాటించేందుకు వివిధ రకాల పథకాలతో ముందుకు కదులుతున్నారు.విద్యార్థులను, పల్లెవాసులను భాగస్వాములను చేసేలా ప్రణాళికలను తయారు చేశారు.

వివరాలు 14లో..

ఊరూరా వనాలు



- పచ్చదనం పెంచడమే లక్ష్యం
- 'ప్రకృతి పిలుస్తోంది' పేరిట విద్యార్థులకు విహారయాత్రలు
- మొక్కల పెంపకంపై పలు పోటీలు
- మొక్కలు నాటేవారికి ఉచితవైద్యం
- 50పంచాయతీల్లో గ్రామస్తుల భాగస్వామ్యంతో 'పల్లెవనాలు'
- 'వృక్ష ప్రసాదం' పేరుతో ఆలయాల్లోనూ మొక్కల నాటకం



శేషుడిపై వరసిద్ధుడి విహారం

వివరాలు 9లో..



తెలుగు భాషా దినోత్సవానికి సంప్రదాయ వస్త్రధారణతో హాజరైన సాహితీవేత్తలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రద్యుమ్న

మాతృభాషపై మమకారం అవసరం

తెలుగు భాషా దినోత్సవాల్లో కలెక్టర్ ప్రద్యుమ్న







జిల్లా రచయితల సంఘం పూర్వ కార్యదర్శి కె.రామకృష్ణకు ,గౌరవాధ్యక్షుడు బాలకృష్ణారెడ్డికి, అబ్దుల్ ఖాదర్‌కు సత్కారం

చిత్తూరు కలెక్టరేట్:మాతృభాషకు ప్రాముఖ్యత ఇవ్వగలిగితే రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందడానికి అవకాశం వుందని కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న అభిప్రాయపడ్డారు. గిడుగు వెంకట రామ్మూర్తి పంతులు జయంతిని పురస్కరించుకొని మంగళవారం చిత్తూరులో తెలుగు భాషా దినోత్సవ వేడుకలు వైభవంగా జరిగాయి.ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ ప్రద్యుమ్న మాట్లాడుతూ మనదైన సంస్కృతిని, సంప్రదాయాలను అందరం గౌరవించుకోవాలని పిలుపునిచ్చారు. ఇకపై జిల్లాలో ఉన్న ప్రీ స్కూల్ - ప్లేస్కూల్ పేర్లను బాలబడిగా మార్చాలన్నారు.అభివృద్ధి చెందిన దేశాల్లో స్వభాషాభిమానం ఎక్కువగా ఉంటుందని చెప్పారు.ఆంగ్ల భాష నేర్చుకోవచ్చని,అయితే మాతృభాషపై మమకారం వదులుకోకూడదన్నారు. జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి, ఎమ్మెల్యే సత్యప్రభ, ఎమ్మెల్సీ దొరబాబు, మేయర్ కటారి హేమలత మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలల్లో ఆంగ్ల బోధన ప్రారంభించడం బాధాకరమన్నారు.జిల్లా రచయితల సంఘం గౌరవా ధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ గిడుగు రామ్మూర్తి విగ్రహస్థాపనకు చిత్తూరులో స్థలం కేటాయించాలని కోరారు. జిల్లా రచయితల సమాఖ్య కన్వీనర్ సాకం నాగరాజు మాట్లాడుతూ అవసరాలకు అనుగుణంగా తెలుగు భాషను అభివృద్ధి చేయడానికి ప్రాధికార సంస్థను తక్షణం ఏర్పాటు చేయాలని కోరారు.జేసీ-2 చంద్రమౌళి, కవి వేంపల్లె అబ్దుల్ ఖాదర్ తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో పలు పుస్తకాల ఆవిష్కరణ జరగ్గా పాల్గొన్న కవులు, రచయితలు సాంప్రదాయ దుస్తులు ధరించి రావడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.కాగా మండల కేంద్రాల్లో,విద్యాసంస్థల్లో కూడా గిడుగు జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.

26మంది కవులకు సన్మానం

తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని 26 మంది సాహితీ ప్రముఖులను సన్మానించారు.వీరిలో కట్టమంచి బాలకృష్ణారెడ్డి, సాకం నాగరాజు, పసల హరి కృష్ణారెడ్డి, కె.రామకృష్ణ, గంగవరం శ్రీదేవి, ఎడ్ల బాలకృష్ణారెడ్డి, వేంపల్లి అబ్దుల్ ఖాదర్, డాక్టర్ వి.కె.మోహన్, ఎం.ఆర్. అరుణకుమారి, సీఎన్ చంద్రశేఖర్, మర్రిపూడి కన్నయ్య నాయుడు, గంటా మోహన్, అయిది రామకృష్ణ, వి. కుమారస్వామి రెడ్డి, పల్లిపట్టు పురుషోత్తమ ఆచారి, మురళి, కోడూరు బాలసుబ్రమణ్యం, కె.ఎం.బాలరాజు, ఎన్.జయరాం, తులసీనాధం నాయుడు, రెడ్డిపల్లె షాజహాన్, డాక్టర్ వి. రఘుపతి, వి. సలీం, పెంచలయ్య, హసీనా బేగం, ఆముదాల మురళి తదితరులున్నారు.

జగన్... ఇకనైనా తీరుమార్చుకో!

జడ్పీ చైర్‌పర్సన్ గీర్వాణి హెచ్చరిక

చిత్తూరు కలెక్టరేట్: నంద్యాల ఉపఎన్నికల ఫలితాలతోనైనా వైసీపీ అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి తీరు మార్చుకోవాలని, లేకుంటే ప్రజలే బుద్ధి చెబుతారని చిత్తూరు జిల్లా పరిషత్తు చైర్‌పర్సన్ గీర్వాణి చంద్రప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం తన చాంబర్‌లో జరిగిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ నంద్యాలలో గతంలో జరిగిన సాధారణ ఎన్నికల్లో వైసీపీ కంటే టీడీపీ 3 లేదా 4 శాతం ఓట్లు అధికంగా సాధించగా నిన్న జరిగిన ఉపఎన్నికల్లో 11.15 శాతం ఎక్కువ ఓట్లు పడ్డాయన్నారు. ముఖ్యమంత్రి చేస్తున్న అభివృద్ధిని చూసి నంద్యాల ఓటర్లు ఉత్సాహంగా టీడీపీకి పట్టం కట్టారన్నారు. రాష్ట్ర విభజన నేపథ్యంలో లోటు బడ్జెట్ ఉన్నా సీఎం చంద్రబాబు గడచిన మూడేళ్ళలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు నెరవేరుస్తూ ముందుకు సాగుతున్నారని పేర్కొన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రాన్ని పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం కంటే ఎక్కువగా చంద్రబాబు పోటీపడి అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. నిర్మాణాత్మకమైన ప్రతిపక్షంగా వ్యవహరిస్తూ ప్రభుత్వ లోటుపాట్లను ఎత్తిచూపాల్సిన విపక్ష నేత జగన్‌మోహన్‌రెడ్డి అందుకు విరుద్ధంగా ప్రవర్తిస్తూ వ్యక్తిగత దూషణలకు పాల్పడ్డ కారణంతోనే నంద్యాల ప్రజలు ఓటు ఆయుధంతో తమ నిరసన తెలిపారని విమర్శించారు. నంద్యాల ఉపఎన్నికలు చంద్రబాబు ప్రభుత్వానికి రెఫరండం అని ప్రకటించిన వైఎస్ జగన్ ఇప్పుడు ఏమంటారన్నారు. విలేఖరుల సమావేశంలో టీడీపీ సీనియర్ నాయకుడు ఎస్.చంద్రప్రకాష్ పాల్గొన్నారు.

వైసీపీ నేతలు హుందాగా ప్రవర్తించాలి: టీడీపీ

చిత్తూరుఅర్బన్: వైసీపీ నాయకులు నోరు అదుపులో పెట్టుకోవాలని జిల్లా టీడీపీ అధ్యక్షుడు పులివర్తి నాని, ఎమ్మెల్సీలు దొరబాబు, శ్రీనివాసులు, సమన్వయ కార్యదర్శి సురేంద్రకుమార్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. ప్రజా తీర్పును గౌరవించాల్సింది పోయి ప్రతిపక్ష నాయకులు అవాకులు చవాకులు పేలుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం నిష్పక్షపాతంగా వ్యవహరించడంతోనే నంద్యాల ప్రజలు నిర్భయంగా ఓట్లు వేశారన్నారు. జగన్ 13 రోజులు ప్రచారం చేసినా ప్రజలు వైసీపీని నమ్మలేదన్నారు. ఇలాగే దిగజారుడు మాటలు మాట్లాడుతుంటే రాబోయే ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా రాదన్నారు. వైసీపీ నవరత్నాలను ప్రజలు విశ్వసించడంలేదని వాటిని తమ ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తోందన్నారు. ఇప్పటికైనా విజ్ఞతతో మాట్లాడితే హుందాగా ఉంటుందని హితవు పలికారు.


నేడు పీఈటీలకు, భాషా పండితులకు కౌన్సెలింగ్

చిత్తూరు సిటీ: డీఈవో పూల్‌లో ఉన్న పీఈటీలకు, భాషా పండితులకు బుధవారం వర్క్ అడ్జస్ట్‌మెంట్ కౌన్సెలింగ్ జరగనుంది. చిత్తూరు పీసీఆర్ హైస్కూల్‌లోని డీసీఈబీ బ్లాకులో మధ్యాహ్నం 3గంటలకు కౌన్సెలింగును విద్యాశాఖ అధికారులు నిర్వహించనున్నారు. వారం క్రితం వరకు నిర్వహించిన టీచర్ల బదిలీల కౌన్సెలింగ్‌లో ఖాళీలు లేని కారణంగా 28 మంది పీఈటీలు, ఆరుగురు భాషా పండితులు, ఐదుగురు ఇతర సబ్జెక్టులకు సంబంధించిన టీచర్లకు పోస్టింగులు లేక బదిలీలు జరగలేదు. వీరందరికీ విద్యాశాఖాధికారులు బుధవారం కౌన్సెలింగ్ చేపట్టేందుకు ఏర్పాట్లు చేశారు.









ముఖ్యమంత్రి చేతుల మీదుగా పురస్కారాలను అందుకుంటున్న పలమనేరు బాలాజీ,దామోదర నాయుడు,మస్తానమ్మ, వీఆర్ రాసాని

నలుగురికి తెలుగు భాషా పురస్కారాలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): తెలుగు భాషా సేవకు గుర్తింపుగా నలుగురు జిల్లావాసులకు భాషా పురస్కారాలను ప్రకటించిన విష యం తెలిసిందే. జిల్లాకు చెందిన సాహిత్యవేత్తలు డాక్టర్ వీఆర్ రాసాని, పలమనేరు బాలాజీ, ఆచార్య గార్లపాటి దామోదర నాయుడు, డాక్టర్ డి.మస్తానమ్మ ఈ పురస్కారాలను మంగళవారం అందుకున్నారు. విజయవాడలోని తుమ్మలపల్లె కళాక్షేత్రంలో సీఎం చంద్రబాబు నాయుడు వీరికి రూ. 25వేల నగదు, శాలువా, పుష్పగుచ్ఛం. జ్ఞాపికలను అందజేసి అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు పరకాల ప్రభాకర్, భాషా సాంస్కృతిక శాఖ మంత్రి భూమా అఖిలప్రియ, శాసనసభ ఉప సభాపతి మండలి బుద్ధప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల పాలన ఓ సువర్ణాధ్యాయం

ద్రావిడ వర్శిటీ మాజీ వీసీ అరుణాచలం

చిత్తూరు కల్చరల్: భారతదేశ చరిత్రలో శ్రీ కృష్ణదేవరాయల పాలన ఓ సువర్ణాధ్యాయమని ద్రావిడ విశ్వవిద్యాలయం వ్యవస్థాపక పూర్వ ఉపకులపతి ఆచార్య పి.వి. అరుణాచలం అన్నారు. మంగళవారం స్థానిక పలమనేరు రోడ్డులోని రేణుక కల్యాణ మండపంలో ప్రముఖ కవి మర్రిపూడి దేవేంద్రరావు నేతృత్వంలో శ్రీకృష్ణదేవరాయల సువర్ణపాలన వైభవంపై జాతీయ సదస్సులో ప్రత్యేక అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయలు ద్రావిడ జాతికి యిచ్చిన సాహితీ సంపద గురించి ఎంత చెప్పినా తక్కువేనన్నారు. ప్రపంచ పర్యావరణవేత్త ఆచార్య ఎన్.ఎస్. మూర్తి మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతకు నిదర్శనంగా నదులను, పరిరక్షిస్తూనే చెరువులను, బావులను తవ్వించి వ్యవసాయాభివృద్ధికి తోడ్పడి వృక్ష సంపదకు రాయలు ఎంతో ప్రాధాన్యతనిచ్చారన్నారు. మద్రాసు విశ్వవిద్యాలయం తెలుగుశాఖ అధ్యక్షుడు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ మాట్లాడుతూ సంస్కృతికి, సాహిత్యానికీ పట్టాభిషేకం చేసిన సాహితీ సమరాంగణ చక్రవర్తిగా రాయలు గణుతికెక్కారని కొనియాడారు. రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ పూర్వ సంచాలకులు డాక్టర్ చంద్రశేఖర్, రాష్ట్రపతి అవార్డు గ్రహీత సి.నారాయణస్వామి మాట్లాడుతూ గోదాదేవి కళ్యాణ గాథను తెలిపే కావ్యం 'ఆముక్తమాల్యద'ను తెలుగులో రాసి సరస్వతీ సంపన్నుడుగా రాయలు కీర్తినందుకున్నారని తెలిపారు. వాస్తు పండితులు సకల వెంకటేశగుప్తా మాట్లాడుతూ వాస్తుకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వడం వల్లే రాయల సువర్ణపాలనను అందించారన్నారు. అనంతరం ఆంధ్ర విశ్వవిద్యాలయం, సహాయ ఆచార్యులు పులపర్తి శ్రీనివాసరావు, తెలుగు విశ్వవిద్యాలయం సహాయ ఆచార్యులు ఓరుగంటి సరస్వతి, విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం తెలుగుశాఖ సహాయ ఆచార్యులు లక్ష్మీనారాయణ రెడ్డి మాట్లాడుతూ రాయలవారు దేవాలయాలను నిర్మించడమేకాక మణులు, మాన్యాలు, బంగారు ఆభరణాలు సమర్పించడం గొప్ప విషయమన్నారు. అనంతరం ఐదు రాష్ట్రాలకు చెందిన 54 మందికి శ్రీకృష్ణదేవరాయ జాతీయ, రాష్ట్రీయ పురస్కారాలను, 200 మంది విద్యార్థులకు ప్రశంసాపత్రాలను ప్రదానం చేసారు. ఈ కార్యక్రమంలో బెంగుళూరు విశ్వవిద్యాలయం తెలుగు శాఖ సహాయ ఆచార్యులు గిరిబాబు, బి.టి కళాశాల సహాయ ఆచార్యులు ప్రభాకర్, జ్యోతీశ్వరిదేవి, రచయితల సంఘం కార్యదర్శి మాల్యాద్రి, మాజీ కౌన్సిలర్ పార్థసారథి నాయుడు, తెలుగు భాషాభిమానులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న పి.వి. అరుణాచలం

చిత్తూరులో మహిళ దారుణ హత్య

వడ్డీ వ్యాపారంలో గొడవలే కారణమని అనుమానం - పోలీసుల అదుపులో నిందితుడు





హత్యకు గురైన మహిళ - రాజ్యలక్ష్మి (ఫైల్‌ఫొటో)

చిత్తూరు టౌన్: చిత్తూరులోని తోట పాళ్యం సమీపంలోని ఓ ఇంటిలో మహిళ దారుణ హత్యకు గురైంది. తలపై బలంగా కత్తితో నరకడంతో తీవ్ర రక్తస్రావమై అక్కడిక్కడే ఆమె మృతి చెందినట్లు తెలుస్తోంది. ఈ హత్యకు వడ్డీ వ్యాపారంలో చెలరేగిన గొడవలే కారణమని తెలుస్తోంది. టు టౌన్ సీఐ వెంకటప్ప కథనం మేరకు వివరాలిలావున్నాయి. తోటపాళ్యంలోని ఓ ఇంట్లో వీరమణి, రాజ్యలక్ష్మి దంపతులు కాపురం ఉంటున్నారు. భర్త తమిళనాడు రాష్ట్రం విల్లుపురంలో ఓ ప్రైవేటు కళాశాలలో అధ్యాపకుడిగా పని చేస్తున్నాడు. రాజ్యలక్ష్మి కొంతకాలంగా వడ్డీ వ్యాపారం చేస్తోంది. తన వద్ద అప్పు తీసుకున్న ఓ వ్యక్తి నగదు చెల్లించకపోవడంతో రాజ్యలక్ష్మి కోర్టు ద్వారా అతడి ఆస్తులను స్వాధీనం చేసుకుంది. వడ్డీ వ్యాపారంలో తరచూ కొందరితో ఆమె తగాదా పడడం, ఘర్షణకు దిగడం వంటి సంఘటనలు ఇటీవలి కాలంలో జరుగుతూ వచ్చాయి. ఈ నేపథ్యంలో మంగళవారం మధ్యాహ్నం ఎవరో గుర్తుతెలియని వ్యక్తి ఇంటిలోకి ప్రవేశించి రాజ్యలక్ష్మి తలపై కత్తితో బలంగా నరికి పరారయ్యాడు. తలపై బలమైన గాయం కావడంతో తీవ్ర రక్తస్రావంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. సమాచారం అందుకున్న వెంటనే టు టౌన్ సీఐ వెంకటప్ప, ఎస్‌ఐ ఉమామహేశ్వర్, సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. హత్య జరిగిన స్థలంలో క్లూస్ టీమ్ వేలిముద్రలు సేకరించింది. రాజ్యలక్ష్మికి తెలిసిన వ్యక్తే ఈ హత్యకు పాల్పడివుంటాడని పోలీసులు భావిస్తున్నారు. హత్యచేసిన వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడి దుర్మరణం



శ్రీరాములు మృతదేహం

తిరుచానూరు: తిరుచానూరు సమీపం దామినేడు వద్ద మంగళవారం సత్యవేడు ఆర్టీసీ డిపో బస్సు ఢీకొనడంతో బైకులో వస్తున్న శ్రీరాములు (35) దుర్మరణం చెందారు. తిరుచానూరు ఎస్‌ఐ మధుసూదన్‌రావు తెలిపిన ప్రకారం.. కర్ణాటక రాష్ట్రం కోలారుకు చెందిన శ్రీరాములు కూలి పనుల నిమిత్తం రెండేళ్ల కిందట తిరుపతి వచ్చారు. దామినేడు ఇందిరమ్మ గృహాల్లో ఒక్కడే ఉంటూ క్యాటరింగ్ పనికి వెళ్లేవారు. మంగళవారం తన పని ముగించుకుని స్నేహితుడు రామచంద్రతో కలిసి తిరుపతి నుంచి ఇంటికి బైకుపై బయలుదేరారు. దామినేడు వద్ద బైపాస్‌రోడ్డులో వీరి బైకును ఆర్టీసీ బస్సు ఢీకొనడంతో కిందపడ్డారు. శ్రీరాములు తలపై బస్సు వెనుకచక్రం వెళ్లడంతో ఘటనా స్థలంలోనే మృతి చెందారు. ఆర్టీసీ బస్సు డ్రైవరుపై కేసు నమోదు చేసి మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించినట్లు ఎస్‌ఐ చెప్పారు. మృతుడి బంధువుల ఆచూకీ కోసం ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. కాగా, రామచంద్ర స్వల్పగాయాలతో బయటపడి వెళ్లిపోయినట్లు తెలిసింది.

బైక్‌ను ఢీకొన్న మినీ లారీ

ఇద్దరు ఆంధ్రజ్యోతి సిబ్బందికి గాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన బైక్



తిరుపతిలో చికిత్స పొందుతున్న తాతయ్య

గూడూరు టౌన్: గూడూరు పట్టణ శివార్లలోని తాళమ్మ దేవాలయ సమీపంలో మంగళవారం వేకువజామున ఓ మినీ లారీ బైక్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆంధ్రజ్యోతిలో పని చేస్తున్న నూతన్, తాతయ్య అనే ఇద్దరు సిబ్బందికి తీవ్ర గాయాలయ్యాయి. వాకాడుకు చెందిన నూతన్, తిరుపతికి చెందిన తాతయ్య నెల్లూరులో సోమవారం రాత్రి విధులు ముగించుకుని బైక్‌పై గూడూరు బయలుదేరారు. మార్గమధ్యంలోని తాళమ్మ ఆలయం వద్ద డంపింగ్ యార్డు సమీపంలో గేదెల లోడుతో నెల్లూరు వైపు వస్తున్న మినీ లారీ బైక్‌ను ఢీకొంది. దీంతో నూతన్, తాతయ్యలకు తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో వీరిని గూడూరు ఏరియా ఆసుపత్రికి, అక్కడి నుంచి నెల్లూరులోని నారాయణ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రికి తరలించారు. ఇక్కడి నుంచి తాతయ్యను మాత్రం తిరుపతిలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. గూడూరు రూరల్ పోలీసులు ప్రమాదానికి కారణమైన వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు.

చెలిమిచేను జలపాతంలో సెల్ఫీ సరదాకు యువకుడి బలి



చిట్టిబాబు మృతదేహం

రామకుప్పం : రామకుప్పం మండలం వీర్నమల పంచాయతీ చెలిమిచేను జలపాతం వద్ద సెల్ఫీ సరదాకు చిట్టిబాబు (30) బలయ్యాడు. పోలీసుల కథనం మేరకు... కుప్పం మండలం రాములచేనుగట్టుకు చెందిన చిట్టిబాబు మిత్రులతో కలిసి మంగళవారం మధ్యాహ్నం చెలిమిచేను జలపాతం సందర్శనకు వెళ్ళాడు. జలపాతం వద్ద సెల్ఫీ తీసుకునే ప్రయత్నంలో చిట్టిబాబు కాలు జారి లోయలో పడిపోయాడు. స్నేహితులు వెళ్ళి పరిశీలించగా అప్పటికే అతడు మృతి చెందాడు. రామకుప్పం పోలీసులు శవాన్ని పోస్టుమార్టంకు తరలించారు. ఎస్‌ఐ సురేష్ కేసు నమోదు చేశారు.

మహిళపై దాడిచేసిన వ్యక్తికి ఆరు నెలల జైలు శిక్ష

చిత్తూరు లీగల్: మహిళపై దాడిచేసిన వ్యక్తికి మూడవ కోర్టు జడ్జి శైలజ ఆరు నెలల జైలు శిక్ష విధించారు. పూతలపట్టు మండలం వావిల్‌తోట పంచాయతీ వెంకటాపురం గ్రామానికి చెందిన ఓ మహిళ ఇంట్లో ఒంటరిగా వుండగా 2017 ఏప్రిల్ 14న అదే గ్రామానికి చెందిన నందకుమార్ ఇంట్లో చొరబడి, ఆమెపై కత్తితో దాడి చేశాడు. ఈ మేరకు ఎస్‌ఐ మురళీమోహన్, హెడ్ కానిస్టేబుల్ వాసు కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్‌కు పంపించారు. ఈ కేసు మంగళవారం మూడవ కోర్టులో వాయిదాకు రాగా నందకుమార్ పై నేరం రుజువు కావడంతో జడ్జి శైలజ ఆరు నెలల జైలు శిక్ష, రూ.వెయ్యి జరిమానా విధించారు.

ధనంజయలు నాయుడికి బెయిల్ మంజూరు

ఏర్పేడు: ఏర్పేడు పోలీస్‌స్టేషన్ ముందు ఏప్రిల్ 21న జరిగిన రోడ్డు ప్రమాద ఘటనకు సంబంధించి మూడవ నిందితుడుగా ఉన్న ధనంజయలు నాయుడికి రిమాండు విధించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మంగళవారం శ్రీకాళహస్తి ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ ధనంజయలు నాయుడికి బెయిల్ మంజూరు.

కాణిపాకంలో నేటి సాంస్కృతిక కార్యక్రమాలు

కాణిపాకం : బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 12 వరకు పత్రిపాటివారిపల్లెకు చెందిన గుడివాడ అన్నయ్య ధార్మికోపన్యాసం, 12 నుంచి మధ్యాహ్నం 2 వరకు తిరుపతికి చెందిన సక్కుబాయి భాగవతారిణి హరికథ, 2 నుంచి సాయంత్రం 4 వరకు విజయవాడకు చెందిన పీవీఎస్‌ప్రసాద్, ఇడుపులపాయకు చెందిన నటరాజు భక్తిగీతాలు, 4నుంచి సాయంత్రం5.30 వరకు శ్రీకాళహస్తికి చెందిన నవవాణి, 5.30 నుంచి రాత్రి 6.30 గంటల వరకు తిరుపతికి చెందిన దివ్యశ్రీ భరతనాట్య నృత్య ప్రదర్శన, 6.30 నుంచి రాత్రి 8 గంటల వరకు తెనాలికి చెందిన తేజస్విప్రఖ్య కూచిపూడి, 8 నుంచి 11 గంటల వరకు వెంకటగిరికి చెందిన శ్రీనటరాజ నాట్య మండలి బృందం, రాత్రి 11 నుంచి 2గంటల వరకు శ్రీవేంకటేశ్వర నాట్య కళామండలి పౌరాణిక నాటక ప్రదర్శన నిర్వహించనున్నారు.

ఐదు నెలలుగా జీతాలు నిల్

చిత్తూరు ఆస్పత్రి ఎదుట కాంట్రాక్టు కార్మికుల ధర్నా



చిత్తూరు ప్రభుత్వాస్పత్రి వద్ద ధర్నా చేస్తున్న కార్మికులు

చిత్తూరుటౌన్: తమకు చెల్లించాల్సిన ఐదు నెలల జీతం బకాయిలు తక్షణం చెల్లించాలంటూ చిత్తూరు ప్రభుత్వాస్పత్రి వద్ద కాంట్రాక్టు కార్మికులు ధర్నా నిర్వహించారు. మంగళవారం ఉదయం కార్మికులు ఆస్పత్రి వద్ద బైఠాయించి ప్లకార్డులు చేతబట్టి ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు కార్మిక సంఘ నేతలు మాట్లాడుతూ ఈ ఏడాది మార్చి నెల నుంచి జూలై వరకు జీతాలు చెల్లించకపోవడం దారుణమని, ప్రస్తుత నిత్యావసర ధరలు ఆకాశాన్నంటుతున్న తరుణంలో ఐదు నెలలు జీతాలు లేకపోతే కార్మికులు తమ కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. గడచిన కొన్ని రోజులుగా అనేకరకాలుగా కలెక్టరేట్, గాంధీ విగ్రహం, చిత్తూరు ఆస్పత్రి వద్ద పలు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించినా ఇటు అధికారులు గాని, అటు పాలకులు స్పందించకపోవడం బాధాకరమన్నారు. చిత్తూరు ఆస్పత్రిలో సుమారు 70 మంది కార్మికులు పనిచేస్తున్నారని, జీతాలు సకాలంలో రాకపోవడంతో పస్తులుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ధర్నా కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికుల సంఘం చిత్తూరు బ్రాంచి అధ్యక్షుడు చంద్రశేఖర్, జిల్లా కాంట్రాక్టు ఉద్యోగుల సంఘం అధ్యక్షులు జయచంద్ర, నేతలు, కార్మికులు పాల్గొన్నారు.

తెలుగు భాష అమ్మలాంటిది



తెలుగు బాష దినోత్సవం సందర్భంగా మాట్లాడుతున్న హెచ్ఎం శివశంకర్

దామలచెరువు: పాకాల మండలం దామలచెరువు జడ్పీ ఉన్నత పాఠశాలలో గిడుగు రామ్మూర్తి పంతులు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని మంగళవారం తెలుగు బాష దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం శివశంకర్ మాట్లాడుతూ తెలుగు బాష అమ్మలాంటిదన్నారు. సరళంగా మాట్లాడే సులభమైన తెలుగు వ్యవహార బాషగా ఉండాలని గిడుగు అనేక ఉద్యమాలు నిర్వహించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు మహ్మద్‌రఫి, వెంకటరమణ, హసీనాబేగం,భారతి, శిరీష, జిలాని, పీడీ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల తనిఖీ

బందార్లపల్లె ప్రాథమికోన్నత పాఠశాల, యల్లంపల్లె ప్రాథమిక పాఠశాలలను ఎంఈవో బాబ్జి మంగళవారం తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు పట్టికను, వివిధ రికార్డులను పరిశీలించారు. ఉపాధ్యాయులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ప్రార్థనకు ముందే ఉపాధ్యాయులందరు పాఠశాలకు రావాలని సూచించారు.

ఆరుగురు కోడి పందెగాళ్ల అరెస్టు

పెనుమూరు: మండలంలోని కత్తిరెడ్డిపల్లె సమీప పొలాల్లో కోడి పందేలు ఆడుతున్న ఆరుగురిని పోలీసులు అరెస్టు చేశారు. స్థానిక ఎస్ఐ కథనం మేరకు కత్తిరెడ్డిపల్లెకు చెందిన సుధాకర్‌రెడ్డి, సమీప గ్రామాలకు చెందిన హేమేందర్ రెడ్డి, బాలయ్య, చంద్ర, స్వామి, నరేంద్ర,సాయిలు కోడిపందెం ఆడుతున్న విషయం తెలుసుకొని పోలీసులు అక్కడికి చేరుకున్నారు. పోలీసులు రాగానే కోడిపందెం రాయుళ్లు పారిపోవడానికి ప్రయత్నించగా ఎస్ఐ శివాజీనేయుడు ఆధ్వర్యంలో పోలీసులు వారిని వెంబడించి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి ఒక పందెం కోడి, రూ.906 స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ తెలిపారు. బుధవారం వారిని రిమాండ్‌కు తరలిస్తామన్నారు.

నీటి కరువులో డ్రిప్ సేద్యం రైతుకు వరం



మామిడి మొక్కల గోతులను పరిశీలిస్తున్న కలెక్టర్

ఐరాల: వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు నీటిని వృథా చేయవద్దని జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ఆకస్మికంగా మండలంలోని చినకాంపల్లె వద్ద ఉపాధి హామీ ద్వారా రైతులు చేస్తున్న మామిడి మొక్కల పెంపకాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రతి రైతు సాగుకు డ్రిప్‌ను వినియోగించాలని సూచించారు. రైతులకు 90 శాతం సబ్సిడీతో డ్రిప్‌ను అందిస్తామన్నారు. మామిడి మొక్కలను పెంచుకొనే రైతుతో మాట్లాడుతూ మొక్కలను అదనులో నాటుకుంటే మంచి ఫలితాలు వస్తాయని వివరించారు. మొక్కల పెంపకానికి తీసే గోతులను కూలీలతోనే చేయించాలని సూచించారు. మండలం వ్యాప్తంగా ఉన్న మామిడి మొక్కల పెంపకం లక్ష్యాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. అలాగే ప్రతి ఒక్కరు ఇంకుడు గుంతను పెట్టుకోవాలని తెలిపారు. మామిడి మొక్కలు నాటుకొనే రైతులు అదనపు ఆదాయం కోసం అంతర్ పంటలను వేసుకోవాలని సూచించారు. పాడి ఆవులున్న రైతులు పుష్కలంగా పాడి లభించేలా ఆవులను పోషించాలని సూచించారు. మామిడి మొక్కల పెంపకానికి రైతులు మరింతమంది ముందుకు వచ్చేలా అధికారులు ప్రయత్నించాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ లత, ఇన్‌చార్జి ఎంపీడీవో జీవరత్నం, ఏపీవో శ్రీనివాసులు, ఏపీఎం రవి, వెలుగు సీసీ మంజుల తదితరులు పాల్గొన్నారు.

సంజీవని కుంటలు పొలాలకు జీవం

తవణంపల్లె :పంట సంజీవిని కుంటలు పంట పొలాలకు జీవనాడి అని కలెక్టర్ ప్రద్యుమ్న పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని సంతపల్లె పంచాయతీ కురపల్లె గ్రామంలో జాతీయ ఉపాధి హామి పథకం ద్వారా రైతు చెంగల్‌రాయుడు నాటిన మామిడి మొక్కలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రైతుతో మాట్లాడుతూ మామిడి మొక్కల పెంపకంపై అరా తీస్తూ దానినుంచి వచ్చే ఆదాయ వ్యయాలను అడిగి తెలుసుకున్నారు. వీటితో పాటు మామిడి తోటల్లో అంతర పంటలు వేసుకోవాలని సూచించారు. మహిళా రైతు భారతితో మాట్లాడుతూ చౌకదుకాణం ద్వారా కుటుంబానికి ఎన్ని కిలోల బియ్యం వస్తున్నదని అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట ఎంపీడీవో రవికుమార్, తహసీల్దార్ వరలక్ష్మి, ఏపిఎం లక్ష్మణరెడ్డి, ఉద్యానశాఖాధికారి ప్రసన్నలక్ష్మి, ఉపాధి సిబ్బంది ఉన్నారు.

మూడు శాఖలకు మరుగుదొడ్ల నిర్మాణ బాధ్యత

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు మండలంలో మరుగుదొడ్ల నిర్మాణాల వేగవంతానికి మూడు వేర్వేరు శాఖలకు చెందిన అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు. మండలంలో మొత్తం 32 పంచాయతీలు వున్నాయి. అందులో నందనూరు, వెజ్జుపల్లె, వేల్కూరు, వరత్తూరు, పాచిగుంట, నెల్లేపల్లె, కొండేపల్లె, బుక్కాపట్నం, ఆత్మకూరు, ఎల్లాపల్లె, అంబోదరపల్లె, తూగుండ్రం, తిరువీధికుప్పం, పెద్దకాల్వ పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను ఎంపీడీవో పైౖల పర్యవేక్షిస్తారు. కొట్రకోన, మహదేవమంగళం, వేపంజేరి, పాత వెంకటాపురం, అగరమంగళం, కలిజవేడు, ముక్కళత్తూరు, కొత్తవెంకటాపురం పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను తహసీల్దార్ సుశీల పర్యవేక్షిస్తారు. బంగారెడ్డిపల్లె, చిన్నవేపంజేరి, పాపిరెడ్డిపల్లె, వీరకనెల్లూరు, కడపగుంట, కోటాగరం, వింజం, గంగాధరనెల్లూరు పంచాయతీల్లో మరుగుదొడ్ల నిర్మాణాలను వెలుగు ఏపీఎం పరీద్ మస్తాన్ పర్యవేక్షిస్తారు. అక్టోబర్ నెల 2వ తేది గాంధీ జయంతి లోపు మరుగుదొడ్ల నిర్మాణాలను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా నిర్ణయించుకొన్నారు. మరుగుదొడ్ల నిర్మాణాలను వేగవంతంగా అనుకొన్న సమయానికి పూర్తిచేయాలంటే ఎంపీడీవోకే బాధ్యత వున్నట్లయితే కష్టతరమని భావించి జిల్లా ఉన్నతాధికారులు మండలంలోని 32 పంచాయతీల్లో 31 పంచాయతీలను మూడు వేర్వేరు శాఖలకు విభజించి బాధ్యతలు అప్పగించారు. కాగా ఇప్పటికే పాతపాళ్యం పంచాయతీలో మరుగుదొడ్లు పూర్తిచేసి ఓడీఎఫ్‌గా డిక్లేర్ చేసారు.

ఘనంగా తెలుగు భాషా దినోత్సవం

చిత్తూరు క్రైం: స్థానిక రుక్మిణి కృష్ణస్వామి విద్యాలయ, జూనియర్ కళాశాలలో మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఛైర్‌పర్సన్, ఎమ్మెల్యే డీఏ సత్యప్రభ మాట్లాడుతూ విద్యార్థుల మేధస్సుపై మాతృభాష ప్రభావం చూపుతుందన్నారు. మాతృభాష తీయ్యదనాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. ప్రిన్సిపాల్ యం.రమేష్‌బాబు మాట్లాడుతూ భారతదేశంలో తెలుగు మాతృభాషగా మాట్లాడేవారి సంఖ్య 9.7 కోట్ల మంది వున్నారన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

ఎన్‌పీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాలలో....

నగరంలోని శ్రీమతి ఎన్‌పీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాలలో, గురునగర్ కాలనీలోని ఆర్‌కే మోడల్ స్కూల్‌లో తెలుగు భాషా దినోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కోమలా రవీంద్ర మాట్లాడుతూ మొట్టమొదటగా ప్రతి తల్లి తండ్రి పిల్లలకు మాతృభాష నేర్పించాలన్నారు. తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా కవులను సన్మానించడం ఎంతో ఆనందంగా వుందని చెప్పారు. అనంతరం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడాపోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లతామురళి ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మెరిట్ విద్యార్థినులకు నగదు బహుమతి

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర ఖజానా శాఖ డైరక్టర్ కనకవల్లి మంగళవారం చిత్తూరు ఓటీకే రోడ్డులోని కస్తూరిబా నగర బాలికోన్నత పాఠశాలను సందర్శించారు. 2016-17 విద్యా సంవత్సరంలో జరిగిన పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు పొందిన విద్యార్థినులకు రూ.5000, రూ. 2000, రూ.1000 వంతున నగదు పురస్కారం పంపిణీ చేసారు. గతంలో చిత్తూరు వేపమానువీధిలో తమ కుటుంబం ఉండేదని ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం పూర్తిచేసానని, చదివిన పాఠశాల అభివృద్ధికి ఎంతో కొంత సాయపడడానికి ప్రతి ఏటా ఇక్కడికి వస్తున్నానని తెలిపారు. అనంతరం పాఠశాలలో చదివే విద్యార్థినిలందరికీ స్టీల్ ప్లేట్లు, గ్లాసులు, పెన్నులు, చాక్లెట్లు పంచిపెట్టారు. తొలుత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఆమెకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఇంకా చిత్తూరు జిల్లా ఖజానా డీడీ గంగాద్రి, ఎస్టీవోలు బాలసుబ్రమణ్యం, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు. తర్వాత డైరక్టర్ కాణిపాకం బయలుదేరివెళ్ళారు.

పోరాటమే ఊపిరిగా జీవిస్తా

రైతు నాయకుడు ఈదల

పెనుమూరు: రైతు సమస్యలపై పోరాటమే ఊపిరిగా జీవిస్తానని రైతు నాయకుడు ఈదల వెంకటాచలం నాయుడు అన్నారు. మంగళవారం పెనుమూరులో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2017 ఆగస్టు నాటికి చిత్తూరులోని విజయ సహకార పాలడెయిరీ ప్రారంభమై 67 సంవత్సరాలు పూర్తయ్యిందని, అప్పుడు 6వేల లీటర్లతో కేవలం చిల్లింగ్ సెంటరుగా ఏర్పడిన డెయిరీ 1989 నాటికి లక్షా యాభై వేల లీటర్ల పాలసేకరణ సామర్థ్యాన్ని కలిగి, 495 పాలసేకరణ కేంద్రాలను కలిగి, 10 టన్నుల కెపాసిటీ కలిగిన పాల పౌడర్ తయారు చేయగల ప్లాంటుగా దక్షిణ భారత దేశంలోనే ప్రథమస్థానంలో నిలిచిన డెయిరీ కొందరు అసమర్థ అధికారుల తీరుతో మూతపడిందన్నారు. అప్పటినుంచి ఈ డెయిరీ పునర్నిర్మించాలంటూ అనేక ఉద్యమాలు చేస్తున్నానని, తన ఊపిరి వున్నన్నాళ్ళు పోరాడతానని ఆయన తెలిపారు. త్వరలోనే ఈ విషయమై రథయాత్ర కూడా చేపట్టనున్నట్లు, ఇందుకు పాడి రైతులందరూ సహకరించాలని ఆయన కోరారు.

పర్యవేక్షకులు జీవరత్నంకు ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు

ఐరాల: ఐరాల మండల కార్యాలయంలో పర్యవేక్షకులుగా పని చేస్తున్న జీవరత్నం ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఐరాలలో ఎంపీడీవోగా పనిచేస్తున్న జయంత్‌బాబు గ్రూప్1కు ఎంపికైనందున ఆయన శిక్షణ నిమిత్తం శ్రీకాళహస్తికి వెళ్ళారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీవో జీవరత్నం మాట్లాడుతూ జయంత్ బాబు ఆరు నెలల కాలం పాటు శిక్షణలో ఉంటారని తెలిపారు. మండల ప్రజలకు నిత్యం అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరిస్తానన్నారు.

గంగాధరనెల్లూరు హైస్కూలు అభివృద్ధికి కృషి

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని పూర్వవిద్యార్థులు శరవణ, సోము, ఉమాపతి, హరిక్రిష్ణ, రమేష్, శ్రీధర్, దినకర్ తెలిపారు. 1997-98లో 10వ తరగతి చదివిన పూర్వవిద్యార్థులు కలిసి రూ.40 వేలు విలువ చేసే ఇన్వర్టర్లను మంగళవారం ప్రధానోపాధ్యాయులు ఆర్.రమేష్‌కు అందజేసారు. ఈ సందర్భంగా పూర్వవిద్యార్థులు మాట్లాడుతూ తాము విద్యాభ్యాసం చేసిన స్కూలుకు ఉడుత భక్తిగా చేయూత అందించామన్నారు. భవిష్యత్‌లోనూ పాఠశాల పురోభివృద్ధికి, పేద విద్యార్థులకు సహకారం అందిస్తామని తెలిపారు.

సినిమా గైడ్

చిత్తూరు

రాఘవ	అర్జున్ రెడ్డి
దేవి	వివేగం(త)
గురునాథ	వివేకం
ఎంఎస్ఆర్	జయ జానకి నాయక
విజయలక్ష్మి	నేనేరాజు నేనే మంత్రి
చాణక్య	ఆనందోబ్రహ్మ
వెంకటేశ్వర	వేలై ఇల్లాద పట్టదారి-2(త)
ఆనంద్	పిడా

ఆండ్రాయిడ్ యాప్ డెవలప్‌మెంట్‌పై శిక్షణ

చిత్తూరు క్రైం: నగరంలోని సీతమ్స్ కళాశాలలో సీఎస్ఈ విద్యార్థులకు ఆండ్రాయిడ్ ఆప్ డెవలప్మెంట్‌పై ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ రమేష్‌కుమార్ మంగళవారం తెలిపారు. ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలెప్‌మెంట్ సెంటర్ వారి సౌజన్యంతో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నారని పేర్కొన్నారు. కార్యక్రమ నిర్వాహకులు డాక్టర్ ఎన్.బద్రీనాథ్ మాట్లాడుతూ ఈశిక్షణ ద్వారా విద్యార్థులు ఆండ్రాయిడ్ స్టూడియో సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించి సొంతంగా అప్లికేషన్ డెవలప్‌మెంట్ చేయవచ్చన్నారు. ఇలాంటి శిక్షణా కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో సాంకేతిక నైపుణ్యం పెంపొందుతుందని ఆప్రకటనలో తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం పాటిస్తే రైతే రాజు

చిత్తూరు అర్బన్: ప్రకృతి వ్యవసాయ పద్ధతులు పాటిస్తే రైతే రాజు అని భారతీయ కిసాన్ సంఘ్ (బీకేఎస్) జిల్లా అధ్యక్షుడు విశ్వప్రకాష్ నాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం వ్యవసాయ మార్కెట్ యార్డులో భారతీయ కిసాన్ సంఘ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భారతీయ కిసాన్ సంఘ్ నేతలు మాట్లాడుతూ హరిత విప్లవం ద్వారా అధిక ఆహార ధాన్యాలను ఉత్పత్తి చేయడానికి రసాయన ఎరువుల వాడకంతో భూములను నిస్సారం చేయడమే కాకుండా దేశ ప్రజలను రోగాల బారిన పడేస్తున్నారన్నారు. పంట పొలాలకు రసాయన ఎరువుల పిచికారి చేయడం మానుకోవాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా మంచి పోషక విలువలున్న ఆహార ధాన్యాలను పండించుకోవచ్చన్నారు. ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్న క్రమంలో రైతులు దాని వైపు మొగ్గు చూపాలని కోరారు. కార్యక్రమంలో భారతీయ కిసాన్ సంఘ్ నేతలు కుమారస్వామి, చంద్రశేఖర్ రెడ్డి, రాజేంద్ర రెడ్డి, చిన్న స్వామిరెడ్డి, ఈశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విపత్తుల నివారణలో శిక్షణ అవసరం

పోలీసులకు అవగాహన కల్పించిన ఏడీఎఫ్‌వో

చిత్తూరు క్రైం: అగ్ని ప్రమాదాలు, తుఫాన్లు, వరదలు తదితర విపత్తులు సంభవించినపుడు ప్రజలను రక్షించేందుకు పోలీసులకు శిక్షణ అవసరమని అగ్నిమాపక శాఖ ఏడీఎఫ్‌వో ఆదినారాయణరెడ్డి చెప్పారు. జిల్లా పోలీసు శిక్షణా కేంద్రంలో మంగళవారం శిక్షణ పొందుతున్న పోలీసులకు విపత్తుల నివారణపై అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఎఫ్‌వో మాట్లాడుతూ ప్రజలకు నిరంతరం రక్షణ ఇచ్చే పోలీసులు విపత్తులు సంభవించినపుడు కూడా స్పందించక తప్పదన్నారు. దీనికోసం పోలీసులు విపత్తుల నివారణపై అవగాహన కలిగివుండాలని చెప్పారు. అగ్నిప్రమాదాలు సంభవించినపుడు, వరదల్లో ప్రజలు చిక్కుకున్నపుడు, ఇతర విపత్తుల్లో ప్రజల ప్రాణాలు, ఆస్తులు కాపాడే బాధ్యత పోలీసులపై వుందన్నారు. అలాంటి సమయాల్లో ప్రజల రక్షణతో పాటు తమను తాము రక్షించుకునేందుకు ఈ అవగాహనా కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అనంతరం విపత్తులు సంభవించినపుడు ఎలా స్పందించాలో ప్రయోగాత్మకంగా శిక్షణా పోలీసులచే చేయించారు. కార్యక్రమంలో ఏఎస్పీ రాధిక, ఏఆర్ డీఎస్పీ రమణయ్య, టౌన్ ఫైర్ ఆఫీసర్ ప్రవీణ్ పాల్గొన్నారు.



పోలీసులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఎఫ్‌వో ఆదినారాయణ రెడ్డి

'బృందావన్'లో ఘనంగా భాషా దినోత్సవం

చిత్తూరు కల్చరల్: నగర సంతపేటలో ఉన్న నాగాలమ్మ గుడి దగ్గరున్న బృందావన్ పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ శైలజాకుమారి మాట్లాడుతూ తెలుగు అతి ప్రాచీన భాషని 2400 సంవత్సరాల చరిత్ర కలిగిన భాష అని అన్నారు. మన తెలుగుభాషను కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విద్యార్థులు పాఠశాల స్థాయి నుంచే తెలుగు భాష గొప్పతనాన్ని తెలియజేయాలని ఉపాధ్యాయులకు తెలియజేశారు. అనంతరం గిడుగు వెంకటరామమూర్తి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఆకట్టుకుంది. అనంతరం తెలుగు భాష గొప్పతనాన్ని తెలిపే విధంగా విద్యార్థులు తెలుగు తల్లి వేషధారణలో చేసిన నృత్యం అందర్నీ ఆకట్టుకుంది.



సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శిస్తున్న విద్యార్థులు

సీపీఎస్‌ను రద్దుకు ఉద్యమాలను ఉధృతం చేస్తాం

చిత్తూరు రూరల్: నూతన పెన్షన్ విధానం రద్దుకై పోరాటాలను, ఉద్యమాలను ఉధృతం చేస్తామని ఎస్టీయూ రాష్ట్ర సహాధ్యక్షుడు గాజుల నాగేశ్వర రావు అన్నారు. ఎస్టీయూ జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్ వద్ద నిరసన దీక్షను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీపీఎస్ రద్దు కోసం జాతీయస్థాయి ఆందోళనలు చేపట్టినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్టీయూ రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.వి. రమణప్ప మాట్లాడుతూ ఉద్యోగులకు జీవన భద్రత లేకుండా చేసిన సీపీఎస్ విధానాన్ని అంతం చేసేంతవరకు ఎస్టీయూ పోరాటం సోదర సంఘాలను కూడా కలుపుకొని ఉద్యమాలు చేస్తోందని అన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వజ్రవేలురెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి పోతంశెట్టి రమేష్ మాట్లాడుతూ అన్ని రాజకీయ పార్టీలు సీపీఎస్ రద్దు అంశాన్ని తమపార్టీల మ్యానిఫెస్టోలో చేర్చాలని డిమాండ్ చేశారు. ఉద్యోగుల జీవన భద్రత, వారి కుటుంబాల సంక్షేమ బాధ్యతల నుంచి తప్పించుకోవడానికి ప్రభుత్వం ఇలాంటి విధానాలను అమలు చేస్తుందని విమర్శించారు. నిరసన దీక్షలో ఎస్టీయూ, సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నాయకులు వి. రామచంద్ర, దేవరాజులుశెట్టి, వెంకటరత్నంనాయుడు, దేవరాజులు, హరిబాబు, హరిబాబు, షమీర్, సుధాకర్, దేవానంద్, మోహన్ రెడ్డి, జయశ్రీ పాల్గొన్నారు.



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న ఎస్టీయూ నాయకులు

నీటివనరులను సంరక్షించుకోవాలి

చిత్తూరు సిటీ: రాబోవు తరాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రస్తుతం అందుబాటులో వున్న నీటివనరులను సంరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై వుందని శ్రీవిశ్వం పబ్లిక్ స్కూలు కరస్పాండెంటు జయచంద్రారెడ్డి అన్నారు. స్థానిక మిట్టూరులోని శ్రీవిశ్వం పబ్లిక్ స్కూలులో ఈషా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నదుల సంరక్షణ-భారత సంరక్షణ అనే అంశంపై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రాణులకు నీటి అవసరం ఎంతో వుందన్నారు. అయితే ఆ నీటివనరులపై కాలుష్య ప్రభావం పడడంతో ప్రస్తుతం భూగర్భ జలమట్టం అడుగంటి పోతోందన్నారు. ప్రస్తుతం మనకు నదులే ప్రధాన నీటి వనరులుగా వున్నాయని, అలాంటి నదులు ఎండిపోకుండా వుండాలంటే మొక్కలను విరివిగా నాటి నదుల సంరక్షణకు తోడ్పడాలని కోరారు. నదులను కాపాడడానికి ఓటు వేయదలచుకున్న వారు 8000980009కు మిస్డ్ కాల్ ఇస్తే అన్ని ఓట్లు నదుల సంరక్షణకు సహకారం అందించినట్లేనని కోరారు. ప్రతి విద్యార్థి, ఉపాధ్యాయులు నదుల రక్షణ-భారత సంరక్షణ అనే నినాదంతో ప్రతిజ్ఞ చేశారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

మురికి కాల్వలో మట్టి తొలగింపు



మురికికాల్వలో మట్టిని తీస్తున్న కార్మికులు

చిత్తూరు రూరల్: నగరపాలక సంస్థ పరిధిలోని పలు మురికి కాల్వల్లో పేరుకుపోయిన మట్టిని తొలగించారు. మంగళవారం స్థానిక ఎంఎస్ఆర్ సర్కిల్ వద్ద నుంచి పలమనేరు రోడ్డు, కలెక్టర్ బంగ్లా వద్ద ఉన్న మురికి కాల్వలో ఉన్న మట్టిని తొలగించారు. పలమనేరు రోడ్డులో మురుగుకాల్వలపై ఉన్న ఆక్రమణలను కూడా తొలగించారు. కలెక్టర్ బంగ్లా వద్ద కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం మట్టి తొలగింపు పనులను పర్యవేక్షించారు. పలమనేరు రోడ్డులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ జగన్ ఆధ్వర్యంలో కార్మికులు పనులను చేపట్టారు.

ఆధునిక వ్యవసాయ పద్ధతులతోనే అధిక దిగుబడి

తవణంపల్లె : ఆధునిక పద్ధతులతో సాగు చేసి నాణ్యమైన అధిక దిగుబడులు సాధించాలని ఎంపీపీ సరళకుమారి రైతులకు సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీపీ అధ్యక్షతన మామిడి రైతు ఉత్పత్తిదారులు సంఘాల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మైక్రో ఇరిగేషన్ పీడీ విద్యాశంకర్ మాట్లాడుతూ సన్న, చిన్నకార రైతులు మామిడి తోటలతో పాటు జామతోటలు పెంచుకొని అధిక ఆదాయం పొందవచ్చునని, జామతోటల పెంపకం ద్వారా నాటిన రెండు సంవత్సరాల నుంచే రైతులు ఆదాయం పొందవచ్చునన్నారు. ప్రతిరైతు పంట విధానం మార్చుకోవాలని మామిడి పంటలో అంతరపంటగా కరేపాకును సాగుచేసి అదనపు ఆదాయం పొందవచ్చునన్నారు. ప్రతి రైతు తమ పొలంలో పారంపండ నిర్మించుకొని వర్షాకాలంలో నీటిని నిల్వ చేసుకొని వేసవిలో సాగుకు ఉపయోగించుకొని పంటలను కాపాడుకోవచ్చునన్నారు. మైక్రో ఇరిగేషన్ పద్ధతులు ద్వారా ఆరుతడి పంటల వైపు మొగ్గుచూపాలని, తద్వారా పంటసాగులో అదనపు ఉత్పత్తిని సాధించవచ్చునన్నారు. నీటి వసతి గల రైతు సంఘాల సభ్యులకు రైతుల పొలాల్లో ప్రభుత్వం రాయితీపై మైక్రో ఇరిగేషన్ పద్ధతులు ఏర్పాటు చేయించుకొనే వారికి కంపెనీవారు రైతుల వద్దకే వచ్చి నమోదు చేస్తారని, రైతు సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం మండలంలో 95 రైతు సంఘాలకు మంజూరైన రివాల్వింగ్‌ఫండ్‌ను ఒక్కొక్క సంఘానికి పదివేలు వంతున రూ.19,50,000 చెక్కును సంఘాలకు పంపిణీచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వెంకటేష్‌చౌదరి, మండల టీడీపీ అధ్యక్షుడు వేణుగోపాల్‌నాయుడు, ఎంపీడీవో రవికుమార్, ఏపీఎం లక్ష్మణరెడ్డి, ఉద్యానవనాధికారి లక్ష్మీప్రసన్న, రైతు సంఘాల సభ్యులు, మహిళా సభ్యులు పాల్గొన్నారు.



రివాల్వింగ్ ఫండ్ చెక్కును పంపిణీ చేస్తున్న ఎంపీపీ తదితరులు

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు పెన్షన్లపై మార్గదర్శకాలేవీ?

● చంద్రన్న బీమాయోజన పోర్టల్‌లో సమాచార లేమి

● సీఎం హామీతో జీవో వచ్చి నెలవుతున్నా అమలేదీ?

(ఆంధ్రజ్యోతి - చిత్తూరు)

దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిగ్రస్తులకు రాష్ట్రప్రభుత్వం ప్రకటించిన నెలసరి పెన్షన్ల మంజూరుకు సంబంధించి ఇంతవరకూ ఎలాంటి మార్గదర్శకాలూ జారీ కాలేదు. శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్య అసాధారణంగా(13వేలకు పైగా) వుండడంతో స్పందించిన ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా వున్న కిడ్నీ రోగులకు స్వాంతన కలిగించేలా నిర్ణయం తీసుకున్నారు. దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధిగ్రస్తులు (స్టేజ్ 3, 4 మరియు 5)గా వుండి డయాలసిస్ చేయించుకుంటున్న వారికి నెలకు రూ. 2500 చొప్పున పెన్షన్ అందజేస్తామని ముఖ్యమంత్రి గత నెలలో ప్రకటించారు. ఆ మేరకు గత నెల 20వతేదీన(జీవోఆర్‌టి నంబరు 418... తేది 20-7-2017) జీవో కూడా జారీ అయింది. రాష్ట్ర వైద్యారోగ్య శాఖ ద్వారా రోగులను పరీక్షించి కిడ్నీ వ్యాధులతో బాధపడుతున్నట్టు నిర్ధారించడంతో పాటు పెన్షన్‌కు సిఫారసు చేయాల్సివుంటుందని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. దానితో పాటు పెన్షన్ పథకానికి కార్మిక శాఖకు చెందిన చంద్రన్న బీమా యోజన పథకం పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయించాలని, వైద్యారోగ్య శాఖ, కార్మిక శాఖ సంయుక్తంగా పథకాన్ని అమలు చేయాలని ఆదేశించింది.

తిరుపతి, శ్రీకాళహస్తిల్లోనే డయాలసిస్ సదుపాయం

జిల్లావ్యాప్తంగా ఎన్టీఆర్ వైద్యసేవ పథకం కింద 395 మంది కిడ్నీ వ్యాధిగ్రస్తులు తమ పేర్లు నమోదు చేసుకుని వైద్యం పొందుతున్నారు. తిరుపతి రుయా, స్విమ్స్ ఆసుపత్రుల్లోనూ, శ్రీకాళహస్తి ఏరియా ఆసుపత్రిలో మాత్రమే ప్రభుత్వపరంగా డయాలసిస్ సదుపాయం అందుబాటులో వుంది. తిరుపతిలోని రుయాసుపత్రిలో 10 డయాలసిస్ యూనిట్లు అందుబాటులో వుండగా రోజుకు 81 మంది రోగులకు డయాలసిస్ జరుగుతోంది. స్విమ్స్ ఆసుపత్రిలో 80 డయాలసిస్ యూనిట్లుండగా రోజుకు 210మంది రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు.వీరిలో నలుగురైదురు మాత్రమే డబ్బు చెల్లించి డయాలసిస్ పొందుతున్నారు. మిగిలిన వారు ఉచితంగానే పొందుతున్నారు. శ్రీకాళహస్తిలో ఎమ్మెల్యే బొజ్జలగోపాలకృష్ణారెడ్డి చొరవతో ఏరియా ఆసుపత్రిలో గతేడాది సెప్టెంబరులో డయాలసిస్ కేంద్రం ఏర్పాటైంది. అక్కడ 12 యూనిట్లుండగా 72మంది రోగులు డయాలసిస్ చేయించుకుంటున్నారు.వీరిలో శ్రీకాళహస్తి, చంద్రగిరి, నగరి, సత్యవేడు నియోజకవర్గాలకు చెందిన వారితో పాటు నెల్లూరు జిల్లాకు చెందిన వారు కూడా వున్నారు.

పథకం అమలుకు మార్గదర్శకాలేవీ?

కిడ్నీ రోగులకు పెన్షన్ అందించేందుకు ముఖ్యమంత్రి పథకం ప్రకటించినా అమలుకు నోచుకోవడం లేదు. దీనిపై జీవో జారీ అయి 35 రోజులవుతున్నా ఇంతవరకూ మార్గదర్శకాలు జారీ కాలేదు. జిల్లా వైద్యారోగ్య శాఖకు ఎలాంటి సమాచారం అందలేదు.అంతేకాకుండా చంద్రన్న బీమా యోజన పథకం పోర్టల్ ద్వారా దరఖాస్తు చేయించాలని జీవోలో పేర్కొన్నప్పటికీ ఆ పోర్టల్‌లో సంబంధిత సమాచారమేదీ అందుబాటులో లేదు. దరఖాస్తు చేయడానికి వీలుగా పోర్టల్‌లో సాంకేతికంగా మార్పులేమీ చేయలేదు.

వైద్యం ఖర్చు భరించలేకపోతున్న బాధితులు



శ్రీకాళహస్తి ప్రాంతీయ వైద్యశాలలోని సిమాంక్ భవనంలో కిడ్నీ రోగులను పరిశీలిస్తున్న డీఎంవో వరప్రసాద్

నిజానికి కిడ్నీ రోగులకు ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగానే డయాలసిస్ సదుపాయం అందుబాటులో వున్నా ఇతరత్రా ఖర్చు ఎక్కువగా వుంటోంది. దీర్ఘకాలిక కిడ్నీ రోగులు డయాలసిస్ కాకుండా ఇతరత్రా మందుల కోసం నెలకు కనీసం రూ. 10వేలు ఖర్చు పెట్టాల్సి వస్తోంది. ఆసుపత్రులకు రాకపోకలు సాగించడానికి, వసతికి, భోజనాలకు మరింత ఖర్చవుతోంది. ఇదంతా పేద, మధ్యతరగతి వర్గాల రోగుల పాలిట మోయలేని భారంగా మారుతోంది. ఆ రకంగా చూస్తే ముఖ్యమంత్రి ప్రకటించిన పెన్షన్ స్వల్ప మొత్తమేనని, రోగులకు అది ఏ విధంగానూ సరిపోదనే చెప్పాలి. కాకపోతే బస్సు ఛార్జీలకు, భోజనాలకైనా ఉపయోగపడుతుందనే ఆశతో పెన్షన్ కోసం అనేకమంది నిరీక్షిస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తక్షణమే మార్గదర్శకాలు రూపొందించాల్సిన అవసరముంది. అలాగే వేగవంతంగా పథకాన్ని అమలు చేసి బాధిత రోగులకు సత్వరమే పెన్షన్ అందేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

అన్నీ ఒకే చోట ఉంటే బాగుంటుంది



శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో ఉచిత డయాలసిస్ ద్వారానే ప్రాణం తిరిగొచ్చినట్లుగా వుంది. ఇది ఏర్పాటు కాక ముందు తిరుపతిలోని ప్రైవేటు వైద్యశాలలో నెలకు 12-13 సార్లు రక్తశుద్ధి చేసుకోవాల్సి వచ్చేది. ఒకో దఫా రూ.2వేలకు పైగా ఖర్చు పెట్టుకోవాల్సి వచ్చేది. ఇక్కడ సేవలు బాగానే ఉన్నా వైద్య సహాయాల కోసం ఇతర ప్రాంతాలకు తిరగాల్సి వస్తోంది. డయాలసిస్‌కు ముందు, తరువాత సేద తీరేందుకు వసతి ఏర్పాటులేదు.ప్రభుత్వం ఇంకా కొంత ఆర్థిక సాయం అందిస్తే ఖర్చులకు ఉపయోగపడుతుంది.

- కన్నలి వెంకటేష్, మల్లిగుంట, తొట్టంబేడు మండలం.

ప్రభుత్వ ఆసరా అవసరం



నా భర్త రైతు.మాకు ఇద్దరు పిల్లలున్నా విద్యార్థి దశలోనే ఉన్నారు.రెండుమూడు రోజులకోసారి డయాలసిస్ చేసుకోవాలి. ఇంతకు ముందు చెన్నై ప్రైవేటు వైద్యశాలలో రెండేళ్ల నగదు చెల్లించి చేసుకున్నా. దాంతో ఆర్థికంగా మా కుటుంబం బాగా దెబ్బతింది. ప్రస్తుతం ఉచిత సేవలు బాగానే ఉన్నా.. రాకపోకలకు, భోజన ఖర్చులకు, మందులకు, ఇతర అవసరాలకు సర్దుబాటు కావడంలేదు. ప్రభుత్వం తరపు న మరింత ఆసరా అందితే బిడ్డల చదువు సాగుతుంది.

- జయసుధ, వరదయ్యపాళెం.

ఆరుగురు డీటీలకు తహసీల్దార్లుగా పదోన్నతి

చిత్తూరు కలెక్టరేట్: గత కొన్ని సంవత్సరాలుగా పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్న డీటీలకు ఎట్టకేలకు తహసీల్దార్లుగా పదోన్నతులు లభించాయి. డిప్యూటీ తహసీల్దార్లకు తహసీల్దార్లుగా పదోన్నతి కల్పనకై ఈనెల 23న జరగాల్సి వుండిన డిపార్టుమెంటల్ ప్రమోషన్ కమిటీ (డీపీసీ) సమావేశం వాయిదా పడి సోమవారం జరిగింది. అమరావతిలో చీఫ్ కమిషనర్ ఆఫ్ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ (సీసీఎల్‌ఏ) అనిల్ చంద్ర పునీతా అధ్యక్షతన సమావేశం జరిగింది. జోన్ -ఫోర్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో ఇరవైకి పైగా తహసీల్దారు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సెప్టెంబరు 1 నుంచి నూతన ప్యానల్ ప్రారంభం కానున్న నేపథ్యంలో ఇందుకు అనుగుణంగా రోస్టర్ మేరకు సీసీఎల్‌ఏ జోనల్ సీనియారిటీ జాబితా సిద్ధం చేసింది. జాబితాను పరిశీలించిన సీసీఎల్‌ఏ పదోన్నతులు జాబితాపై సంతకం చేసారు. జిల్లా నుంచి పదోన్నతులు పొందిన వారిలో ఎన్.ఎం. గుర్రప్ప (సీఎస్‌డీటీ, బంగారుపాళ్యం), జి. మంజులాదేవి (స్పెషల్ డీటీ హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్, మదనపల్లె), సీఎస్ సురేష్ బాబు (డీటీ పౌరసరఫరాల శాఖ చిత్తూరు), ఎం.బలరాముడు (సీఎస్‌డీటీ, రొంపిచెర్ల), జీవీ నరసింహారావు (కలెక్టరేట్, చిత్తూరు), లక్ష్మీ ప్రసూన (డీటీ కలెక్టరేట్) ఉన్నారు. వీరికి అధికారపూర్వకంగా ఉత్తర్వులు బుధవారం అందనున్నాయి.

పరిశ్రమలకు రూ. 3.5 కోట్ల రాయితీ మంజూరు : కలెక్టర్

చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలోని పరిశ్రమలకు వివిధ రకాల రాయితీల కింద రూ. 3.5 కోట్లను మంజూరు చేసినట్లు కలెక్టర్ పీఎస్ తెలిపారు. మంగళవారం రాత్రి కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ పరిశ్రమల స్థాపనకు త్వరితగతిన అనుమతులు మంజూరు చేయాలన్నారు. తొట్టంబేడు వద్ద త్వరలో రానున్న సిరామిక్ పరిశ్రమల సముదాయానికి నీటి సరఫరా చేయాల్సిందిగా ప్రభుత్వానికి సిఫార్సు చేశామన్నారు. కుప్పంలో నిర్మించే లెదర్ పరిశ్రమలకు అవసరమైన ఫెసిలిటీ సెంటర్‌కు రూ. 6.5 కోట్లకు గాను ప్రభుత్వ వాటాగా రూ.1.87 కోట్లు మంజూరు జరిగిందని పేర్కొన్నారు. స్టాండప్ ఇండియా కింద 500 పరిశ్రమల స్థాపనకు మంజూరు పత్రాలు పంపిణీకి తగుచర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. అనుమతులు మంజూరు చేసే వివిధ ప్రభుత్వ శాఖలు పరిశ్రమల శాఖ అనుమతి లేనిదే పారిశ్రామికవేత్తల దరఖాస్తులను తిరస్కరించరాదన్నారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అనిల్‌కుమార్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ షఫీ అహ్మద్, చిత్తూరు నగరపాలకసంస్థ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, డీఆర్‌డీఏ పీడీ రవిప్రకాష్‌రెడ్డి, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖజేడీ విజయ్‌కుమార్, డీపీవో ప్రభాకర్‌రావు, పరిశ్రమల ప్రమోషన్ అధికారులు పాల్గొన్నారు.



పరిశ్రమల శాఖ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ప్రద్యుమ్న

పది వేల మందికి సభ్యత్వం కల్పించండి

రెడ్‌క్రాస్ కమిటీ సమావేశంలో కలెక్టర్ ఆదేశం



రెడ్‌క్రాస్ సొసైటీ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, పాల్గొన్న సభ్యులు

చిత్తూరు కలెక్టరేట్: జిల్లావ్యాప్తంగా ప్రస్తుత ఏడాది పది వేల మందికి రెడ్‌క్రాస్ సభ్యత్వం కల్పించాలని కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ ప్రతినిధుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెడ్ క్రాస్ సొసైటీ కార్యకలాపాల గూర్చి ప్రజల్లో పూర్తిగా అవగాహన లేదని చెబుతూ సభ్యుల సంఖ్య తక్కువగా వుండడం పట్ల కలెక్టర్ అసంతృప్తి వ్యక్తపరిచారు. సెప్టెంబర్ 10న తహసీల్దార్లు, ఎంపీడీవోలు, వివిధశాఖల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అదేరోజు నుండి స్పెషల్ డ్రైవ్‌గా సభ్యత్వ నమోదు చేపడ్తామన్నారు. మండల, రెవెన్యూ డివిజనల్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని సూచించారు. పోలీసు, పరిశ్రమలు, గనులు, డిగ్రీ, జూనియర్ కళాశాలల అధికారులతో సమన్వయం చేసుకుని సభ్యత్వం పెంచాలన్నారు. పాఠశాలల్లో జూనియర్ రెడ్‌క్రాస్ సొసైటీ ఏర్పాటుకు డీఈవోతో చర్చించి అవగాహన కార్యక్రమాలు రూపొందించాలన్నారు. చిత్తూరు నగరంలో 4 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో రెడ్‌క్రాస్ సొసైటీ భవన నిర్మాణానికి ప్రణాళిక రూపొందించాలన్నారు. సమావేశంలో జేసీ-2 చంద్రమౌళి, చైర్మన్ వి. సుందరనాయుడు, కార్యదర్శి గల్లా రంగనాథం, సభ్యులు బాలకృష్ణారెడ్డి, రమేష్, మనోహర్, ఏవో గోపి తదితరులు పాల్గొన్నారు.

వికలాంగ హాస్టల్ విద్యార్థులకు మెస్‌ఛార్జీల పెంపు

చిత్తూరు రూరల్: తిరుపతి అంధుల శరణాలయంలో కళాశాల విద్యనభ్యసిస్తున్న విద్యార్థులకు ప్రభుత్వం మెస్‌ఛార్జీలను పెంచింది. ఈ మేరకు మంగళవారం ఉత్తర్వ్యులు జారీ చేసింది. రాష్ట్రంలో కృష్ణా, గుంటూరు, చిత్తూరు జిల్లాల్లో అంధుల శరణాలయాలు ఉన్నాయి. ఈ మూడు శరణాలయాల్లో 850 మంది హాస్టళ్లలో చదువుకుంటుండగా తిరుపతిలోని అంధుల శరణాలయంలో 70 మంది కళాశాల విద్యార్థులు చదువుకుంటున్నారు. ఒక్కో విద్యార్థికి నెలకు ప్రభుత్వం ఇది వరకు రూ.850 ఇచ్చేది. విద్యార్థుల అవసరాలకు సరిపోకపోవడంతో ప్రభుత్వం రూ. 1050గా పెంచింది.

ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్ పోస్టులకు ఇంటర్వ్యూలు

చిత్తూరు రూరల్: జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖలో ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టులకు మంగళవారం కలెక్టరేట్‌లో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఆరుగురు సభ్యులతో కూడిన కమిటీ ఇంటర్వ్యూలను నిర్వహించింది. జిల్లాలో 70 సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉండగా 150 మంది హాజరయ్యారు. ఇన్‌ఛార్జి పీడీ లక్ష్మి ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాల కల్పనపై సమీక్షా సమావేశాన్నినిర్వహించారు.

డీఎస్పీల గైర్హాజరుతో సీకే బాబు హత్యాయత్నం కేసు 14కు వాయిదా

చిత్తూరు లీగల్: మాజీ ఎమ్మెల్యే సీకేబాబుపై జరిగిన హత్యాయత్నం కేసు విచారణను 9వ కోర్టు జడ్జి కపర్థి వచ్చే నెల 14కు వాయిదా వేసారు. మంగళవారం కోర్టుకు రావాల్సిన ఇద్దరు డీఎస్పీలు గైర్హాజరయ్యారు. దీంతో వచ్చే వాయిదాకు తప్పక హాజరుకావాలని... లేకుంటే గివనప్ చేయాల్సివుంటుందని జడ్జి ఆదేశాలు జారీ చేసారు. సీకే బాబు 2007 డిసెంబర్ 31న నగరంలోని సాయిబాబా ఆలయం వెళ్ళేందుకు కణ్ణన్ కళ్యాణ మండపం ఎదురుగా వున్న కల్వర్టు మీద వెళుతుండగా ప్రత్యర్థులు మందుపాతర పేల్చారు. ఈ సంఘటనపై వన్ టౌన్ పోలీసులు కటారి మోహన్, చింటూ, కటారి ప్రవీణ్‌తో పాటు మరో 14 మందిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులోని సాక్షులను విచారించేందుకు 9వ కోర్టు జడ్జి షెడ్యూల్ ఖరారు చేసారు. ఇప్పటివరకు కోర్టు 44 మందిని విచారించింది. మిగిలిన ఇద్దరు డీఎస్పీలు అల్లాబక్ష్, సురేంద్రరెడ్డి మంగళవారం కోర్టుకు హాజరుకావల్సివుండగా వారు గైర్హాజరయ్యారు. దీంతో ఆ ఇద్దరు వచ్చేనెల 14న తప్పక హాజరుకావాలని లేకుంటే గివనప్ చేస్తానని జడ్జి ఆదేశాలు జారీచేసారు.

చింటూ వాయిస్ రికార్డింగ్ పిటీషన్‌పై 4న వాదనలు

సీకేబాబుపై జరిగిన హత్యాయత్నం కేసులో వాయిస్ రికార్డింగ్ కోరుతూ దాఖలైన పిటీషన్‌పై 9వ కోర్టు జడ్జి కపర్థి వచ్చేనెల 4న వాదనలు విననున్నారు. 2017లో సీకే బాబుపై జరిగిన హత్యాయత్నం కేసులో కోర్టు 44 మంది సాక్షులను విచారించింది. ఈ కేసు చివరి దశకు చేరుకున్న తరుణంలో సీకే బాబును హత్యచేసేందుకు తనతో పాటు కటారి మోహన్ ప్రయత్నించినట్లు చింటూ స్వయంగా ఒప్పుకున్నాడని, దీనికి సంబంధించిన సీడీని 2007 ఏప్రిల్‌లో అప్పటి ఎస్పీ శశిధర్‌రెడ్డికి విచారణాధికారులు పంపారని సమాచారం. ఈ సీడీని కోర్టులో ప్రవేశపెట్టాలని సీకేబాబు తరపు న్యాయవాదులు వాదనలు వినిపించి ఆఖరికి ఈ పిటీషన్‌ను వాపసు తీసుకొన్న విషయం తెలిసిందే. ఈ పిటీషన్‌ను ఏపీపీ కోర్టులో దాఖలు చేయగా మంగళవారం వాయిదాకు వచ్చింది. అయితే జడ్జి ఈ పిటీషన్‌పై వాదనలు వినేందుకు వచ్చే నెల 4వ తేదీకి వాయిదా వేసారు.

విద్యార్థుల భాగస్వామ్యంతో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

ఎస్పీ రాజశేఖరబాబు కసరత్తు

బంగారుపాళ్యం: రోడ్డు ప్రమాదాల నివారణలో డిగ్రీ కళాశాలల విద్యార్థులను భాగస్వాములను చేయాలనుకుంటునున్నట్లు ఎస్పీ రాజశేఖర బాబు తెలిపారు. అత్యధిక ప్రమాదాలు నమోదవుతున్న బంగారుపాళ్యం పోలీస్ స్టేషన్ పరిధిలోని జాతీయ రహదారిని ఆయన మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు డిగ్రీ కళాశాల విద్యార్థుల్లో చైతన్యం తీసుకొచ్చి ఆరుగురు సభ్యుల చొప్పున ఓ గ్రూపుగా ఏర్పాటు చేసి జాతీయ రహదారిపై ఉన్న పెట్రోలు బంకుల వద్ద స్వచ్ఛందంగా వారు కొన్ని గంటలు వాహనదారులను అప్రమత్తం చేసే విధంగా చర్యలు తీసుకోవాలని పలమనేరు డీఎస్పీ శంకర్, గంగవరం ఇన్ చార్జి సీఐ సురేంద్రరెడ్డి, ప్రమాదాల నివారణ ప్రత్యేక అధికారి డీఎస్పీ శ్రీకాంత్ రెడ్డితో పాటు ఎస్ఐ నెట్టికంఠయ్యలకు సూచించారు. జాతీయ రహదారి వెంబడి ఉన్న పెట్రోలు బంకుల వద్ద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి లౌడ్ స్పీకర్ల ద్వారా ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టులు పెట్టుకోవాలని నిరంతరం ప్రసారమయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.



డీఎస్పీ శంకర్‌కు సూచనలిస్తున్న ఎస్పీ రాజశేఖరబాబు

మొగిలి ఘాట్ రోడ్డులో ప్రమాదాలు తీవ్రంగా జరుగుతుండడంతో జాతీయ రహదారి వెంబడి ఘాట్ రోడ్డులో బ్లాక్ జోన్ గా హెచ్చరిక బోర్డులను ఉంచాలని సూచించారు. ఈ విషయంలో సీపీవోల సేవలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు.సిబ్బంది తక్కువగా ఉండడంతో రోడ్డు ప్రమాదాల నివారణపై దృష్టి సారించలేక పోతున్నామని ఎస్పీ దృష్టికి అధికారులు తీసుకురాగా తగినంత సిబ్బందిని స్టేషన్ కు కేటాయిస్తామని ఎస్పీ హామీ ఇచ్చారు.

దూరవిద్య పరీక్షల్లో కాపీయింగ్‌కు చెక్

- రెండోరోజు 8 మంది డీబార్

మదనపల్లె రూరల్: ఎస్వీ యూనివర్శిటీ పరిధిలో జరుగుతున్న దూరవిద్య పరీక్షల్లో అక్రమాలకు యూనివర్శిటీ అధికారులు చెక్‌పెట్టారు. దీంతో మేము పాస్ చేయిస్తాం అంటూ నిరుద్యోగులు, ఉద్యోగులతో వేలరూపాయలు గుంజిన దళారులకు గొంతులో వెల్లక్కాయ పడినట్లయింది. మంగళవారం బీటీకళాశాల కేంద్రంలో జరుగుతున్న పరీక్షల్లో మాస్‌కాపీయింగ్‌కు పాల్పడుతున్న ఎనిమిది మందిని యూనివర్సిటీ అధికారి శ్రీనివాసనాయక్ డీబార్ చేశారు. మదనపల్లె, బి.కొత్తకోట పట్టణాల నుంచి పెద్దసంఖ్యలో ప్రభుత్వ ఉద్యోగులు, నిరుద్యోగులు డిగ్రీ, పీజీ దూరవిద్యకు దరఖాస్తు చేసుకన్నారు. గతంలో ప్రైవేటు కళాశాలల్లో దూరవిద్యపరీక్షలు నిర్వహించడంతో కొంత మంది దళారులు అభ్యర్థుల నుంచి రూ.2వేలు చొప్పున నగదు వసూలు చేసి, పరీక్ష కేంద్రం నిర్వాహకులకు కొంత ముట్టజెప్పి కాపీయింగ్ చేయించేవారు. దీంతో ఈ అక్రమాలకు చెక్ పెట్టడానికి ఎస్వీయూ అధికారులు ఈ సారి ప్రభుత్వ కళాశాలల్లోనే దూరవిద్య పరీక్ష కేంద్రాలను కేటాయించారు. అంతేకాక



బీటీ కళాశాలలో దూరవిద్య పరీక్ష రాస్తున్న అభ్యర్థులు

అబ్జర్వర్‌లను నియమించి, స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో బి.కొత్తకోట, మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాలకు చెందిన వందలాది మంది పట్టణంలోని బీటీ కళాశాల, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల కేంద్రాల్లో దూరవిద్య పరీక్షలురాస్తున్నారు. కాగా పరీక్షలు పగడ్బందీగా ఎటువంటి కాపీయింగ్ జరగనివ్వకుండా జరుగుతుండటంతో దళారుల గొంతులో పచ్చి వెల్లక్కాయ పడినట్లు అల్లాడుతున్నారు.

విజలాపురం గురుకుల పాఠశాల మార్పునకు చర్యలు

రామకుప్పం: మండల పరిధిలోని విజలాపురం సాంఘిక సంక్షేమ ఆదర్శ పాఠశాలను రామకుప్పం ఎస్టీ గురుకుల పాఠశాలలోకి తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు సోషియల్ వెల్ఫేర్ డీసీఓ రవింద్రనాథ్ తెలిపారు. సోమవారం ఉదయం పాఠశాలలో అల్పాహారంలో బల్లిపడి పలువురు విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. దీంతో డీసీఓ మంగళవారం పాఠశాలను సందర్శించి, విద్యార్థులతో సమావేశమయ్యారు. రేకులషెడ్‌లో వంట చేయడం వల్లే భోజనంలో బల్లి పడిందని విద్యార్థులు ఆయనకు చెప్పారు. దీనిపై డీసీఓ స్పందిస్తూ ఈ పాఠశాలను వెంటనే రామకుప్పం ఎస్టీ బాలుర గురుకుల పాఠశాల భవనంలోకి మారుస్తామన్నారు.



విద్యార్థులను పరీక్షిస్తున్న వైద్యాధికారి హరినాథరెడ్డి

వేదవ్యాస, గాయత్రి పథకాల నమోదుకు రేపు ఆఖరు

తిరుపతి (సాంస్కృతికం): ఏపీ బ్రాహ్మణ కార్పొరేషన్ ద్వారా 1నుంచి పీజీ వరకు చదువుతున్న విద్యార్థులకోసం ప్రవేశపెట్టిన వేదవ్యాస్, గాయత్రి పథకాలు ఆన్‌లైన్ నమోదుకు 31వ తేదితో ముగియనున్నట్లు ఏబీసీ జిల్లా సమన్వయ కర్త సీహెచ్ హనుమంతరావు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే, వృద్ధులకు, అనాథ బాలలకు కాశ్యప పథకం ద్వారా అందించే పెన్షన్లకు సెప్టెంబరు 15వ తేది లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 18001083579 టోల్‌ఫ్రీ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు.

పలు మండలాల్లో వర్షం


చిత్తూరు కలెక్టరేట్: జిల్లాలో పలు మండలాల్లో తేలికపాటి వర్షాలు కురిసాయి. గడచిన 24 గంటల్లో అత్యధికంగా పీలేరు మండలంలో 32.4 మి.మీ, అత్యల్పంగా కలకడ మండలంలో 1.2 మి.మీ వర్షం పడింది. మండలాలవారీగా వర్షపాతం వివరాలు ఇలావున్నాయి. పెద్దమండ్యంలో 4.8, తంబళ్ళపల్లెలో 3, ములకలచెరువులో 7.8, పీటీఎంలో 4.6, బి.కొత్తకోటలో 1.8, కురబలకోటలో 11.2, గుర్రంకొండలో 7.8, కలకడలో 1.2, కేవీపల్లెలో 1.2, ఎర్రావారిపాళ్యంలో 31.8, చిన్నగొట్టిగల్లులో 16.4, పీలేరులో 32.4, కలికిరిలో 27, వాల్మీకిపురంలో 22.4, నిమ్మనపల్లెలో 15.2, మదనపల్లెలో 18.4, సోమలలో 2.2, పులిచెర్లలో 14.4, పాకాలలో 2.4 మి.మీ వర్షపాతం నమోదైంది.

తాతయ్య కోసం.. ఓ యాప్



ఓ పదహారేళ్ల అమ్మాయి.. తన తాతయ్య కంటి సమస్యను చూడలేక .. దాని గురించి తెలుసుకోవడం మొదలుపెట్టింది. ఆ సమస్యను పరిష్కరించే పనిలో భాగంగా పరిశోధన మొదలుపెట్టింది. ఎంతోమంది పేదవాళ్లు, వృద్ధులు 'డయాబెటిక్ రెటినోపతి'తో బాధపడుతున్నారని తెలుసుకుని బాధపడింది.ఆ వ్యాధిని నిర్ధారించేందుకు 'ఐ అగ్నోసిస్' (eyeagnosis) అనే ఓ యాప్‌ను కనిపెట్టింది. మీట్ అవర్ తెలుగమ్మాయి కావ్య కొప్పరపు.

క్లిక్ అండ్ ఫైండ్



కావ్య కొప్పరపు తన ఇంటర్ మొదటి సంవత్సరం(2016) పూర్తి చేసుకుని, వేసవి సెలవుల్లో తాతయ్య ఇంటికి వచ్చింది. వాళ్ల తాతయ్యకు 2013లో 'డయాబెటిక్ రెటినోపతి' ఉన్నట్లు తెలిసింది. 'ఈ వ్యాధి కారణంగా రెటినాలోని రక్తనాళాలు దెబ్బతింటాయి. అంతేకాదు ఆ వ్యాధి ముదిరితే పూర్తిగా చూపు కోల్పోయే ప్రమాదం కూడా ఉంది. తన తాతయ్యకు వచ్చిన జబ్బు గురించి కావ్య తెలుసుకోవడం మొదలుపెట్టింది. ప్రపంచవ్యాప్తంగా 415 మిలియన్ ప్రజలు డయాబెటిస్‌తో బాధపడుతున్నారని, అందులో 25 శాతం మందికి 'రెటినోపతి' వచ్చే అవకాశం ఉందని తెలుసుకుంది. ఎక్కువమంది పేదలు, వృద్ధులే ఈ వ్యాధి బారినపడుతున్నారు. రెటినోపతి వచ్చిందో, రాలేదో తెలుసుకోవడానికి ఎంతో ఖర్చవుతుంది. ఆర్థిక సమస్యల కారణంగా చాలామంది ఈ వ్యాధి నిర్ధారించుకోలేక అంధులుగా మారుతున్నారనే విషయం కావ్యకు బోధపడింది. అందుకే 'ఐ అగ్నోసిస్' అనే యాప్‌ను రూపొందించింది. రెండు గంటల్లో నిర్ధారించే 'రెటినోపతి' వ్యాధిని ఈ యాప్ ఆధారంగా కేవలం కొన్ని నిమిషాల్లోనే చెప్పొచ్చు. త్రీడీ లెన్స్ కలిగిన 'ఐ అగ్నోసిస్' యాప్ కంటిని ఫొటో తీయడం ద్వారా 'రెటినోపతి' ఉందో, లేదో ఈజీగా తెలుసుకోవచ్చు. ఈ యాప్ తయారు చేయడంలో కావ్య తమ్ముడు నియంతX , క్లాస్‌మేట్ జాంగ్ సహకారం అందించారు. అమెరికాలోని న్యూయార్క్‌లో గత నెలలో జరిగిన 'ఓ రియాలిటీ ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాన్ఫరెన్స్'లో ఈ ప్రాజెక్టు గురించి కావ్య వివరించింది.

పదహారేళ్ల కావ్య చక్కగా చదువుకుంటోంది. ప్రశాంతత కోసం పాటలు వింటుంది, తన ఆనందం కోసం పియానో ప్లే చేస్తుంది. ఇతరులకు సాయం చేయాలనే తపనతో ఓ స్వచ్ఛంద సంస్థను నడిపిస్తోంది. బాలికలు, స్త్రీలకు కంప్యూటర్ స్కిల్స్ పెంపొందించాలనే ఉద్దేశంతో 'గర్ల్స్ కంప్యూటింగ్ లీగ్' పేరుతో ఓ ఇన్‌స్టిట్యూట్‌ను ప్రారంభించింది. పేదపిల్లలకు 'కోడింగ్ వర్క్‌షాప్స్' కూడా నిర్వహిస్తోంది.



'నేను ఎంతో మంది కంటి డాక్టర్లు, నిపుణులతో పాటు పాథాలజిస్ట్స్, బయోకెమిస్ట్స్, ఎపిడెమియోలజిస్ట్స్, న్యూరో సైంటిస్ట్స్‌లను సంప్రదించాను. వారి సలహాలు, సూచనలు తీసుకున్నాను. గూగుల్‌లో కూడా ఎంతో శోధించాను. చివరగా అనుకున్నది సాధించాను. నాకెంతో సంతోషంగా ఉంది.'


- కావ్య

'కావ్య అద్భుతం చేసింది. తాను రూపొందించిన ఈ యాప్ ఎంతోమందికి ఉపయోగపడుతుంది. ఇప్పుడున్న నిర్ధారణ చికిత్సలన్నింటి కన్నా దీంతో వ్యయం చాలా తక్కువ అవుతుంది. ప్రాసెస్ కూడా చాలా తేలిక. ఎంతోమంది నిపుణులు చేయలేని పని ఈమె చేసి చూపించింది. కావ్యకు నా అభినందనలు.'


- హెజ్ మాన్సిక్ (అమెరికాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్‌లో విజువల్ డిసీజ్ ఎక్స్‌పర్ట్)

ఔనా!

నెమళ్లలో మగవాటిని 'పీకాక్', ఆడవాటిని 'పీహెన్', పిల్లను 'పీచిక్', గుంపును 'పార్టీ' అంటారు.



దారి కనుక్కోండి



చెప్పగలరా?


జారులో ఉన్నా కానీ
పోరులో లేను
తీపిలో ఉన్నా కానీ
తాపిలో లేను
ప్రాయంలో ఉన్నా కానీ
ప్రాణంలో లేను
అయితే ఇంతకీ
నేనెవర్నో చెప్పగలరా?

మీకు తెలుసా?



అరటిపండ్లు సూర్యుని దిశగా పెరగటం వల్ల వంకరగా ఉంటాయట!

చుక్కలు కలపండి



జవాబులు

(printed upside down)

చెప్పగలరా? : జాతీయం
జంతర్‌మంతర్ : 1. రాజకీయం 2. అత్యున్నతం 3. అవినీతి 4. వర్తమానం
జంబ్లింగ్ వర్డ్స్ : 1. BLOW/ BOWL 2. LORD 3. LAMP/PALM 4. TALL

టంగ్ ట్విస్టర్స్

1. It's not the cough that carries you off, it's the coffin they carry you off in!
2. I wish you were a fish in my dish
3. Dust is a disk's worst enemy.
4. She said she should sit. , She said she should sit.

నవ్వుల్ నవ్వుల్

డిశ్చార్జ్ అయి వెళ్లిపోతున్న పేషెంట్‌తో
డాక్టర్: ఇప్పుడు తేలిగ్గానే అనిపిస్తోందా?
రోగి: (పర్సు తడుముకుంటూ): హా... చాలా తేలిగ్గా అనిపిస్తోంది.

సూక్తి

పని చేసేటప్పుడు.. ఆలోచన పని మీదే ఉండాలి. ఫలితం మీద కాదు.

రంగులు వేయండి



పదాలు గుర్తించండి

shoe
duck
doll
globe
block
green



x	k	c	o	l	b
l	n	e	e	r	g
l	g	l	o	b	e
o	q	n	c	w	c
d	n	s	h	o	e
u	w	k	c	u	d

జంబ్లింగ్ వర్డ్స్

1. BLWO ▶ ....
2. LDOR ▶ ....
3. ALPM ▶ ....
4. TLAL ▶ ....

జంతర్ మంతర్

1. రాయంజకీ ▶ ....
2. అన్నతంత్యు ▶ ....
3. నీఅతివి ▶ ....
4. నంవమార్త ▶ ....



శేషుడిపై వరసిద్ధుడు

కాణిపాకం పురవీధులలో అష్టోత్తర శత కలశ ఊరేగింపు

ఐరాల(కాణిపాకం): ప్రముఖ పుణ్యక్షేత్రమైన కాణిపాకంలో నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాలలో మంగళవారం స్వామి వారు శేష వాహనంపై భక్త జనకోటికి దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమానికి కాణిపాకం, వడ్రాంపల్లె, మిట్టఇండ్లు, కొత్తపల్లె, అడప గుండ్లపల్లె, బొమ్మసముద్రం, తిమ్మోజిపల్లె, తిరువణంపల్లె, చిగరపల్లె, అగరంపల్లె గ్రామాలకు చెందిన కమ్మ వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ప్రధాన ఆలయాన్ని, స్వర్ణధ్వజ స్తంభాన్ని, సుపధ మండపాన్ని వివిధ రకాల పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. ఉదయం మూల విరాట్‌కు పంచామృత అభిషేకంను నిర్వహించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. సిద్ధి, బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవమూర్తులను స్వర్ణ శేష వాహనంపై ఉంచి కాణిపాకపుర వీధుల్లో వైభవంగా ఊరేగించారు.



వినాయకుడికి అభిషేకం నిర్వహిస్తున్న అర్చకుడు ధర్మేశ్వరగురుకుల్

తిరుమల తరహాలో కోలాటాలు, వేషధారణలు

శేష వాహన సేవ సందర్భంగా కోలాటాలు, భజనలు, ఆకట్టుకునే వేషధారణలు తిరుమల తరహాలో ఉండటంతో భక్తులను ఎంతగానో అలరించాయి. వంద మంది కళాకారులు ఊరేగింపు ముందు సంప్రదాయ దుస్తులతో కోలాటాలు వేస్తుంటే భక్తులు మైమరచిపోయారు. వెంకటగిరికి చెందిన శ్రీసిద్ధి వినాయక కల్చరర్ అసోసియేషన్ బృందం నిర్వహించిన రామాంజనేయ యుద్ధం పౌరాణిక నాటకం అందరినీ ఆకట్టుకుంది. దేవస్థాన కార్యక్రమాలలో ఈవో పూర్ణ చంద్రరావు, సర్పంచ్ మధుసూదన్‌రావు, ఏఈవోలు కేశవరావు,రవీంద్రబాబు, సూపరింటెండెంట్లు స్వాములు, ప్రసాద్, ఇన్‌స్పెక్టర్లు రమేశ్,మల్లికార్జున, ఉభయదారులు పాల్గొన్నారు.



ఆకట్టుకునే వేషాల్లో కళాకారులు



ఉదయం చిన్న శేష వాహనంపై ఊరేగుతున్న వరసిద్ధి వినాయకుడు

ఘనంగా అష్టోత్తర శతకలశ ఊరేగింపు



తిరుమల తరహాలో కాణిపాక బ్రహ్మోత్సవ వైభవం







కాణిపాక స్వామికి పుష్పార్చన

ఘనంగా అష్టోత్తర శత కలశ ఊరేగింపు

శేష వాహన సేవను పురస్కరించుకొని వాహన ఉభయదారులు, భక్తులు కాణిపాకం పురవీధులలో ఉదయం చిన శేష వాహనం వెంట క్షీరంతో నిండిన అష్టోత్తర శత కలశాలను ఊరేగించారు. అలంకార మండపం సిద్ధి,బుద్ధి సమేత వరసిద్ధి వినాయక స్వామి ఉత్సవవిగ్రహాలకు వైభవంగా క్షీరాభిషేకాన్ని నిర్వహించారు.

కాణిపాకంలో నేడు

కాణిపాకం బ్రహ్మోత్సవాలలో బుధవారం వరసిద్ధునికి వృషభ వాహన సేవను నిర్వహించనున్నారు. ఉదయం స్వామివారికి నిర్వహించే అభిషేకానికి కాణిపాకానికి చెందిన ఆర్యవైశ్యులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు. అలాగే రాత్రి వృషభ వాహన సేవకు కాణిపాకం, సంతపల్లె, మారేడుపల్లె, ముదిగోళం, చిత్తూరుకు చెందిన శాలివాహన వంశస్థులు ఉభయదారులుగా వ్యవహరించనున్నారు.



కాణిపాక పురవీధులలో కోలాటం

ఊరేగింపులో విచిత్ర వేషధారణలు



‘భిన్న పరీక్ష’ నుంచి కచ్చితంగా ప్రశ్నలు

భిన్న పరీక్ష

ప్రస్తుత పోటీ పరీక్షల్లో భిన్న పరీక్ష విభాగానికి సంబంధించిన ప్రశ్నలు రెండు లేదా మూడు తప్పనిసరిగా ఉంటున్నాయి. ఎస్ఐ తదితర పరీక్షల్లో ఈ విభాగం నుంచి 8 లేదా 10 ప్రశ్నలు కచ్చితంగా వస్తున్నాయి. కాబట్టి రీజనింగ్‌లో ఈ టాపిక్ చాలా ముఖ్యమైంది. ఈ టాపిక్‌కు సంబంధించిన ప్రశ్నల్లో నాలుగు లేదా ఐదు పదాలు/ పదాల జతలు / సంఖ్యలు/ వర్ణమాల అక్షరాల సమూహాలను ఇస్తారు. ప్రశ్న & సమాధానాలుగా ఇచ్చే ఎ, బి, సి, డిల్లో ఒకటి మినహా మిగిలినవన్నీ ఒకే లక్షణంతో ఉంటాయి. ఆ విధంగా భిన్నంగా ఉండే పదం/ పదాల జత/ సంఖ్య/ వర్ణమాల అక్షరాల సమూహాన్ని సమాధానంగా గుర్తించాలి. అంటే ఇచ్చిన ఎ, బి, సి, డిల్లో భిన్నంగా ఉన్న దానిని తొలగించాలి.

ఈ విభాగంలో మూడు మోడల్స్ ఉన్నాయి. అవి..

1. పదాలతో భిన్న పరీక్ష
2. భిన్నమైన సంఖ్యను కనుక్కోవడం
3. భిన్నమైన వర్ణమాల అక్షరాల సమూహాన్ని గుర్తించడం

మోడల్ - 1

పదాలతో భిన్న పరీక్ష

ఇందులో రెండు రకాలు ఉన్నాయి. అవి..

టైప్ 1: నాలుగు పదాలు ఇచ్చి భిన్నమైన దానిని సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 2: నాలుగు పదాల జతలను ఇచ్చి భిన్నమైన జతను సమాధానంగా గుర్తించమని అడుగుతారు.

టైప్ 1

1. ఎ) భరతనాట్యం బి) కూచిపూడి సి) భాంగ్రా డి) యక్షగానం
సమాధానం: సి
వివరణ: భాంగ్రా మినహా మిగిలినవన్నీ శాస్త్రీయ నృత్యాలు. భాంగ్రా జానపద నృత్యం.

2. ఎ) అక్టోబరు బి) నవంబరు సి) డిసెంబరు డి) జనవరి
సమాధానం: బి
వివరణ: నవంబరు మినహా మిగిలిన నెలలకు నెలకు రోజులు 31. కానీ, నవంబరు నెలలో 30 రోజులు మాత్రమే ఉంటాయి.

3. ఎ) ముఖ్యమంత్రి బి) లోక్‌సభ సభ్యుడు సి) రాజ్యసభ సభ్యుడు డి) ప్రధానమంత్రి
సమాధానం: ఎ
వివరణ: ముఖ్యమంత్రి మినహా మిగిలిన వ్యక్తులు కేంద్ర ప్రభుత్వానికి చెందిన వారు.

4. ఎ) కోహిమా బి) ఇంఫాల్ సి) అగర్తల డి) పట్నా
సమాధానం: డి
వివరణ: పట్నా మినహా మిగిలినవన్నీ వివిధ ఈశాన్య రాష్ట్రాల రాజధానులు

5. ఎ) పెల్లాగ్రా బి) బెరిబెరి సి) ఎనీమియా డి) గాయిటర్
సమాధానం: డి
వివరణ: గాయిటర్ మినహా మిగిలనవన్నీ విటమిన్ లోపంతో వస్తాయి. కానీ, గాయిటర్ వ్యాధి మాత్రం అయోడిన్ లోపంతో వస్తుంది.

6. ఎ) బ్యాడ్మింటన్ బి) చెస్ సి) క్యారమ్స్ డి) బిలియర్డ్స్
సమాధానం: ఎ
వివరణ: బ్యాడ్మింటన్ తప్ప మిగిలినవి ఇండోర్ గేమ్స్

7. ఎ) మే బి) జూన్ సి) జూలై డి) ఆగస్టు
సమాధానం: బి
వివరణ: జూన్ మినహా మిగిలిన అన్ని నెలలకు నెలకు 31 రోజులు ఉంటాయి.

8. ఎ) నైల్ బి) ఓల్గా సి) నయాగరా డి) అమెజాన్
సమాధానం: సి
వివరణ: నయాగరా మినహా మిగిలినవన్నీ నదుల పేర్లు. నయాగరా అనేది జలపాతం.

9. ఎ) గుండె బి) నేత్రం సి) చెవి డి) కాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె తప్ప మిగిలినవి జతగా ఉంటాయి.

10. ఎ) నియాసిన్ బి) ట్రిప్సిన్ సి) థయామిన్ డి) రైబోఫ్లోవిన్
సమాధానం: ఎ



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ట్రిప్సిన్ మినహా మిగిలినవన్నీ విటమిన్ పేర్లు. ట్రిప్సిన్ అనేది ఎంజైమ్.

11. ఎ) బంతి బి) చేమంతి సి) తామర డి) గులాబి
సమాధానం: సి
వివరణ: తామర మినహా మిగిలిన పువ్వులన్నీ భూమి మీద పెరుగుతాయి. తామర నీటిలో పెరుగుతుంది.

12. ఎ) పోలెండ్ బి) గ్రీస్ సి) స్పెయిన్ డి) కొరియా
సమాధానం: డి
వివరణ: కొరియా మినహా మిగిలిన దేశాలు యూరప్ ఖండంలోనివి. కానీ, కొరియా ఆసియా ఖండానికి సంబంధించిన దేశం.

13. ఎ) చెన్నై బి) హైదరాబాద్ సి) బెంగళూరు డి) లక్నో
సమాధానం: డి
వివరణ: లక్నో మినహా మిగిలినవన్నీ వివిధ దక్షిణ భారత రాష్ట్రాల రాజధానులు. లక్నో మాత్రం ఉత్తర భారతంలోని రాష్ట్రానికి సంబంధించిన రాజధాని.

14. ఎ) కివి బి) గద్ద సి) పెంగ్విన్ డి) ఆస్ట్రిచ్
సమాధానం: బి
వివరణ: గద్ద మినహా మిగిలిన పక్షులు ఎగరలేనివి. గద్ద ఎగిరే పక్షి.

15. ఎ) గోధుమ బి) ఆవాలు సి) వేరుశనగ డి) వరి
సమాధానం: డి
వివరణ: వరి మినహా మిగిలినవన్నీ రబీ పంటలు. వరి ఖరీఫ్ పంట

16. ఎ) బైకాల్ బి) ఢాల్ సి) చిలక డి) థార్
సమాధానం: డి
వివరణ: థార్ మినహా మిగిలినవన్నీ వివిధ సరస్సుల పేర్లు. థార్ అనేది ఎడారి.

17. ఎ) కోణార్క్ బి) మధురై సి) ఎల్లోరా డి) దిల్వారా
సమాధానం: సి
వివరణ: ఎల్లోరా మినహా మిగిలివన్నీ ప్రసిద్ధ దేవాలయాలు ఉన్న ప్రదేశాలు. ఎల్లోరా ప్రసిద్ధ గుహలు ఉన్న ప్రదేశం

18. ఎ) రుగ్వేదం బి) ఆయుర్వేదం సి) సామవేదం డి) యజుర్వేదం
సమాధానం: బి
వివరణ: ఆయుర్వేదం మినహా మిగిలినవి వేదాలు. అయుర్వేదం అనేది వైద్య శాస్త్రం.

19. ఎ) గ్రానైట్ బి) లిగ్నైట్ సి) ఆంత్రసైట్ డి) బిటుమినస్
సమాధానం: ఎ
వివరణ: గ్రానైట్ మినహా మిగిలినవి బొగ్గు రూపాంతరాలు. గ్రానైట్ అనేది విలువైన రాయి.

20. ఎ) సంతాల్స్ బి) ఖోండ్స్ సి) అబోర్స్ డి) డోగ్రి
సమాధానం: డి
వివరణ: డోగ్రి మినహా మిగిలినవన్నీ వివిధ గిరిజన జాతులు. డోగ్రి అనేది ఒక భాష.

21. ఎ) కాలువ బి) వంతెన సి) ప్రవాహం డి) సెలయేరు
సమాధానం: బి
వివరణ: వంతెన మినహా మిగిలినవి నీటితో ఉంటాయి.

22. ఎ) నేపాల్ బి) టోక్యో సి) కాబూల్ డి) బీజింగ్
సమాధానం: ఎ
వివరణ: నేపాల్ మినహా మిగిలినవి వివిధ దేశాల రాజధానులు. నేపాల్ అనేది ఒక దేశం.

23. ఎ) మహావీరుడు బి) గౌతమబుద్ధుడు సి) మహాత్మాగాంధీ డి) గురునానక్
సమాధానం: సి
వివరణ: మహాత్మాగాంధీ మినహా మిగిలిన వారు ప్రసిద్ధ మతాల స్థాపకులు.

24. ఎ) రాజీవ్‌గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ సి) చరణ్ సింగ్ డి) బాబూ రాజేంద్రప్రసాద్
సమాధానం: డి
వివరణ: బాబూ రాజేంద్రప్రసాద్ మినహా మిగిలినవారు ప్రధానమంత్రులు. బాబూ రాజేంద్రప్రసాద్ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహించారు.

25. ఎ) పాదరసం బి) ఆక్సిజన్ సి) మెగ్నీషియం డి) సోడియం
సమాధానం: ఎ
వివరణ: నాలుగూ మూలకాలే. కానీ, పాదరసం ద్రవరూప మూలకం.

26. ఎ) కలం బి) నల్లబల్ల సి) కాగితం డి) పలక
సమాధానం: ఎ
వివరణ: కలం మినహా మిగిలిన వాటిపై వివిధ వస్తువులతో రాయవచ్చు. కలం మాత్రం రాయడానికి ఉపయోగించేది.

27. ఎ) గారో బి) ఖాశీ సి) కాంగ్రా డి) జెంతియా
సమాధానం: సి
వివరణ: కాంగ్రా మినహా మిగిలినవి కొండలు. కాని, కాంగ్రా లోయ.

28. ఎ) జూన్ బి) సెప్టెంబరు సి) నవంబరు డి) ఆగస్టు
సమాధానం: డి
వివరణ: ఆగస్టు మినహా మిగిలిన నెలలకు నెలకు 30 రోజులు ఉంటాయి. ఆగస్టు నెలకు మాత్రం 31 రోజులు ఉంటాయి.

29. ఎ) మార్చి బి) జూలై సి) ఆగస్టు డి) మే
సమాధానం: సి
వివరణ: అన్ని నెలలకు 31 రోజులు ఉన్నాయి. మార్చి 3వ నెల, జూలై 7వ నెల, మే 5వ నెల అంటే మార్చి, మే, జూలై బేసి నెలలు. ఆగస్టు అనేది 8వ నెల అంటే సరి సంఖ్యకు సంబంధించిన నెల.

30. ఎ) నారింజ బి) పసుపు సి) ఆకుపచ్చ డి) గులాబి
సమాధానం: డి
వివరణ: గులాబీ మినహా మిగిలినవి ఇంద్రధనస్సు రంగుల్లో ఉంటాయి.

31. ఎ) న్యూటన్ బి) మార్కోని సి) బీతావన్ డి) ఫారడే
సమాధానం: సి
వివరణ: బీతావన్ మినహా మిగిలిన వ్యక్తులు శాస్త్రవేత్తలు.

32. ఎ) క్యారట్ బి) అల్లం సి) బీట్‌రూట్ డి) ఆనపకాయ
సమాధానం: డి
వివరణ: ఆనపకాయ మినహా మిగిలిన కూరగాయలు భూమి నుంచి వస్తాయి.

33. ఎ) గుండె బి) చెవి సి) ముక్కు డి) నేత్రాలు
సమాధానం: ఎ
వివరణ: గుండె మినహా మిగిలినవి జ్ఞానేంద్రియాలు.

34. ఎ) బిందుసారుడు బి) బింబిసారుడు సి) అశోకుడు డి) సంప్రాప్తి
సమాధానం: బి
వివరణ: బింబిసారుడు మినహా మిగిలిన వ్యక్తులు మౌర్య వంశానికి చెందిన వారు. బింబిసారుడు హర్యంక వంశానికి వ్యక్తి.

35. ఎ) దాద్రానగర్ హవేలీ బి) అండమాన్ నికోబార్ దీవులు సి) పాండిచ్చేరి డి) జార్ఖండ్
సమాధానం: డి
వివరణ: జార్ఖండ్ మినహా మిగిలినవి కేంద్ర పాలిత ప్రాంతాలు. జార్ఖండ్ అనేది రాష్ట్రం పేరు.

36. ఎ) బుల్లి బి) కార్నర్ సి) బంకర్ డి) డ్రిబుల్
సమాధానం: సి
వివరణ: బంకర్ మినహా మిగిలిన పదాలు హాకీ క్రీడకు సంబంధించినవి.

37. ఎ) బీర్బల్ బి) ఫైజ్ అహ్మద్ సి) అబుల్ ఫజల్ డి) తాన్‌సేన్
సమాధానం: బి
వివరణ: ఫైజ్ అహ్మద్ మినహా మిగిలిన వ్యక్తులు అక్బరు ఆస్థానానికి చెందిన వారు.

38. ఎ) ఆసియా బి) అర్జెంటీనా సి) ఆఫ్రికా డి) ఆస్ట్రేలియా
సమాధానం: బి
వివరణ: అర్జెంటీనా మినహా మిగిలినవి ఖండాల పేర్లు

39. ఎ) మెరీనా బి) జెర్సొప్పా సి) విక్టోరియా డి) ఏంజెల్
సమాధానం: ఎ
వివరణ: మెరీనా మినహా మిగిలినవి జలపాతాలు. మెరీనా అనేది ఒక బీచ్ .

JOBS ఉద్యోగాలు

సిడాక్

నొయిడాలోని సెంటర్ ఫర్ డెవలప్‌మెంట్ ఆఫ్ అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ (సిడాక్)- కింది పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది

మొత్తం ఖాళీలు: 67

ప్రాజెక్ట్ మేనేజర్ **ఖాళీలు:** 2
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీతో పదకొండేళ్లు/ పీజీతో ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 50 ఏళ్లు మించరాదు

ప్రాజెక్ట్ ఇంజనీర్ **ఖాళీలు:** 65
అర్హత: బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ (కంప్యూటర్ సైన్స్/ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ/ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్)/ ఎంసిఏ ఉత్తీర్ణులై ఉండాలి. కనీసం మూడు నుంచి ఏడేళ్ల అనుభవం ఉండాలి
వయసు: 37 ఏళ్లు మించరాదు
ఎంపిక: ఆన్‌లైన్ టెస్ట్/ ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ టెస్ట్: సెప్టెంబరు 23
దరఖాస్తు ఫీజు: రూ.500
ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొన్న తరవాత హార్డు కాపీని నిర్దేశిత చిరునామాకు పంపాలి.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 18
చిరునామా: Section in Charge(HR - II), Ce ntre for Development of Advanced Comp uting(CDAC), Academic Block, B - 30, Institutional Area, Sector - 62, Noida - 201307
వెబ్‌సైట్: http://cdac.in/

ఎస్ఎస్‌సి ఎస్ఆర్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ సదరన్ రీజియన్ (ఎస్ఎస్‌సి ఎస్ఆర్) - కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

మొత్తం ఖాళీలు: 66

టెక్నికల్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 3
అర్హత: డిప్లొమా (హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ టెక్నాలజీ) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 30 ఏళ్లు మించరాదు.

వర్క్‌షాప్ సూపరింటెండెంట్ **ఖాళీలు:** 1
అర్హత: బిఇ/ బిటెక్ (మెకానికల్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు

సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ (వీవింగ్) **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (టెక్స్‌టైల్ టెక్నాలజీ/ టెక్స్‌టైల్ ఇంజ నీరింగ్)/ డిప్లొమా(హ్యాండ్లూమ్ టెక్నాలజీ/ టెక్స్ టైల్ టెక్నాలజీ/ హ్యాండ్లూమ్ & టెక్స్‌టైల్ టెక్నాలజీ) ఉత్తీర్ణతతోపాటు అనుభవం కూడా ఉండాలి
వయసు: 30 ఏళ్లు మించరాదు.

మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 34
అర్హత: 10వ తరగతి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

లేడీ మెడికల్ అటెండెంట్ **ఖాళీలు:** 15
అర్హత: 10వ తరగతితోపాటు ఫస్ట్ ఎయిడ్ సర్టిఫికెట్ ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

కన్జర్వేషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 2
అర్హత: 10వ తరగతితోపాటు డిప్లొమా(సివిల్) పూర్తిచేసి ఉండాలి.
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

జూనియర్ కన్జర్వేషన్ అసిస్టెంట్ ఖాళీలు: 9
అర్హత: 10వ తరగతితోపాటు ఐటిఐ సర్టిఫికెట్ (సివిల్ ఇంజనీరింగ్) ఉండాలి
వయసు: 18 నుంచి 25 ఏళ్ల మధ్య ఉండాలి

ఎవల్యూషన్ అసిస్టెంట్ **ఖాళీలు:** 1
అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి డిగ్రీ (స్టాటిస్టిక్స్/ మేథమెటిక్స్/ ఎకనామిక్స్/ సోషియాలజీ/ సోషల్ వర్క్) ఉత్తీర్ణులై ఉండాలి
వయసు: 18 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ ద్వారా
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 24
దరఖాస్తు హార్డు కాపీ పంపేందుకు చివరి తేదీ: అక్టోబరు 4
వెబ్‌సైట్: www.sscsr.gov.in

రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?

భారత రాష్ట్రపతి

1. భారతదేశ రాజ్యాంగ అధినేత అయిన రాష్ట్రపతి గురించి రాజ్యాంగంలోని ఏ భాగంలో పొందుపరిచారు?
ఎ) మూడో భాగం 12 - 35 ఆర్టికల్
బి) నాలుగో భాగం 36 - 51 ఆర్టికల్
సి) ఐదో భాగం 52 - 62 ఆర్టికల్
డి) ఆరో భాగం 152 - 161 ఆర్టికల్

2. భారతదేశ ప్రథమ పౌరుడు అని ఎవర్ని అంటారు?
ఎ) రాష్ట్రపతి బి) అటార్నీ జనరల్ సి) గవర్నర్ డి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి

3. భారతదేశానికి ఒక రాష్ట్రపతి ఉంటాడు అని తెలిపే ఆర్టికల్?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ

4. భారత రాజ్యాంగాన్ని, చట్టాలను సంరక్షించే బాధ్యత ఎవరికి కల్పించారు?
ఎ) పార్లమెంట్ బి) సుప్రీం కోర్టు
సి) ప్రధానమంత్రి డి) రాష్ట్రపతి

5. భారతదేశ సర్వసైన్యాధ్యక్షుడు ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) సైనిక దళాధిపతి డి) పైవారందరూ

6. కేంద్ర ప్రభుత్వంలో అన్ని కార్యనిర్వాహక సంబంధ, ఒప్పందాలు ఎవరి పేరు మీద జరుగుతాయి?
ఎ) ప్రధానమంత్రి బి) కేంద్ర కేబినెట్
సి) రాష్ట్రపతి డి) కేంద్ర శాసనసభ

7. భారత రాజ్యాంగం ప్రకారం ప్రభుత్వ అధినేత ఎవరు?
ఎ) రాష్ట్రపతి బి) ప్రధానమంత్రి
సి) కేంద్ర మంత్రిమండలి డి) పైవారందరూ

8. రాష్ట్రపతిని ఎవరు ఎన్నుకొంటారు?
ఎ) పార్లమెంట్‌కు ఎన్నికైన ఉభయసభ సభ్యులు
బి) ఎలక్టోరల్ కాలేజ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనసభ సభ్యులు మాత్రమే
డి) పైవారందరూ

9. రాష్ట్రపతి ఎన్నిక, ఎన్నిక విధానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) బ్రిటన్ బి) అమెరికా
సి) ఐర్లాండ్ డి) రష్యా

10. రాష్ట్రపతి ఎన్నిక విధానాలను రాజ్యాంగ పరిషత్తులో ప్రతిపాదించిన వారు?
ఎ) డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్
బి) గోపాలస్వామి అయ్యంగార్
సి) బి.ఎన్.రావ్ డి) కె.ఎం.మున్షీ

11. భారత రాష్ట్రపతిని ఏ దేశ రాజు లేదా రాణితో పోలుస్తారు?
ఎ) బ్రిటన్ బి) నేపాల్ సి) భూటాన్ డి) ఫ్రాన్స్

12. రాష్ట్రపతి ఎన్నిక విధానం గురించి రాజ్యాంగంలోని ఏ అధికరణం తెలుపుతుంది?
ఎ) 52వ బి) 53వ సి) 54వ డి) 55వ

13. రాష్ట్రపతి ఎవరి ఆధ్వర్యంలో ప్రమాణస్వీకారం చేస్తారు?
ఎ) ఉపరాష్ట్రపతి బి) లోక్‌సభ స్పీకర్
సి) సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి
డి) ఎవరూ కాదు

14. రాష్ట్రపతి పదవికి పోటీ చేసే వ్యక్తి కనీస వయసు?
ఎ) 30 ఏళ్లు నిండి ఉండాలి
బి) 31 ఏళ్లు నిండి ఉండాలి
సి) 33 ఏళ్లు నిండి ఉండాలి
డి) 35 ఏళ్లు నిండి ఉండాలి

15. రాజ్యాంగంలో ఏ రాజ్యాంగ సవరణ ద్వారా ఢిల్లీ, పాండిచ్చేరి (కేంద్ర పాలిత ప్రాంతాలు) రాష్ట్రపతి ఎన్నికల్లో పాలుపంచుకొంటున్నాయి?
ఎ) 1992, 70వ రాజ్యాంగ సవరణ
బి) 1992, 73వ రాజ్యాంగ సవరణ
సి) 1992, 74వ రాజ్యాంగ సవరణ
డి) 1976, 42వ రాజ్యాంగ సవరణ

16. షెడ్యూల్డ్ కులాలను నిర్ణయించే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) పార్లమెంట్ బి) రాష్ట్రపతి
సి) జాతీయ ఎస్సీ కమిషన్
డి) కేంద్రమంత్రి మండలి

17. పార్లమెంట్ సభ్యుల సభ్యత్వాన్ని రద్దు చేసే అధికారం ఎవరికి ఉంటుంది?
ఎ) కేంద్ర ఎన్నికల సంఘం
బి) సభాధ్యక్షుడు
సి) రాష్ట్రపతి డి) సుప్రీం కోర్టు

18. రాష్ట్రపతి పదవీకాలం?
ఎ) నాలుగు సంవత్సరాలు
బి) ఐదు సంవత్సరాలు
సి) ఆరు సంవత్సరాలు డి) ఏదీకాదు

19. రాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారిగా ఎవరు వ్యవహరిస్తారు?
ఎ) ఎన్నికల అధికారి బి) కలెక్టర్
సి) లోక్‌సభ సెక్రటరీ జనరల్ డి) లోక్‌సభ స్పీకర్


కొమ్ము సుందర్‌రాజు
పొలిటీ ఫ్యాకల్టీ

జనరల్ స్టడీస్ - ఇండియన్ పాలిటీ



20. రాష్ట్రపతి ఎన్నికల్లో పాల్గొనని సభ్యులు?
ఎ) లోక్‌సభకు నామినేట్ అయ్యే ఇద్దరు ఆంగ్లో ఇండియన్లు
బి) రాజ్యసభలోని 12 మంది నామినేటెడ్ సభ్యులు
సి) రాష్ట్ర శాసనమండలి (విధానపరిషత్తు) సభ్యులందరూ డి) పైవారందరూ

21. లోక్‌సభలో ఏ పార్టీకి, ఏ కూటమికి స్పష్టమైన మెజారిటీ లేనప్పుడు ప్రధాని నియామకంలో రాష్ట్రపతి ఏ అధికారాలు కలిగి ఉంటాడు?
ఎ) విచక్షణాధికారాలు బి) కార్యనిర్వహణాధికారాలు
సి) న్యాయాధికారాలు డి) అత్యవసరాధికారాలు

22. రాష్ట్రపతికి తన అధికార-విధుల నిర్వహణలో సహాయ, సలహాలు అందించడానికి ప్రధాని నేతృత్వంలో ఒక మంత్రి మండలి ఉంటుంది అని తెలిపే అధికరణం?
ఎ) 72వ బి) 73వ సి) 74వ డి) 75వ

23. 1979లో ప్రధాని మొరార్జీదేశాయ్ (జనతా పార్టీ) రాజీనామా చేశారు. అప్పటి లోక్‌సభలో ఏ పార్టీకి మెజారిటీ లేదు. అయితే నాటి రాష్ట్రపతి నీలం సంజీవరెడ్డి తన విచక్షణాధికారంతో ఎవర్ని ప్రధానిగా నియమించారు?
ఎ) చరణ్‌సింగ్ బి) వి.పి.సింగ్
సి) చంద్రశేఖర్ డి) పి.వి.నరసింహారావు

24. రాష్ట్రపతి నివాసమైన రాష్ట్రపతి భవన్ రూపశిల్పులు?
ఎ) హెర్బర్ట్ బేకర్, ఎడ్విన్ లుటియన్స్
బి) కర్జన్, వెవేల్ సి) క్రిప్స్, లుటియన్స్
డి) పైవారందరూ

25. రాష్ట్రపతి పదవి ఖాళీ ఏర్పడితే ఎన్ని నెలల్లో ఎన్నికలు నిర్వహించాలి?
ఎ) నెలలోపు బి) 15 రోజుల్లోపు
సి) ఆరు నెలల్లోపు డి) ఆరు నెలల తరవాత

26. రాష్ట్రపతి ఎన్నికల ఫిర్యాదులు విచారించే అధికారాన్ని పార్లమెంట్ నుంచి సుప్రీం కోర్టుకు ఏ రాజ్యాంగ సవరణ ద్వారా కల్పించారు?
ఎ) 1975, 39వ రాజ్యాంగ సవరణ
బి) 1978, 44వ రాజ్యాంగ సవరణ
సి) 1976, 42వ రాజ్యాంగ సవరణ
డి) 2002, 86వ రాజ్యాంగ సవరణ

27. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను ఏమంటారు?
ఎ) మహాభియోగ తీర్మానం బి) అభిశంసన తీర్మానం
సి) విశ్వాస తీర్మానం డి) అవిశ్వాస తీర్మానం

28. మహాభియోగ తీర్మానాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి స్వీకరించారు?
ఎ) ఐర్లాండ్ బి) బ్రిటన్
సి) ఆస్ట్రేలియా డి) అమెరికా

29. రాష్ట్రపతి తొలగింపు ప్రక్రియను తెలిపే అధికరణం?
ఎ) 58వ బి) 59వ సి) 60వ డి) 61వ

30. ఉపరాష్ట్రపతులుగా పనిచేసి రాష్ట్రపతులుగా ఎన్నికైన వారిని వరుస క్రమంలో గుర్తించండి?
1. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ 2. జాకీర్ హుస్సేన్ 3. వి.వి.గిరి 4. ఆర్.వెంకట్రామన్
5. శంకర్ దయాళ్‌శర్మ 6. కె.ఆర్.నారాయణన్
ఎ) 1, 2, 3, 4, 5, 6 బి) 1, 2, 3, 5, 4, 6
సి) 1, 2, 3, 4, 6, 5 డి) 1, 2, 5, 6, 3, 4

31. ఏ అధికరణం ప్రకారం రాష్ట్రపతి లోక్‌సభకు ఇద్దరు ఆంగ్లో ఇండియన్స్‌ను నామినేట్ చేస్తాడు?
ఎ) 155వ బి) 124వ సి) 331వ డి) 333వ

32. 80(3) అధికరణం ప్రకారం రాజ్యసభకు ఎంత మంది విశిష్ట సభ్యులను రాష్ట్రపతి నామినేట్ చేస్తాడు?
ఎ) ఇద్దరు బి) 12 మంది సి) ఒకరు డి) 15 మంది

33. ఉపరాష్ట్రపతిగా పని చేసి రాష్ట్రపతి ఎన్నికల్లో ఓడిపోయిన ఏకైక వ్యక్తి?
ఎ) నీలం సంజీవరెడ్డి బి) వి.వి.గిరి
సి) భైరాన్ సింగ్ షెకావత్ డి) ఎవరూకాదు

34. భారతదేశంలో యుద్ధం, దురాక్రమణలు సంభవించినప్పుడు రాష్ట్రపతి జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ అధికరణం ద్వారా అమలు చేస్తాడు?
ఎ) 352వ బి) 356వ సి) 366వ డి) 360వ

35. తొలిసారిగా ఏ రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించారు?
ఎ) కర్ణాటక బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) పంజాబ్

36. భారత పార్లమెంట్‌లో రాష్ట్రపతి అంతర్భాగం అని తెలిపే అధికరణం?
ఎ) 59వ బి) 69వ సి) 79వ డి) 89వ

37. భారతదేశంలో అతి ఎక్కువకాలం పనిచేసిన రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) బీహార్
సి) పశ్చిమ బెంగాల్ డి) ఆంధ్రప్రదేశ్

38. భారతదేశంలో మొదటి ముస్లిం రాష్ట్రపతి?
ఎ) జాకీర్ హుస్సేన్ బి) ఫక్రుద్దీన్ అలీ అహ్మద్
సి) ఎ.పి.జె.అబ్దుల్ కలాం డి) హమీద్ అన్సారీ

39. ఏకగ్రీవంగా ఎన్నికైన రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఎ.పి.జె.అబ్దుల్ కలాం బి) జాకీర్ హుస్సేన్
సి) నీలం సంజీవరెడ్డి డి) వి.వి.గిరి

40. భారతదేశ తొలి దళిత ఉపరాష్ట్రపతి, రాష్ట్రపతి ఎవరు?
ఎ) ఆర్.వెంకట్రామన్ బి) శంకర్ దయాళ్‌శర్మ
సి) రామ్‌నాథ్ కోవింద్ డి) కె.ఆర్.నారాయణన్

41. సుప్రీం కోర్టుకు స్వయంగా హాజరై తన వాదనలు వినిపించిన రాష్ట్రపతి ఎవరు?
ఎ) బాబూ రాజేంద్రప్రసాద్ బి) సర్వేపల్లి రాధాకృష్ణన్
సి) వి.వి.గిరి డి) నీలం సంజీవరెడ్డి

42. ప్రస్తుతం 14వ రాష్ట్రపతిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్రానికి చెందిన వారు?
ఎ) బీహార్ బి) ఉత్తరప్రదేశ్
సి) ఆంధ్రప్రదేశ్ డి) మధ్యప్రదేశ్

43. రాష్ట్రపతిగా ఎన్నిక కాకముందు రామ్‌నాథ్ కోవింద్ ఏ రాష్ట్ర గవర్నర్‌గా బాధ్యతలు నిర్వహించారు?
ఎ) కర్ణాటక బి) ఉత్తరప్రదేశ్
సి) బీహార్ డి) మధ్యప్రదేశ్

44. ప్రస్తుత రాష్ట్రపతి బీహార్ 36వ గవర్నర్‌గా పని చేసిన కాలం?
ఎ) 2012-17 బి) 2015-17 సి) 2016-17 డి) 2014-17

45. రామ్‌నాథ్ కోవింద్ మొదటిసారిగా 1994లో ఏ రాష్ట్రం నుంచి రాజ్యసభకు ఎన్నికయ్యారు?
ఎ) బీహార్ బి) గుజరాత్
సి) రాజస్థాన్ డి) ఉత్తరప్రదేశ్

46. ప్రస్తుత రాష్ట్రపతితో ప్రమాణ స్వీకారం చేయించిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి?
ఎ) జస్టిస్ జగదీష్‌సింగ్ ఖేహర్
బి) జస్టిస్ కె.జి.బాలకృష్ణన్ సి) జస్టిస్ దీపక్ మిశ్రా
డి) జస్టిస్ దీపక్ గుప్తా

47. జాకీర్ హుస్సేన్ మరణానంతరం తాత్కాలిక రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన తొలి ఉపరాష్ట్రపతి?
ఎ) సర్వేపల్లి రాధాకృష్ణన్ బి) వి.వి.గిరి
సి) బి.డి.జెట్టి డి) మహ్మద్ హిదయతుల్లా

48. రాష్ట్రపతి జీతాన్ని ఎక్కడ నుంచి చెల్లిస్తారు?
ఎ) ఆర్‌బిఐ నుంచి
బి) భారత ఆగంతుక నిధి నుంచి
సి) భారత సంఘటిత నిధి నుంచి డి) ఏదీకాదు

49. ఏ రాష్ట్రం నుంచి ఎక్కువ మంది రాష్ట్రపతిగా ఎన్నికయ్యారు?
ఎ) తమిళనాడు బి) ఆంధ్రప్రదేశ్
సి) ఉత్తరప్రదేశ్ డి) మహారాష్ట్ర

50. భారత మొదటి మహిళా రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ ఏ రాష్ట్రానికి చెందినవారు?
ఎ) తమిళనాడు బి) ఉత్తరప్రదేశ్
సి) మహారాష్ట్ర డి) కర్ణాటక

సమాధానాలు

		15) ఎ	24) ఎ	33) సి	42) బి
		16) బి	25) సి	34) ఎ	43) సి
1) సి	8) బి	17) సి	26) బి	35) డి	44) బి
2) ఎ	9) సి	18) బి	27) ఎ	36) సి	45) డి
3) ఎ	10) బి	19) సి	28) డి	37) బి	46) ఎ
4) డి	11) ఎ	20) డి	29) డి	38) ఎ	47) బి
5) ఎ	12) సి	21) ఎ	30) ఎ	39) సి	48) సి
6) సి	13) సి	22) సి	31) సి	40) డి	49) ఎ
7) బి	14) డి	23) ఎ	32) బి	41) సి	50) సి

అడ్మిషన్స్

జామ్ 2018

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో పీజీ కోర్సుల ప్రవేశానికి ఉద్దేశించిన **జాయింట్ అడ్మిషన్ టెస్ట్ ఫర్ ఎమ్మెస్సీ(జామ్) 2018**కి ప్రకటన వెలువడింది.
పీజీ కోర్సులు: ఎమ్మెస్సీ/ జాయింట్ ఎమ్మెస్సీ పీహెచ్‌డీ/ ఎమ్మెస్సీ - పీహెచ్‌డీ డ్యూయెల్ డిగ్రీ
టెస్ట్ పేపర్స్ - కోడ్: బయో టెక్నాలజీ(బిటి)/ కెమిస్ట్రీ(సివై)/ జియాలజీ(జిజి)/ మేథమెటికల్ స్టాటిస్టిక్స్(ఎంఎస్)/ బయోలాజికల్ సైన్స్(బిఎల్)/ మేథమెటిక్స్(ఎంఏ)/ ఫిజిక్స్(పీహెచ్)
అర్హత: గుర్తింపు పొందిన సంస్థ నుంచి డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి
జామ్ 2018 జరిగే తేదీ: 2018 ఫిబ్రవరి 11
ఫలితాల విడుదల: 2018 మార్చి 20
ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ ప్రారంభం: సెప్టెంబరు 5
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: అక్టోబరు 10
వెబ్‌సైట్: www.jam.iitb.ac.in

ఉస్మానియా యూనివర్సిటీ

ఉస్మానియా యూనివర్సిటీ ఆధ్వర్యంలోని ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ (పీజీఆర్‌ఆర్‌సిడిఇ)- **పీజీ డిప్లొమా (బయో ఇన్ఫర్మాటిక్స్)** కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: 50 శాతం మార్కులతో బీఎస్సీ/ బీఫార్మసీ/ బీఎస్సీ - అగ్రి/ ఎంబీబీఎస్/ బీవీఎస్సీ/బీడీఎస్/ బీహెచ్ఎంఎస్/ బీఏఎంఎస్/ బీయూఎంఎస్/ బీఈ/ బీటెక్/ ఎమ్మెస్సీ/ ఎంటెక్/ ఎంసీఏ/ పీహెచ్‌డీ పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 16
వెబ్‌సైట్: www.oucde.ac.in
www.osmania.ac.in, www.oucde.net

క్రీడలతోనే మానసికోల్లాసం

శాంతిపురం : క్రీడలతోనే మానసికోల్లాసం లభిస్తుందని ఎంఈవో వెంకట్రమణ, హెచ్‌ఎం మహేశ్వరయ్య తెలిపారు. మంగళవారం క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకుని శాంతిపురం ప్రభుత్వ పాఠశాల నుంచి బస్టాండు సర్కిల్ వరకు విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం మానవహారంగా ఏర్పడి క్రీడా దినోత్సవంపై నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు

గిడుగు రామమూర్తి సేవలు మరువలేనివి

గుడుపల్లె : గిడుగు రామూర్తి తెలుగు భాషాభివృద్ధికి చేసిన సేవలు మరువలేనివని ద్రావిడ విశ్వవిద్యాలయ వీసీ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం భాషా భవనంలో తెలుగు శాఖాధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాతృభాషను మరువరాదని పేర్కొన్నారు. తెలుగు భాషా సాహిత్యానికి కందుకూరి, గురజాడ, నారాయణరెడ్డి మొదలైన వారు అనేక సేవలు చేశారని కొనియాడారు. రాష్ట్ర డిప్యూటీ స్పీకర్ మండలిబుద్ధ ప్రసాద్ తెలుగు భాషకు నిరంతరం చేస్తున్న సేవల గురించి వివరించారు. ఆచార్య సుబ్బాచారి మాట్లాడుతూ వ్యవహారిక భాషలో రచనకు ఆధ్యుడు గిడుకు రామమూర్తే అన్నారు. తెలుగు శాఖాధిపతి డా.చిన్నరెడ్డయ్య మాట్లాడుతూ ప్రపంచీకరణ నేపథ్యంలో ప్రాంతీయ భాషలు కనుమరుగైపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలుగు భాషాభివృద్ధికి అందరూ కృషి చేయాలని పేర్కొన్నారు. డా. వేణుగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ మాతృ భాషను మరచిపోతే అమ్మను మరిచినట్టే నన్నారు. అనంతరం విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించి, విజేతలకు వీసీ బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుశాఖ అధ్యాపకులు శ్రీదేవి, భూక్యతిరుపతి, ఇతర శాఖాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థినికి బహుమతి ప్రదానం చేస్తున్న వీసీ

నల్లబ్యాడ్జిలతో ద్రావిడ బోధనేతర సిబ్బంది నిరసన


నిరసన తెలుపుతున్న బోధనేతర సిబ్బంది

గుడుపల్లె : ద్రావిడ విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బంది మంగళవారం నల్ల బ్యాడ్జిలు ధరించి వర్శిటీ మెయిన్‌ గేట్ వద్ద నిరసన తెలిపారు. వర్శిటీ యాజమాన్యం దిగివచ్చే వరకు తమ నిరసన కొనసాగిస్తామని వారు పేర్కొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 34 మంది వర్శిటీలో అక్రమ మార్గంలో ఉద్యోగాలు పొందారని, వారిని అక్రమ మార్గంలో పర్మినెంట్ చేసేందుకు పూనుకోవడం బాధాకరమన్నారు.ఎన్నో సంవత్సరాలుగా పనిచేస్తున్న తమకు టైమ్ స్కేల్ ఇచ్చి, ఏన్‌ ఎంఆర్‌లుగా గుర్తించాలని కోరు తున్నా అధికారుల పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం స్పందించి తమకు న్యాయం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బోధనేతర సిబ్బంది, నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


ఘనంగా మాతృభాషా దినోత్సవం


శాంతిపురంలో జానపద గేయాలు ఆలపిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

శాంతిపురం : మండల పరిధిలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని విద్యార్థులు, అధ్యాపకులు ఘనంగా జరుపుకున్నారు. అందరూ సాంప్రదాయ దుస్తులతో పాఠశాలకు హాజరయ్యారు. సాంప్రదాయ పద్ధతుల్లో ఆటపాటలతో అలరించారు. రంగవల్లులు వేయించారు. తెలుగు జానపద గేయాలు ఆలపించారు. విజేతలకు బహుమతులు అందించారు. అనంతరం ఎంఈవో వెంకట్రమణ మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు.పాఠశాల ప్రిన్సిపాల్ మురళిమోహన్‌ , రామూర్తి, అగస్త్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

వి కోట : తెలుగు భాషను పరిరక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చైతన్య టెక్నో పాఠశాల ప్రిన్సిపాల్ మొగిలన్‌ అన్నారు. పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

తెలుగు భాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు.బహుమతులు అందజేశారు. అలాగే వాణి పాఠశాలలోనూ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.


సాంప్రదాయ వస్త్రధారణలో చైతన్య టెక్నో విద్యార్థులు

తెలుగు భాషాభివృద్ధికి కృషి చేద్దాం

కుప్పం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానాచార్యులు బీ రామసుబ్బారెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష అభివృద్ధికి అందరూ కృషి చేయాలని కోరారు.అనంతరం విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానాచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కుప్పంలో సినిమాలు...

శ్రీమహాలక్ష్మి	:	దండుపాళ్యం-2
లక్ష్మీ మూవీలాండ్	:	ఫిదా
ఎస్ఆర్ఎం	:	నిన్నుకోరి
మురుగన్	:	మాయామాల్

వైభవంగా వినాయకస్వామి వసంతోత్సవం



కొత్తపేటలో పూజలందుకున్న సిద్ధిబుద్ధి వినాయస్వామి - గుడుపల్లె చెరువు వద్ద నిమజ్జన వేడుకల్లో యువత

కుప్పం రూరల్ : కుప్పంలోని కొత్తపేటలో కొలువైన శ్రీసిద్ధిబుద్ధి వినాయకస్వామి వసంతోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించారు. స్వామివారికి క్షీరాభిషేకాలతో, మంగళహారతులు, డప్పులహోరు వాయిద్యాలతో అత్యంత వైభవంగా పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్త వెంకటేశ్‌ ,కార్యదర్శి లక్ష్మీపతి భక్తాదులకు అన్నదానం చేశారు. రాత్రి వినాయకస్వామిని పురవీధుల్లో ఊరేగించారు.కాగా,రెస్కో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన శివగంగ పుత్ర వినాయకస్వామిని టీడీపీ నేత హర్ష ఆధ్వర్యంలో ఏనుగును పిలిపించి వినాయకస్వామి ఆశీర్వాదం చేయించారు. సంఘం వద్ద ఏర్పాటు చేసిన వినాయకస్వామి వద్ద హేమంత్‌ కుమార్ భక్తాదులకు అన్నదానం చేశారు.

కోలాహలంగా గణపతి ప్రతిమల నిమజ్జనం

గుడుపల్లె : మండలంలో వినాయక నిమజ్జనం కోలాహలంగా జరిగింది. మంగళవారం ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక ప్రతిమల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు. అనంతరం డప్పు వాయిద్యాల మధ్య వినాయక ప్రతిమలను గ్రామాల్లో ఊరేగించి సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

శాంతిపురం : మండల పరిధిలోని ఎంకేపురం, ఏజీఆర్ డిగ్రీ కళాశాలలో వినాయక నిమజ్జనాన్ని యువకులు ఘనంగా నిర్వహించారు. ఎంకేపురం గ్రామంలో ప్రతిష్ఠించిన వినాయక ప్రతిమను ట్రాక్టర్‌లో ఊరేగిస్తూ గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేశారు. అలాగే ఏజీఆర్ డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రతిమను విద్యార్థులు తులసీనాయనపల్లె గ్రామం వద్ద ఊరేగించి, నిమజ్జనానికి తీసుకెళ్ళారు. ఈ కార్యక్రమంలో ఏజీఆర్ డిగ్రీ కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు, ఎంకేపురం యువకులు తదితరులు పాల్గొన్నారు.

వి కోట : స్థానిక బ్రాహ్మణ వీధిలో వినాయక స్వామి సన్నిధిలో ఉంచిన లడ్డూకు వేలం నిర్వహించగా కాంట్రాక్టర్ శ్రీనివాసులు రూ.31 వేలకు దక్కించుకున్నారు. అనంతరం యువకులు లాంగ్ బజార్ మీదుగా వినాయక విగ్రహాలను నిమజ్జనానికి తరలించారు. సత్య సాయి నగర్‌లో యువకులు ఉట్లోత్సవం నిర్వహించారు.

ఉద్యోగులు ప్రజలకు ఆదర్శంగా నిలవాలి


ప్రమాణపత్రాలు అందజేస్తున్న ఎస్ఐ సురేష్

రామకుప్పం : రోడ్డు భద్రత విషయంలో ప్రభుత్వ ఉద్యోగులు సామాన్య ప్రజలకు ఆదర్శంగా నిలవాలని రామకుప్పం ఎస్ఐ సురేష్ కోరారు. మంగళవారం ఆయన తమ సిబ్బందితో కలిసి మండల కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో, తహసీల్దార్, సిబ్బందికి రోడ్డు భద్రతపై అవగాహన కల్పించి, ప్రమాణ పత్రాలు పంపిణీ చేశారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన


అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

రామకుప్పం:మండలంలోని విజలాపురంలో ఉన్న ఓంశక్తి పెట్రోల్ బంకు కార్మికులకు అగ్నిమాపక సిబ్బంది మంగళవారం అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన కల్పించారు. కుప్పం అగ్నిమాపకాధికారి రాజు నేతృత్వంలో సిబ్బంది వారికి అగ్నిప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తను వివరించారు. ఈ కార్యక్రమంలో పెట్రోల్ బంకు డీలర్ మునస్వామి, కార్మికులు పాల్గొన్నారు.

నేడు సిద్దేశ్వరస్వామి ఆలయ కుంభాభిషేకం

బైరెడ్డిపల్లె: మండలంలోని రామనపల్లె సిద్దేశ్వరస్వామి ఆలయ జీర్ణోద్ధరణ, కుంభాభిషేకం ఈ నెల 30, 31 తేదీల్లో ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్త బలరామ్ తెలిపారు. బుధవారం గంగపూజ, గోపూజ, గణపతి పూజ, రక్షాబంధనం, కలశ స్థాపన, 31న రుద్రాభిషేకం, కుంభాభిషేకం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా ఆయన కోరారు.

దేశభాషల్లో మేటిభాష తెలుగు





విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్రరెడ్డి, జానపదగేయాలు ఆలపిస్తున్న విద్యార్థిని

పలమనేరు/గంగవరం/పెద్దపంజాణి: దేశభాషల్లో మేటిభాష తెలుగు భాష అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ రాజేంద్ర రెడ్డి అన్నారు. మంగళవారం పలమనేరు పట్టణంలోని టీకేసీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్థానిక తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో తెలుగు భాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. అతిథిగా విచ్చేసిన రాజేంద్రరెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష, సంస్కృతి విశిష్టమైనదని వాటిని కాపాడి భవిష్యత్తు తరానికి అందించడానికి నేటి యువత, విద్యార్థులు కృషి చేయాలన్నారు. తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి అధ్యక్షుడు తులసీనాథం నాయుడు మాట్లాడుతూ తెలుగు భాష అంతరిస్తే తెలుగు సంస్కృతి కూడా అంతరించిపోతుందని అన్నారు. ఆంగ్లం నేర్చుకోవడం తప్పుకాదని అయితే మాతృభాషను విస్మరించడం నేరమన్నారు. ఎల్ఐసీ ఉద్యోగి కుమారస్వామి రెడ్డి, ఎంహెచX ఖానX, కళాశాల ప్రిన్సిపాల్ సయ్యద్ మౌల ప్రసంగించారు. అనంతరం తెలుగు భాషలో అత్యధిక మార్కులు సాధించిన నలుగురు విద్యార్థులకు పెద్ద బాలశిక్ష పుస్తకాలను బహుమతిగా అందజేశారు.

● గంగవరం మండలంలోని మదర్ థెరిసా జూనియర్ కళాశాలలో మంగళవారం తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. కళాశాల యాజమాన్యం, అధ్యాపకులు, విద్యార్థులు తెలుగు తల్లి చిత్రపటానికి పూజలు చేశారు. కళాశాల ఛైర్మనX సునీల్, కరస్పాండెంట్ రవీంద్రబాబు, అకడమిక్ సలహాదారు డాక్టర్ రాజేంద్ర రెడ్డి మాట్లాడుతూ తెలుగు భాష తల్లితో సమానమని అందరూ మాతృభాషాభివృద్ధికి కృషి చేయాలన్నారు. తెలుగు భాష మీద పట్టుసాధిస్తే జ్ఞాన సంపద పెరుగుతుందని అన్నారు. తెలుగు భాషను కళాశాలలోని విద్యార్థులు భాషాభివృద్ధి కోసం కృషి చేస్తున్నారని విద్యార్థులకు ప్రోత్సహిస్తున్న అధ్యాపకులను అభినందించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ దివాకర్ రెడ్డి, తెలుగు ఉపన్యాసకులు నాగరాజు, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● పెద్దపంజాణి మండలంలోని రాయలపేట ఉన్నత పాఠశాలలో మంగళవారం మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఉపాధ్యా యులు, విద్యార్థులు సంప్రదాయ వస్త్రాలు ధరించి పాఠశాలకు హాజరయ్యారు. ప్రధానోపాధ్యాయులు నారాయణ తెలుగుభాష గొప్పతనాన్ని విద్యార్థులకు తెలియజేశారు. విద్యార్థులు జానపద గేయాలు, పద్యాలు ఆలపించారు. కార్యక్రమానికి స్థానిక సర్పంచు ప్రకాశం శెట్టి ముఖ్య అతిథిగా విచ్చేసి విద్యార్థులను అభినందిచారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



నిమజ్జన ఊరేగింపులో యువకుల విన్యాసాలు

గంగవరం: మండలంలోని గంగవరం, కల్లుపల్లె గ్రామాల్లో వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను మంగళవారం ఘనంగా నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువకులు మేళ తాళాలతో, బాణసంచా పేలుళ్లతో వీధుల్లో కేరింతలు కొడుతూ విగ్రహాలను ఊరేగించి సమీపంలోని చెరువుల్లో నిమజ్జనం చేశారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ



విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేస్తున్న మంత్రి అమరనాథరెడ్డి కుటుంబ సభ్యులు

పెద్దపంజాణి: మండలంలోని వీరప్పల్లె పంచాయితీలోని కెళవాతి, వీరప్పల్లె, మారప్పల్లె, సుద్దగుండ్లపల్లె, కొత్తపల్లె, తుర్లపల్లె గ్రామాల్లోని అంగనX వాడీ కేంద్రాల్లోని 120 మంది పిల్లలకు యూనిఫాంను రాష్ట్రపరిశ్రమల శాఖ మంత్రి అమరనాథ రెడ్డి సతీమణి రేణుకారెడ్డి, కుమారుడు ప్రసేనX రెడ్డి, కోడలు ప్రీతికా రెడ్డి మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వీరప్పల్లె మాజీ సర్పంచు ఆది నారాయణ, టీడీపీ నాయకులు, అంగనX వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

పంటపొలాలపై ఏనుగుల దాడి





వేరుశనగ పంట, బోరు మోటారు పైపులను ధ్వంసం చేసిన ఏనుగులు

పలమనేరు రూరల్: మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్రహారం గ్రామ పొలిమేరల్లోని సుబ్రహ్మణ్య స్వామి ఆలయం వద్ద పంట పొలాలపై సోమవారం రాత్రి ఏనుగుల గుంపు దాడి చేసింది. పాపయ్య అనే రైతుకు చెంది రెండు ఎకరాల వేరుశనగ పంట, గోవింద గౌడు, షణ్ముగంకు చెందిన మల్బరీ తోట, బోరు మోటరు పైపులను ధ్వంసం చేశాయి. అటవీశాఖ, రెవెన్యూ అధికారులు ఏనుగుల దాడుల్లో నష్టపోయిన పంటల, బోరు మోటారు పైపుల వివరాలను రైతుల వద్ద నుంచి సేకరించారు.

ప్రధానోపాధ్యాయుడికి వీడ్కోలు



హెచ్ఎంను సన్మానిస్తున్న విద్యార్థులు, గ్రామస్థులు

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని టీఎస్ అగ్రహారం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ప్రధానోపాధ్యాయుడు వేమచంద్రారెడ్డికి మంగళవారం ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులు, గ్రామస్థులు, కౌన్సిలర్ శ్యామ్‌సుందర్ రాజ్ హెచ్ఎంకు శాలువ కప్పి పూలమాల వేసి సన్మానించారు.

ప్రజా సాధికార సర్వే కేంద్రం ఏర్పాటు

పలమనేరు రూరల్: మున్సిపాలిటీ పరిధిలో ప్రజా సాధికార సర్వేలో వివరాలు నమోదు చేయించుకోని వారి కోసం ప్రత్యేక కౌంటర్‌ను ఏర్పాటు చేసినట్లు కమిషనర్ రామచంద్రరావు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో ప్రత్యేక కౌంటర్ నెల రోజుల పాటు అందుబాటులో ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రెవెన్యూ సిబ్బంది నిరసన

గంగవరం: నాగళాపురం తహసీల్దార్ రేణుకమ్మపై కేసు నమోదు చేసిన ఎస్ఐపై చర్యలు తీసుకోవాలని మంగళవారం గంగవరం తహసీల్దార్ నాగయ్య, రెవెన్యూ సిబ్బంది భోజన విరామ సమయంలో కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

సినిమా గైడ్

పద్మశ్రీ ఎ/సి	అర్జున్‌రెడ్డి
వి.వి.మహల్	వివేకం
మంజునాథ	జయ జానకి నాయక
రంగమహల్	విఐపి 2

విద్యా సామగ్రి వితరణ



విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న సర్పంచు, దాతలు

బంగారుపాళ్యం: మండలంలోని తుంబపాళ్యం ప్రాథమి పాఠశాల విద్యార్థులకు జీఆర్ కంస్ట్రక్షనX్స అధినేత ఈశ్వరనాయుడు సమకూర్చిన విద్యా సామగ్రిని మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచు కోదండ యాదవ్ మాట్లాడుతూ ఈశ్వర నాయుడు గత ఏడు సంవత్సరాలుగా మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు విద్యా సామగ్రిని అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో హెచ్ఎం ప్రసాద్, ఉపాధ్యాయులు హరి, రఘు, నాయకులు జనార్దన గౌడ్, చరణ్ చౌదరి, ఆరీఫ్ బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

పిల్లలందరికీ ఎమ్మార్ వ్యాక్సినX

పలమనేరు: మున్సిపాలిటీ పరిధిలోని గంటావూరు, గొబ్బిళ్లకోటూరు, ఎస్టీ కాలనీ, ఎస్సీ, అంబేడ్కర్ కాలనీ ప్రాంతాల్లో ఇప్పటి వరకు ఎమ్మార్ వ్యాక్సినX వేసుకోని పిల్లలను గుర్తించి ఎమ్మార్ వ్యాక్సినX వేశారు. మంగళవారం కొలమాసనపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి మల్లికార్జున రెడ్డి, వైద్యారోగ్య సిబ్బంది లక్ష్మీపతి, రమేష్, జమున, చాముండి, అనీల, కైరుమ్ తదితరులు అంగనX వాడీ కేంద్రాల వద్ద, ఇంటింటికి వెళ్లి ఎమ్మార్ వ్యాక్సినX వేసుకోని పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సినX వేశారు.

రచయితలకు సన్మానం





కుమారస్వామి రెడ్డి, తులసీనాథం నాయుడును సన్మానిస్తున్న కలెక్టర్ ప్రద్యుమ్న, జడ్పీ ఛైర్ పర్సనX గీర్వాణి

పలమనేరు: తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మంగళవారం చిత్తూరులో జరిగిన కార్యక్రమంలో పలమనేరుకు చెందిన రచయితలు కుమారస్వామి రెడ్డి, తులసీనాథం నాయుడును కలెక్టర్ ప్రద్యుమ్న, జడ్పీ ఛైర్‌పర్సనX గీర్వాణి చంద్రప్రకాష్ ఘనంగా సన్మానించారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 3, 5



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది. వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): పూర్వ మిత్రులను కలుసుకుంటారు. షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆంతరంగిక చర్చలు ఫలిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరం. పూజలు, వేడుకల్లో పాల్గొంటారు. విరాళాలు, దానధర్మాలకు ఖర్చు చేస్తారు.



మిథునరాశి: (మే21-జూన్21): ప్రియతముల కలయికతో ఇంట్లో సందడి వాతావరణం నెలకొంటుంది. సమావేశాల్లో మార్పులకు ప్రయత్నిస్తారు. వేడుకలు, శుభకార్యాల్లో ఉత్సాహంగా పాల్గొంటారు. రియల్ ఎస్టేట్ రంగంలోని వారికి అనుకూలం.



కర్కాటకరాశి: (జూన్22-జూలై23): వృత్తి, వ్యాపారాలకు అవసరమైన పత్రాలు, సరకుల రవాణాకు అనుకూలం. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లు లాభిస్తాయి. రిజిస్ట్రేషన్లకు శుభతరుణం. సన్నిహితు ఆరోగ్య విషయాలపై దృష్టి సారిస్తారు.



సింహరాశి: (జూలై24-ఆగస్ట్23): పొదుపు పథకాలు లాభిస్తాయి. ప్రేమానుబంధాలు బలపడతాయి. షాపింగ్, క్రయవిక్రయాలకు అనుకూలం. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. చిన్నారులు, ప్రియతముల విషయాల్లో శుభపరిణామాలు సంభవం.




కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): బదిలీలు, మార్పులకు అనుకూలం. దూరంలో ఉన్న బంధుమిత్రులను కలుసుకుంటారు. కుటుంబ సభ్యుల వైఖరిని సమీక్షించుకుంటారు. వాయిదాపడుతున్న పనులు పూర్తి చేస్తారు.



తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. కాంట్రాక్టులు, అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): షాపింగ్ ఉల్లాసం కలిగిస్తుంది. ఆర్థికపరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆర్థిక సంస్థలు, బ్యాంకులతో పనులు పూర్తవుతాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. ప్రేమానుబంధాలు బలపడతాయి.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): సంకల్పం నెరవేరుతుంది. ప్రభుత్వ సంస్థలు, రాజకీయ రంగాల వారు గౌరవ, మన్ననలు అందుకుంటారు. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. వృత్తి, వ్యాపారాల విషయంలో కీలక నిర్ణయాలు తీసుకుంటారు.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): దూరంలో ఉన్న ప్రియతములను కలుసుకుంటారు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలు, ఉత్సవాలకు నిధులు సమకూరతాయి. ముఖ్య సమాచారం అందుకుంటారు. సినీ, రాజకీయ రంగాల వారికి ప్రోత్సాహకరం.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): బృందకార్యక్రమాలు, వేడుకలకు అవసరమైన నిధులు సర్దుబాటవుతాయి. షాపింగ్ ఆనందం కలిగిస్తుంది. బ్యాంకులు, ఆర్థిక సంస్థలతో సమావేశాలు ఫలిస్తాయి. పూర్వ మిత్రులను కలుసుకుంటారు.



మీనరాశి:(ఫిబ్రవరి19మార్చి20): ఉన్నత పదవులు అందుకుంటారు. భాగస్వామి సహకారంతో వృత్తి, వ్యాపారాల్లో లక్ష్యాలు సాధిస్తారు. జనసంబంధాలు మెరుగుపడతాయి. వేడుకలు, శుభకార్యాల్లో ప్రముఖులను కలుసుకుంటారు.

-బిజుమళ్ళ బిందుమాధవ శర్మ

నేడు గవర్నర్ తిరుమల సందర్శన

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర గవర్నర్ ఇఎస్ఎల్ నరసింహన్ బుధ, గురువారాల్లో జిల్లా పర్యటనకు వస్తున్నట్లు కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న మంగళవారం ఒక ప్రకటన లో తెలిపారు. గవర్నర్ పర్యటన వివరాలు ఇలా వున్నాయి. బుధవారం హైదరాబాదు నుంచి విమానంలో గవర్నన్ దంపతులు బయలుదేరి సాయంత్రం 4 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడినుంచి కారులో బయలుదేరి 4.50 గంటలకు తిరుచానూరు చేరుకుని పద్మావతి అమ్మవారిని దర్శించుకుంటారు. అనంతరం 5.15 గంటలకు తిరుచానూరు నుంచి బయలుదేరి తిరుమల పద్మావతి అతిథిగృహం చేరుకొని బసచేస్తారు. శ్రీవారిని దర్శించుకుంటారు. గురువారం ఉదయం 9.15 గంటలకు తిరుమల నుంచి బయలుదేరి 10.30 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని హైదరాబాద్ వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో తెలిపారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3 కోట్లు

తిరుమల: తిరుమలేశుడికి హుండీ ద్వారా రూ.3 కోట్ల ఆదాయం లభించింది. సోమవారం వచ్చిన కానుకలను మంగళవారం లెక్కించగా ఈ ఆదాయం సమకూరిందని టీటీడీ అధికారులు ప్రకటించారు. కాగా, పలు టీటీడీ పథకాలకు మంగళవారం పలువురు దాతలు రూ.12.76 లక్షలు వితరణ చేశారు. నిత్యాన్న ప్రసాదానికి రూ.10. 76 లక్షలు, గో సంరక్షణకు రూ.2లక్షలు చొప్పున అందజేశారు.

ఓపెన్ స్కూల్‌లో ప్రవేశాలు

ఏర్పేడు: ఆంధ్రప్రదేశ్ ఓపెన్ స్కూల్ సొసైటీలో బుధవారం నుంచి అడ్మిషన్లు ప్రారంభించనున్నట్టు ఏర్పేడు ఉన్నత పాఠశాల హెచ్ఎం రామచంద్ర నాయుడు తెలిపారు. ఓపెన్ స్కూల్ సొసైటీ తరపున 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో చేరదలచి వారు ఏర్పేడు హైస్కూల్‌లో లేదా 98490 68479 నెంబర్‌లో సంప్రదించాలన్నారు.

మార్కెట్ ధరలు

తిరుపతి బులియన్

24 క్యారెట్ల అపరంజి	**బంగారు**
10గ్రాముల ధర	రూ.30,790
22 క్యారెట్ల ఆర్నమెంటు	**బంగారు**
గ్రాము ధర	రూ.2,849
రిటైల్ వెండి గ్రాము ధర	రూ.43.30

మదనపల్లెలో

పట్టుగూళ్ల ధరలు

కనిష్ఠం	326.00
గరిష్ఠం	416.95
సగటు	367.18

టమోటా ధరలు

మొదటి రకం	
కనిష్ఠం	15.00
గరిష్ఠం	24.00
రెండో రకం	
కనిష్ఠం	8.00
గరిష్ఠం	13.00



కోడిగుడ్లు (నెక్)

రైతు గేటు ధర-చిత్తూరు (వందగుడ్లు)	365.00
చెన్నై	: 372.00

ఉద్యమంలా 'ప్రకృతి పిలుస్తోంది'

మొక్కలు నాటే వారికి ఉచిత వైద్యసేవలు- పంచాయతీలకు 'పల్లెవనాలు' -ఆలయాలకు 'వృక్షప్రసాదం'

చిత్తూరు క్రైం: జిల్లాలో పచ్చదనం పెంచడమే ప్రధాన లక్ష్యమని సామాజిక వన విభాగం డీఎఫ్‌వో శ్రీనివాసులు చెప్పారు. జిల్లా సామాజిక వనవిభాగం కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ ప్రద్యుమ్న ఆదేశాల మేరకు జిల్లాలో పచ్చదనం పెంచేందుకు అనేక కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు. ఇందులో భాగంగా మొక్కలు నాటే విద్యార్థుల కు ఉచిత వైద్యసేవలు అందించనున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొనే విద్యార్థులకు తిరుపతిలోని నారాయణాద్రి ఆసుపత్రిలో ఉచితంగా కంటి, దంత వైద్యపరీక్షలు నిర్వహిస్తారన్నారు. అలాగే విద్యార్థుల తల్లిదండ్రులు కూడా 5 మొక్కలకు మించి నాటితే వారికి ఉచితంగా గుండె పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దీనికోసం 5 మొక్కలు నాటినట్లు స్థానిక డాక్టర్, వీఆర్‌వో, ఈవో ఎవరివద్దనైనా సర్టిఫికెట్ తీసుకుంటే చాలన్నారు. నవంబర్ 11 వరకు ప్రతి శనివారం జిల్లా వ్యాప్తంగా పాఠశాల విద్యార్థులచే అవగాహనా కార్యక్రమాలు నిర్వహించనున్నామని చెప్పారు. ఇందులో భాగంగా జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులను 'ప్రకృతి పిలుస్తోంది' అనే కార్యక్రమం ద్వారా మామండూరు, ఉబ్బలమడుగు, హార్సిలీ హిల్స్, తలకోన, తిరుపతిలోని జూపార్క్, జంగిల్ బుక్ తదితర ప్రాంతాలకు అటవీశాఖ ఖర్చులతో తీసుకువెళతామన్నారు. ప్రతి శనివారం విద్యార్థులచే గ్రీన్ ర్యాలీ, సైకిల్ ర్యాలీలు నిర్వహించనున్నామన్నారు. మొక్కల పెంపకంపై మండల, జిల్లా స్థాయిలో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ, చిత్రలేఖన, క్విజ్ పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని చెప్పారు. జిల్లాలోని నర్సరీల్లో 62 లక్షల మొక్కలు అందుబాటులో వున్నాయని, ఇప్పటివరకు 12 లక్షల మొక్కలు పంపిణీ చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, రైల్వేస్టేషన్లు, బస్టాండ్లు తదితర ప్రాంతాల్లో నాటడానికి మొక్కలు ఉచితంగా ఇస్తామని చెప్పారు. 'పల్లెవనాలు' కార్యక్రమం ద్వారా జిల్లాలోని 50 గ్రామ పంచాయతీలను ఎంపిక చేసి గ్రామాల్లో మొక్కల పెంపకం, సంరక్షణ చేపడతామన్నారు. ఇందులో విద్యార్థులను, గ్రామస్తులను భాగస్వాములను చేస్తామన్నారు. దీనికోసం అటవీశాఖ ప్రతి గ్రామపంచాయితీకి రూ.50 వేలు ఖర్చుచేస్తుందన్నారు. ఆసక్తిగల సర్పంచ్‌లు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ముందువచ్చిన దరఖాస్తులకు ప్రాధాన్యం వుంటుందన్నారు. 'వృక్షప్రసాదం' పేరుతో దేవాలయాల్లో ఉసిరి, మారేడు, తులసి తదితర మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. దేవాలయాల ప్రాముఖ్యతను బట్టి, ఆలయ ఈవోలు అటవీశాఖ అధికారులను సంప్రదిస్తే వారికి అవసరమైన మొక్కలు ఇస్తామన్నారు. భక్తులచే ఆలయాల్లో మొక్కలు నాటించేందుకు ఆలయ అధికారులు ముందుకు రావాలని కోరారు. మొక్కల పెంపకంపై సినిమా థియేటర్లలో ప్రచారం నిర్వహించనున్నామని తెలిపారు. ప్రస్తుతం జిల్లాలో విరివిగా వర్షాలు కురుస్తున్నాయని ప్రజలు మొక్కలు నాటేందుకు ముందుకు రావాలని డీఎఫ్‌వో పిలుపునిచ్చారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న డీఎఫ్‌వో శ్రీనివాసులు

తిరుపతిలో నేడు పాలిటెక్ ఫెస్టివల్

తిరుపతి(విద్య): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు పాలిటెక్నిక్ కళాశాలలు కలసి తిరుపతి కేటీ రోడ్డులోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో బుధవారం పాలిటెక్ ఫెస్టివల్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఆయా కళాశాలల విద్యార్థులు తమ నైపుణ్యాన్ని నిరూపించుకొనుటకు వారు తయారు చేసిన 140 ప్రాజెక్టులు ప్రదర్శించనున్నట్లు తెలిపారు. సాంకేతిక విద్యాశాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో దాదాపు 300 మంది విద్యార్థులు పాల్గొంటున్నారన్నారు.

1న మిలియన్ మార్చ్‌కు తరలిరండి

పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిప్రసాద్ తదితరులు

చిత్తూరు సిటీ: సెప్టెంబర్ 1న రాష్ట్ర రాజధానిలో నిర్వహించనున్న మిలియన్ మార్చ్‌కు జిల్లాలోని అన్ని శాఖలకు చెందిన ప్రభుత్వ ఉద్యోగులు తరలిరావాలని పీఆర్‌టీయు జిల్లా అధ్యక్షుడు గిరిప్రసాద్ కోరారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లా నుంచి మిలియన్ మార్చ్ నిర్వహణకు గాను ఇంచుమించు మూడు వేల మంది ఉద్యోగులు విజయవాడ చేరుకోనున్నట్లు చెప్పారు. వీరంతా ఈనెల 31న జిల్లాలోని చిత్తూరు, తిరుపతి, మదనపల్లె తదితర ప్రాంతాల నుంచి బయలుదేరనున్నట్లు వివరించారు. నూతన పింఛను విధానాన్ని రద్దు పరచి సామాజిక, ఆర్థిక, జీవన భద్రతకు భరోసా ఇచ్చే (1980 పెన్షన్ రూల్) పాత పింఛను విధానాన్ని 2004 సెప్టెంబర్ ఒకటి తర్వాత రాష్ట్రంలో నియమితులైన సుమారు 1.70 లక్షల ఉద్యోగులు, ఉపాధ్యాయులకు వర్తింపజేయాలని కోరుతూ ఉద్యోగులంతా ఒకటవ తేదీన రాజధానిలో నిరసన తెలియజేయనున్నామని ఆయన వివరించారు.

1 నుంచి ఏపీ పీజీఈ సెట్ కౌన్సెలింగ్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): తిరుపతిలో సెప్టెంబరు 1 నుంచి 7వ తేది వరకు ఎంఈ, ఎంటెక్, ఎంఫార్మసీ, ఫార్మాడీ కోర్సుల్లో ప్రవేశానికి ఏపీ పీజీఈసెట్ వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. ఎస్వీయూలో పాత ఎంబీఏ భవనంలో ఉదయం 9 గంటలకు ఈ కౌన్సెలింగ్ ప్రారంభమవుతుంది. వివరాలకు.. 70132 19704లో సంప్రదించాలని కౌన్సెలింగ్ కేంద్రం అధికారి ప్రొఫెసర్ జీఎన్ ప్రదీప్‌కుమార్ తెలిపారు. ఎపీపీజీఈసెట్ వెబ్‌సైట్‌లోనూ కౌన్సెలింగ్ షెడ్యూల్‌ను పొందుపరిచారు.

తిరుపతికి నేడు ఉపసభాపతి రాక

చిత్తూరు కలెక్టరేట్: రాష్ట్ర శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ బుధ, గురువారాల్లో జిల్లా పర్యటనకు వస్తున్నట్లు కలెక్టర్ పీఎస్ ప్రద్యుమ్న ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన విజయవాడ నుంచి తిరుమల ఎక్స్‌ప్రెస్ రైలులో బయలుదేరి బుధవారం ఉదయం 5.20 గంటలకు తిరుపతి చేరుకుంటారు. అక్కడి నుంచి తిరుమల బయలుదేరి వెళ్ళి రాత్రి అక్కడే బస చేస్తారు. గురువారం ఉదయం తిరుమలలో శ్రీవారిని దర్శించుకుంటారు. 10 గంటలకు తిరుమల నుండి బయలుదేరి తిరుపతి చేరుకుని పద్మావతి అతిథిగృహం చేరుకుని బస చేస్తారు. స్థానికంగా ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో ఆయన పాల్గొంటారు. రాత్రి 8.30 గంటలకు తిరుమల ఎక్స్‌ప్రెస్‌లో బయలుదేరి విజయవాడ వెళ్తారని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

పీఈఎస్ కళాశాలలో పారామెడికల్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం



దొరస్వామి నాయుడు

కుప్పం: పీఈఎస్ వైద్య కళాశాలలో 2017-18 పారామెడికల్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పీఈఎస్ యూనివర్శిటీ చాన్సలర్ డాక్టర్ ఎమ్మార్ దొరస్వామి ఓ ప్రకటనలో తెలిపారు. ఉపాధికల్పన డిప్లమో టెక్నీషియన్, కార్డియాలజీ, డయాలసీస్, అనస్తీషియ, ఆప్తమాలజీ, మెడికల్ ల్యాబొరేటరీ టెక్నాలజీ, ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, ఆడియో మెట్రిక్ టెక్నీషియన్, రెడియోగ్రఫీ, డార్క్ రూం అసిస్టెంట్, ఈసీజీ, డైటీషియన్ తదితర కోర్సులకు దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఇంటర్ పాసైన వారు సద్విని యోగం చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలకు 93918 33753 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

ఒకే వేదికపై భూ సంబంధిత శాఖలు

● రాష్ట్ర భూపరిపాలనా ప్రధాన కమిషనర్ అనీల్‌చంద్ర పునేఠా
● సాంకేతిక పరిజ్ఞానంతో పోర్టల్ సిద్ధం చేయడానికి ప్రత్యేక చర్యలు


అనీల్‌చంద్ర పునేఠ కు స్వాగతం పలుకుతున్న అధికారులు

తిరుపతి (జీవకోన): భూములతో సంబంధం ఉన్న అన్ని శాఖలను ఒకే వేదికపై తేనున్నట్లు రాష్ట్ర భూ పరిపాలనా ప్రధాన కమిషనర్ అనీల్‌చంద్ర పునేత పేర్కొన్నారు. ఇందుకోసం క్లౌడ్ సాంకేతిక పరిజ్ఞానంతో పోర్టల్‌ను సిద్ధం చేయడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామన్నారు. మంగళవారం తిరుపతి సబ్‌కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో భూ సమస్యలు, భూ బ్యాంకు, రైతుల సేవలో రెవెన్యూశాఖ జిల్లాలో అమలు తీరుపై సమీక్షించారు. కొత్త పోర్టల్‌లో రెవెన్యూ, పురపాలక, సర్వే, రిజిస్ట్రేషన్, పంచాయతీరాజ్‌శాఖలు భాగస్వాములవుతాయన్నారు. ప్రతి సర్వే నెంబరుకు సంబంధించిన సమస్త వివరాలు ఉంటాయన్నారు. దీనివల్ల సివిల్ తగాదాలు తగ్గుతాయన్నారు. త్వరలో రెవెన్యూ, ఫారెస్టు శాఖలు సమావేశమై అటవీ భూములకు సంబంధించిన సరిహద్దులను ఏర్పాటు చేసుకోవాలని కమిషనర్ సూచించారు. తిరుపతి పరిసర ప్రాంతాల్లో పరిశ్రమల స్థాపనకు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారన్నారు. వారికి భూ సౌకర్యం కల్పించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. జేసీ గిరీషా మాట్లాడుతూ జిల్లాలోని ఐదు ప్రాంతాల్లో రైల్వే పనులకు భూ సేకరణ చేశామన్నారు. శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల్లో పరిశ్రమల కోసం నాలుగువేల ఎకరాలు, కృష్ణా నీటిని కుప్పానికి తరలించడానికి, రెండు పారిశ్రామిక కారిడార్‌లకు జాతీయ రహదారి విస్తరణ ద్వారా భూసేకరణ నిర్వహించడం జరిగిందన్నారు. అలాగే మీ-సేవతో సత్ఫలితాలు సాధిస్తున్నామని వివరించారు. సబ్‌కలెక్టర్ నిషాంత్‌కుమార్ మాట్లాడుతూ తిరుపతి డివిజన్‌లో భూమి కొనుగోలుపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతోందన్నారు.ఈనెల పదో తేదీన రైతుల సేవలో రెవెన్యూశాఖ 1బీ అడంగల్ కాపీలను గ్రామసభల ద్వారా అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు ఆర్డీవో కోదండరామిరెడ్డి, తిరుపతి అర్బన్, రూరల్, తొట్టంబేడు, బీఎన్‌కండ్రిగ తహసీల్దార్లు చంద్రమోహన్, రాజగోపాల్, యుగంధర్, పరిపాలనాధికారి డీఎస్ అబ్దుల్ మునాఫ్ తదితరులు పాల్గొన్నారు.

విభిన్న ప్రతిభావంతులకు గృహవసతి: జిల్లాలోని విభిన్న ప్రతిభావంతులకు గృహ వసతి కల్పిస్తామని అనీల్‌చంద్ర పునీత పేర్కొన్నారు. మంగళవారం ఆయన తిరుపతి సబ్‌కలెక్టరేట్‌లో పనిచేస్తున్న కార్యాలయ సిబ్బంది పరిచయ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిత్తూరు జిల్లా విభిన్న ప్రతిభావంతుల ఐక్యకార్యాచరణ సమితి ఆధ్వర్యంలో కమిషనర్‌కు గృహాల కోసం వినతులు అందజేశారు. త్వరలో అర్హులైనవారికి గృహాలు అందజేయడం జరుగుతుందని బాధితులకు కమిషనర్ హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి మాధవన్ తదితరులు పాల్గొన్నారు.

విదేశాల్లో పీహెచ్‌డీలకు
ఐసీఏఆర్ ప్రోత్సాహం

● డెయిరీ, వెటర్నరీ కాలేజీలను సందర్శించిన రివ్యూ కమిటీ సభ్యులు

తిరుపతి (రూరల్): ప్రపంచంలో ఏ దేశంలో పీహెచ్‌డీలు చేసేవారికి భారతీయ వ్యవసాయ పరిశోధనామండలి (ఐసీఏఆర్) ప్రోత్సాహం అందిస్తుందని రివ్యూ కమిటీ బృందం స్పష్టం చేసింది. విదేశీ వర్సిటీల ఆచార్యుల గైడెన్స్‌లో పీహెచ్‌డీలు చేసేవారికి నెలకు రూ.2వేల డాలర్లు స్టైఫండ్‌గా అందజేస్తోందన్నారు.


పాల ఉత్పత్తులను పరిశీలిస్తున్న సభ్యులు

వెటర్నరీ వర్సిటీకి అక్రిడిటేషన్ రెన్యువల్‌లో భాగంగా తిరుపతికి వచ్చిన ఐసీఏఆర్ రివ్యూ పీర్ కమిటీ సభ్యులు డాక్టర్ గాలెట్, డాక్టర్ రిషేంద్రవర్మ, డాక్టర్ ఏకేసింగ్, డాక్టర్ వెంకటేశ్వర్లు మంగళవారం డెయిరీ టెక్నాలజీ, వెటర్నరీ కళాశాలలను సందర్శించారు. ఇందులో భాగంగా వివిధ డిపార్ట్‌మెంట్‌లను, ప్రయోగశాలలను, నిర్మాణంలోని భవనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. వసతిగృహాలను సందర్శించి మౌలిక వసతులను పరిశీలించారు. సాయంత్రం నాలుగు గంటల నుంచి ఆరు గంటల మధ్యలో విద్యార్థులు, అధ్యాపకులతో విడివిడిగా సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు విదేశాల్లోని వర్సిటీల ఆచార్యుల గైడెన్స్‌తో పీహెచ్‌డీ చేయవచ్చన్నారు. విమాన చార్జీలను కూడా ఐకార్ అందిస్తుందన్నారు. దేశవ్యాప్తంగా ఏడాదికి 30 మంది అభ్యర్థులకు ఈ అవకాశం కల్పిస్తోందన్నారు. డెయిరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కోటిలింగారెడ్డి, వెటర్నరీ కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ ఈశ్వరప్రసాద్ తమ కళాశాలల ప్రగతిని బృందం సభ్యులకు విశదీకరించారు. ఈ కార్యక్రమంలో డీన్ డాక్టర్ చంద్రశేఖరరావు, డెయిరీ డీన్ డాక్టర్ పద్మనాభరెడ్డి, ఎస్టేట్ అధికారి రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విద్యార్థులకు అండగా ఉంటాం

● ఇది రైతుల సమస్య కూడా..
● జనసేన అధినేత పవన్‌కల్యాణ్



పవన్‌కు సమస్యను తెలియజేస్తున్న విద్యార్థి

తిరుపతి రూరల్: వ్యవసాయ విద్యార్థులకు తాము అండగా ఉంటామని జనసేన అధినేత పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మంగళవారం హైదరాబాద్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో విద్యార్థులతో ఆయన భేటీ అయ్యారు. జీవో నెంబరు 64వల్ల తమకు తీరని నష్టం వాటిల్లుతుందని విద్యార్థులు ఆయన దృష్టికి తెచ్చారు. వ్యవసాయాధికారుల నియామకాల్లో గతంలో ఉన్న జీవో 16ను కొనసాగించాలని కోరారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీఎం చంద్రబాబు హయాంలో జారీ అయిన ఈ జీవో తెలంగాణలో ఇప్పటికీ అమలులో ఉందని తెలిపారు. అనంతరం వ్యవసాయ విద్యార్థుల డిమాండ్లు చాలావరకు సహేతుకంగా ఉన్నాయని పవన్ అన్నారు. ఈ సమస్య కేవలం మూడువేల మంది విద్యార్థులదిగా తాము చూడటంలేదని.. లక్షలాది మంది రైతులు, వారి కుటుంబాలకు చెందినదిగా భావిస్తున్నామన్నారు. ప్రతిభతో వ్యవసాయ విద్యలోకి ప్రవేశించిన వారికంటే దొడ్డిదారిన సర్టిఫికెట్లు పొందినవారికి ఉద్యోగాల్లో ప్రాధాన్యమిచ్చేలా జీవో ఉందన్నారు. ఇప్పటికే వ్యవసాయం లాభసాటిగా లేదని, కొందరు చేనుకు దూరమవుతుంటే.. ఇంకొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని వాపోయారు. ఇలాంటి దుస్థితి తొలగాలంటే నిపుణులైన వ్యవసాయాధికారులు వారికి అండగా ఉండాలన్నారు. విద్యార్థుల ఆరోపణల మేరకు తప్పుడు సర్టిఫికెట్లతో వ్యవసాయ శాఖలో ఉద్యోగాలు పొందినవారిపై విచారణ చేసి, దోషులైనవారిని ఉద్యోగాల నుంచి తొలగించేలా చర్యలు చేపట్టాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమ్మె చేస్తున్న విద్యార్థులతో టీడీపీ ప్రభుత్వ పెద్దలు మాట్లాడి సమస్య పరిష్కరించాలన్నారు. ఈ సమస్యకు ఆమోదయోగ్యమైన పరిష్కారం లభించని పక్షంలో జనసేన తనవంతు పాత్రను పోషిస్తుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్జీ రంగా వర్సిటీ పరిధిలోని 11 కళాశాలలకు చెందిన విద్యార్థి సంఘాల ప్రతినిధులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. మరోవైపు తిరుపతి ఎస్వీ వ్యవసాయ కళాశాల విద్యార్థులు చేపట్టిన ధర్నా మంగళవారం కూడా కొనసాగింది. కాగా, జనసేన ప్రతినిధులు కిరణ్‌రాయల్, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, హరిశంకర్ విద్యార్థుల సమస్యను తమ అధినేత దృష్టికి తీసుకెళ్లి ఈ భేటీని ఏర్పాటు చేయించారు.

నాణ్యతా ప్రమాణాలతోనే పరిశ్రమల మనుగడ



రేణిగుంట: వస్తు నాణ్యతా ప్రమాణాలతోనే పరిశ్రమల మనుగడ ఉంటుందని క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ తిరుపతి చాప్టర్ చైర్మన్ జగన్మోహన్ అన్నారు. తిరుపతిలోని అన్నమాచార్య ఇంజనీరింగ్ కళాశాలలో రెండోరోజైన మంగళవారం కూడా తిరుపతి చాప్టర్ 3వ వార్షికోత్సవ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా డిక్సన్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ పాండురంగరాజు పాల్గొన్నారు. వస్తు నాణ్యతగా ఆంధ్రప్రదేశ్ చిరునామా కావాలని ఆయన కోరారు. అమరరాజ బ్యాటరీస్ సీఈవో విజయానంద్ మాట్లాడుతూ.. నాణ్యతా ప్రమాణాలు పాటించడం వల్లే అమరరాజ కర్మాగారం దేశంలో మొదటి స్థానానికి చేరిందన్నారు. దేశ, విదేశాల్లో అమరరాజ ఉత్పత్తులకు మంచి స్పందన ఉందని వివరించారు. క్వాలిటీ సర్కిల్ ఫోరమ్ తిరుపతి చాప్టర్ సాధించిన అభివృద్ధిని జగన్మోహన్ వివరించారు. అనంతరం నాణ్యతా ప్రమాణాలు పాటించిన పలు కంపెనీ ప్రతినిధులకు, బృందాలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ కంపెనీల ప్రతినిధులు, అమరరాజ ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్నదాతల ఆత్మహత్యలు నివారిస్తేనే దేశాభివృద్ధి



సదస్సులో ప్రసంగిస్తున్న ఎస్వీయూ వీసీ దామోదరం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు): దేశంలో అన్నదాతల ఆత్మహత్యలను నివారిస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎస్వీయూ వీసీ దామోదరం స్పష్టం చేశారు. తిరుపతిలోని ఎస్వీయూ వర్సిటీ ఆర్ట్స్ బ్లాక్ ఆడిటోరియంలో సోషియాలజీ విభాగం ఆధ్వర్యంలో 'దేశంలో రైతాంగ ఆత్మహత్యలు- పరిష్కార మార్గాలు' అంశంపై మంగళవారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుల ఆత్మహత్యలకు శాస్త్రీయ కారణాలను ఈ తరం పరిశోధకులు విశ్లేషించాలన్నారు. అలాగే దేశంలో రైతులు ఎదుర్కొంటున్న అన్ని రకాల సమస్యలకు పరిష్కారాలను సూచించాలన్నారు. దేశ ఆర్థికాభివృద్ధికి వ్యవసాయ రంగమే ప్రధానమనే విషయాన్ని పరిశోధకులు గమనంలో ఉంచుకోవాలన్నారు. మానవ నాగరికతకు మూలం వ్యవసాయదారుడే అన్నది గుర్తుంచుకోవాలన్నారు. రైతు సుభిక్షంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందన్నారు. అన్నంపెట్టే రైతన్న పట్ల దేశంలోని ప్రతి పౌరుడు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. రైతు జీవితంలోని సంక్షోభాన్ని తీర్చే బాధ్యత అందరిపైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ దేవరాజులు, ప్రిన్సిపాల్ సవరయ్య, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యతోపాటు క్రీడలకు ప్రాధాన్యమివ్వాలి

● కలెక్టర్ ప్రద్యుమ్న

చిత్తూరు కల్చరల్: విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వాలని విద్యార్థులకు కలెక్టర్ ప్రద్యుమ్న పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక పీసీఆర్ ప్రభుత్వ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన కలెక్టర్ ప్రద్యుమ్న మాట్లాడుతూ క్రీడలంటే చెస్, క్యారం బోర్డులాంటివే కాక శారీరక వ్యాయామం కలిగిన క్రీడలు ఆడాలన్నారు. ప్రతి పాఠశాలలోను 1 లేదా 2 పీరియడ్లు క్రీడలకు కేటాయించాలన్నారు. సోమవారం నిర్వహించిన క్రీడాపోటీల్లో విజేతలుగా నిలిచిన జట్లకు ఆయన మెమెంటోలు అందజేసారు. క్రీడా సంఘ నాయకులు కలెక్టర్ ప్రద్యుమ్నను శాలువాలతో ఘనంగా సన్మానించారు. అనంతరం కలెక్టర్ క్రీడాజ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డీఎస్డీవో బాలాజీ, ఒలింపిక్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్, బ్యాస్కెట్ బాల్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చెంగల్రాయ నాయుడు, పీఈటీ శరత్, అధిక సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

← క్రీడా జ్యోతిని వెలిగించి ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్ ప్రద్యుమ్న

ఘనంగా తిరుమలనంబి అవతారోత్సవాలు

● శ్రీవారికి అపర భక్తుడు
● అభిషేక సేవను ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే
● టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు

ఆంధ్రజ్యోతి, తిరుమల: తిరుమలనంబి 1,044వ అవతారోత్సవాలు మంగళవారం ఉదయం తిరుమలలో ఘనంగా జరిగాయి. ఆలయ దక్షిణమాడవీధిలో ఉన్న తిరుమలనంబి ఆలయంలో ప్రత్యేక పూజా కైంకర్యాలు చేశారు. ముఖ్య అతిథులుగా టీటీడీ జేఈవో శ్రీనివాసరాజు, సీవీఎస్వో రవికృష్ణ హాజరయ్యారు. ఈ సందర్భంగా జేఈవో మాట్లాడుతూ శ్రీవారికి అపర భక్తుడు తిరుమలనంబి అన్నారు. స్వామివారికి అభిషేక సేవను ప్రవేశపెట్టిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. తన తాతైన యమునాచార్యుల ఆజ్ఞతో తిరుమలకు వచ్చారన్నారు. పాపవినాశనం తీర్థం నుంచి రోజూ జలాన్ని తీసుకొచ్చి శ్రీవారికి అభిషేకించేవారన్నారు. వృద్ధాప్యంలోనూ పాపవినాశనం తీర్థం తీసుకొస్తుండగా స్వామివారు జాలిపడి అంజనాద్రిలో ఉద్భవించిన ఆకాశగంగ తీర్థంతో అభిషేకం చేయాల్సిందిగా ఆజ్ఞాపించినట్లు పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. రామానుజాచార్యులకు రామాయణంలోని 18 రహస్యార్థాలను చెప్పి, విశిష్టాద్వైతానికి పునాది వేశారన్నారు. అనంతరం తిరుమలనంబి చరితం(తెలుగు), ఆచార్య వైభవం (తమిళం) పుస్తకాలను ఆవిష్కరించారు. ఆ తర్వాత తిరుమలనంబి వంశీకులకు లడ్డూ ప్రసాదం అందజేసి, ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో తిరుమలనంబి వంశీకులు తాతాచార్య కృష్ణమూర్తి, రంగనాథన్, ఆళ్వార్ దివ్యప్రబంధ ప్రాజెక్టు ప్రత్యేకాధికారి చొక్కలింగం, హైదరాబాదు సెంట్రల్ యూనివర్సిటీ అధ్యాపకులు కన్నన్, ఇతర అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.





తిరుమలనంబి వంశీకులకు లడ్డూ ప్రసాదాలు అందజేస్తున్న శ్రీనివాసరాజు





రాధాగోవిందుల శంఖాభిషేకానికి హాజరైన భక్తులు

వైభవంగా రాధాష్టమి వేడుకలు

తిరుపతి (సాంస్కృతికం): తిరుపతి హరేకృష్ణమార్గ్‌లోని అష్టసఖీ సమేత రాధాగోవింద కమలమందిరం (ఇస్కాన్)లో మంగళవారం రాధాదేవి ఆవిర్భావ దినోత్సవం (రాధాష్టమి వేడుకలు) వైభవంగా జరిగింది. వేకువన 4.15 గంటలకు మంగళహారతిలో వేడుకలు ప్రారంభమయ్యాయి. మందిరంలోని మూలమూర్తులను వివిధ ఫల, పుష్పాదులతో సుందరంగా అలంకరించారు. ఏటా రాధాష్టమిని పురస్కరించుకుని నిజపాద దర్శనాన్ని భక్తులకు కల్పించటం ఆనవాయితీ. రాధాదేవి నిజపాద దర్శనాన్ని భక్తులు వీక్షించే రీతిలో డిజిటల్ స్క్రీన్ ఏర్పాటు చేశారు.

శాస్త్రోక్తంగా శంఖాభిషేకం: రాధాగోవిందుల ఉత్సవ మూర్తులకు శాస్త్రోక్తంగా శంఖాభిషేకం నిర్వహించారు. 108 కలశాలతో ఫలరసాలు, పంచగవ్యలతో కలిపి శంఖాభిషేకం చేశారు. మందిర ప్రధాన అర్చకుడు గోపాలనిమాయిదాస్ ఆధ్వర్యంలో ఇస్కాన్ అధ్యక్షుడు రేవతీరమణదాస్, ఉపాధ్యక్షుడు రూపేష్‌ప్రభు, లక్ష్మీపతి, గౌరదాస్‌లతోపాటు పలువురు కృష్ణస్వాములు అభిషేకంలో పాల్గొన్నారు. ఆ తర్వాత 12 రకాల పత్ర, పుష్పాలతో నయనానందంగా పుష్పాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా మందిరం హరేకృష్ణ నామ స్మరణతో మార్మోగింది. భక్తులకు ఉదయం ఎనిమిది నుంచి రాత్రి 8.30 వరకు నిజపాద దర్శనం కొనసాగింది. ఆయా కార్యక్రమాల్లో ఇస్కాన్ నిర్వాహకులు బలభద్ర ప్రభుదాస్, పీఆర్వో లీలాపారయణదాస్, రసశేఖర్‌దాసు, నిత్యముక్తిదాస్, పెద్దసంఖ్యలో కృష్ణభక్తులు పాల్గొన్నారు.

అలరించిన 'నృత్యవైభవం'



నృత్యం చేస్తున్న కళాకారిణులు

తిరుపతి (సాంస్కృతికం): టీటీడీ సౌజన్యంతో తిరుపతి అకాడమీ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో మంగళవారం తిరుపతి మహతి మందిరంలో జరిగిన కూచిపూడి నృత్య వైభవం అలరించింది. కార్యక్రమాన్ని జస్టిస్ కె.శివప్రసాద్, ఫిలిం సొసైటీ చైర్మన్ ఎం.వేణుగోపాలరెడ్డి, ఎస్పీడీసీఎల్ పూర్వ సీఎండీ గోపాలరెడ్డి, ప్రముఖ విద్యావేత్త వై.ప్రవీణ్, అకాడమీ ప్రధాన కార్యదర్శి సురేంద్రనాయుడు జ్యోతి ప్రజ్వలనచేసి ప్రారంభించారు. డాక్టర్ పద్మరాగిణీ బృందం, డాక్టర్ ఉషారాణి బృందం కళాకారుల ఆధ్వర్యంలో కూచిపూడి నృత్య ప్రదర్శన జరిగింది. పలు వాగ్గేయకారుల కీర్తనలతోపాటు బృందావన కృష్ణుడు, గరుడగమన, అంబశాంభవి వంటి కీర్తనలకు నృత్యాభినయాన్ని ప్రదర్శించి అలరించారు. ఆడియో రికార్డు నేపథ్యంలో సాగిన ఈ ప్రదర్శనలో కమిస్కాన్ స్కయియా, గుసియా ఉలియా (రష్యా) కళాకారిణులతో పాటు 11 మంది కళాకారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న చిత్రావధానం

ప్రముఖ చిత్రకారుడు సింగపల్లి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన చిత్రావధానం ఆకట్టుకుంది. సంధానకర్తగా ఎ.మల్లేశ్వరరావు (స్టేషన్ డైరెక్టర్, విజయవాడ), పృచ్ఛకులుగా - జి.మునిరత్నం, తెలుగుకావ్యం - డాక్టర్ రాణిసదాశివమూర్తి, సంస్కృతభాష్యం, విజయకుమార్ - మిమిక్రీ, సాయిరాం భరద్వాజ్ - కీబోర్డు, జీకే సుందరం - నటన, ధనలక్ష్మి - నృత్యం, ఆర్‌జేసూర్య - రేఖ, విష్ణుప్రసాద్ -గానంతో రక్తి కట్టించారు. ఆయా కార్యక్రమాల్లో అకాడమీ నిర్వాహకులు జీఎం మనోహర్, వైఎస్‌బాబు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. కాగా అకాడమీ పూర్వ అధ్యక్షుడు పీవీఆర్‌కే ప్రసాద్ మృతికి సంతాప సూచకంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు.

సింధు, సైనాకు అభినందన

మహిళా వర్సిటీ విద్యార్థినుల ర్యాలీ



ర్యాలీలో పాల్గొన్న అధ్యాపకులు, విద్యార్థినులు

తిరుపతి(క్రీడలు): ప్రపంచ బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో మన దేశ కీర్తి పతాకాన్ని ఘనంగా ఎగురవేసిన పీవీ సింధు, సైనా నెహ్వాల్‌లను అభినందిస్తూ.. మంగళవారం తిరుపతిలోని పద్మావతి మహిళా వర్సిటీ వ్యాయామ విభాగం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. వర్సిటీ వీసీ వి.దుర్గాభవాని, రిజిస్ట్రార్ డీఎం మమత, డీన్లు చంద్రకళ, భారతి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ ర్యాలీలో వర్సిటీలోని వివిధ విభాగాలకు చెందిన 1,500 మంది విద్యార్థినులు పాల్గొన్నారు. వర్సిటీ నుంచి ప్రారంభమైన ర్యాలీ మహాత్మా జ్యోతిరావు పూలే విగ్రహం వరకు సాగింది. ఈ కార్యక్రమంలో వ్యాయామ విభాగాధిపతి డాక్టర్ జి.శారా సరోజిని, వివిధ విభాగాల ప్రొఫెసర్లు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి
చిత్తూరు
మదనపల్లె జోన్
బుధవారం 30 , ఆగస్టు 2017

మద్యం సేవించి వాహనాలు నడపద్దు



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రుషికేశవ

ములకలచెరువు: మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రాణాలు పోగొట్టుకుని కుటుంబీకులను అనాథలను చేయొద్దని సీఐ రుషికేశవ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని మైదానంలో మంగళవారం ట్రాక్టర్ల డ్రైవర్లు, యజమానులు, టమోటాలు తోలే లగేజీ వాహనదారులకు జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వాహనదారులు వాహనాలు నడిపేటప్పుడు కుటుంబీకులను గుర్తుపెట్టుకోవాలన్నారు. ఈసమావేశంలో ఎస్ఐ ఈశ్వరయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

ఉలవల కోసం ఎగబడిన రైతులు



ఉలవల కోసం ఎగబడుతున్న రైతులు

గుర్రంకొండ: వేరుశనగ పంట దెబ్బతినడంతో ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఉలవలును వ్యవసాయశాఖ రైతులకు పంపిణీ చేస్తోంది. మంగళవారం గుర్రంకొండ ఎంపీడీవో కార్యాలయానికి వందల మంది రైతులు ఉలవల కోసం వచ్చారు. గుర్రంకొండకు 25కేజీల బస్తాలు 160 వచ్చాయి. అవసరం మేరా ఉలవలు రాకపోవడంతో వచ్చిన ఉలవలు ఎక్కడ అయిపోతాయోనన్న ఆందోళనతో ఉదయాన్నే రైతులు కార్యాలయానికి చేరుకున్నారు. అధికారులు రైతుకు 5కేజీల చొప్పున పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్, ఏఈవో వెన్నెల, సమీన, రిజ్వాన, తదితరులు పాల్గొన్నారు.

భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యం

కురబలకోట: భూగర్భ జలాలను పెంచడమే లక్ష్యమని రాష్ట్ర వాటర్‌షెడ్ అడ్వైజర్ కమిటీ డైరెక్టర్ శివప్రసాద్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె పరిధిలో ఎంపికైన వాటర్‌షెడ్ పనులను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూగర్భ జలాల పెంపునకు ఎంతో కృషిచేస్తోందన్నారు. ఇందులో భాగంగా మండలంలోని ముదివేడు, పిచ్చలవాండ్లపల్లె పరిధిలో వాటర్‌షెడ్ చెక్‌డ్యాంల నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగిందన్నారు. వాటర్‌షెడ్డు ఐదేళ్ల పాటు కొనసాగుతుందన్నారు. మంజూరైన నిధులను మొదట రెండేళ్లపాటు వినియోగించడం జరుగుతుందన్నారు. అవసరమైతే మరిన్ని నిధులను మంజూరు చేయనున్నట్లు తెలిపారు. వీటికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రభుత్వానికి నివేదిక అందజేసి పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూమిరెడ్డి, డ్వామా పీడీ కూర్మానంద్, టీడీపీ మండలాధ్యక్షుడు పి.సురేంద్రయాదవ్, వైజీ రమణ, ఏపీవో మంజుల, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సాధికారసర్వే నమోదు చేసుకోండి

బి.కొత్తకోట: మండలంలోని తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సాధికారసర్వే నమోదు చేసుకోండని ఇనX ఛార్జి తహసీల్దార్ హనుమంతు పేర్కొన్నారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ ప్రజా సాధికారసర్వేలో గతంలో నమోదు చేసుకోనివారు తహసీల్దార్ కార్యాలయంలో ఈనెల 30 నుంచి వచ్చేనెల 30వరకు నమోదు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

విద్యార్థులు క్రీడాస్ఫూర్తితో ముందుకుసాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న మిట్స్ ప్రిన్సిపాల్ యువరాజ్

కురబలకోట: ప్రతి ఒక్కరూ క్రీడాస్ఫూర్తితో ముందుకు సాగాలని మిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ యువరాజ్ పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. దీంతో మానసిక ఒత్తిడిని ఎదుర్కోవడంతో పాటు ఆరోగ్యంగా ఉండొచ్చన్నారు. ఈసందర్భంగా విద్యార్థులకు పలురకాల క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ఈకార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ రామ్‌కుమార్, డీనX లు రాంప్రసాద్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాషా దినోత్సవం







సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో రెడ్డిశేఖర్-తెలుగుభాష దినోత్సవాన్ని జరుపుకుంటున్న పాదచారుల సంఘం సభ్యులు - పీటీఎం కేజీబీవీలో ...

బి.కొత్తకోట: మండలంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాష దినోత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా మండల విద్యాశాఖాధికారి రెడ్డిశేఖర్ మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు బాగా నేర్చుకుని మంచి నైపుణ్యం సంపాదించాలన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన పద్యాల పోటీ, సాహిత్యాల పోటీ, వ్యాసరచన పోటీల్లో విజేతలకు ఎఈవో రెడ్డిశేఖర్, ప్రిన్సిపాల్ ఆషీఫ్‌అలిలు బహుమతులు అందజేశారు. పట్టణంలోని పాదచారుల ఆశ్రమంలో తెలుగుభాష దినోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా పాదచారుల సంఘం ప్రతినిధి కృష్ణారెడ్డి మాట్లాడుతూ తెలుగుభాష వైభవాన్ని చాటుదామన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, శ్రీనివాసులునాయక్, భారతి, శ్రీనివాసులు, పాదచారుల సంఘం సభ్యులు సుదర్శనX , ప్రసాద్, మూర్తి, శంకర, గోపాల్, వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీలో...పెద్దతిప్పసముద్రం: మండలంలోని కస్తూరిబా గురుకుల బాలికల పాఠశాల, ఉర్దూ హైస్కూల్ తదితర చోట్ల మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. తెలుగుతల్లి చిత్రపటానికి నివాళులర్పించిన అనంతరం జరిగిన సమావేశంలో తెలుగుభాష ఔనత్యాన్ని, ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఈకార్యక్రమంలో ఎంఈవో నారాయణ, స్పెషలాఫీసర్ శ్రీమతి, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీచైతన్యలో... మదనపల్లె రూరల్: వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా మంగళవారం పట్టణంలోని పలు ప్రైవేటు పాఠశాలల్లో తెలుగుబాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. స్థానిక చైతన్య హైస్కూల్లో విద్యార్థులు పంచెకట్టులో శ్రీకృష్ణదేవరాయల ఆస్థానం నాటిక ప్రదర్శించారు. అష్టదిగ్గజాల కవులతో కవితలు చెబుతూ ఆకట్టుకున్నారు. ప్రశాంతనగర్‌లోని రెండో బ్రాంచిలో ఏజీఎం శ్రీనివాసులు మాట్లాడుతూ గిడుగురామ్మూర్తి తెలుగుభాషాభివృద్ధికి ఎంతో సేవలు అందించారన్నారు. ఆయన ఆశయాలను విద్యార్థులు కొనసాగించాలన్నారు. చైతన్య భారతి, జ్ఞానోదయహైస్కూళ్లలో తెలుగుబాష దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కరస్పాండెంట్‌లో కామకోట ప్రసాదరావు, ఆర్.వి.రమణ, మురళీధర్‌నాయుడు పాల్గొన్నారు.



అష్టదిగ్గజ నాటిక ప్రదర్శన

ఎస్సీలకు భూమి పంపిణీ



పట్టాలను పంపిణీ చేస్తున్న ఎస్సీ కార్పొరేషనX ఈడీ కనక నరసారెడ్డి, తహసీల్దార్ ప్రమీల

వాల్మీకిపురం:మండలంలోని నిరుపేదలైన భూమిలేని ఎస్సీలకు 20మందికి మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద భూమిని పంపిణీ చేశారు. భూమి కొనుగోలు పథకం కింద రూ.86లక్షలు వెచ్చించి ప్రభుత్వం రైతులు విశ్వనాథరెడ్డి, శ్రీనివాసులు, దీప్తిల నుంచి 22ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. కొనుగోలు చేసిన భూమిని ఎస్సీ కార్పొరేషనX ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కనక నరసారెడ్డి చేతుల మీదుగా లబ్ధిదారులకు పట్టాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీల, ఆర్ఐ ఫిరోజ్‌ఖానX , శశికళ, వీఆర్వోలు సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనల మేరకు వాహనాలు నడపాలి

పెద్దతిప్పసముద్రం: వాహనదారులు ప్రభుత్వ నిబంధనల మేరకే వాహనాలు నడపాలని ఎస్ఐ రవికుమార్‌యాదవ్ పేర్కొన్నారు. మంగళవారం ఉదయం నుంచే బస్టాండ్ కూడలిలో నాకాబందీ నిర్వహించారు. హెల్మెట్ లేకుండా ద్విచక్రవాహనాలు నడుపుతున్న వారికి అక్కడికక్కడే హెల్మెట్లు కొనేలా చేశారు. గ్రామస్థులను సమావేశ పరచి హెల్మెట్ యొక్క ప్రాధాన్యతను వివరించారు. హెల్మెట్లు ధరించిన వారితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం మండలంలోని ట్రాక్టర్ డ్రైవర్లను రప్పించి ప్రభుత్వ నిబంధనలపై అవగాహన కల్పించారు. డ్రైవింగ్ లైసెన్సును తప్పనిసరిగా పొందాలని కోరారు. నిబంధనలు అతిక్రమిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

హౌసింగ్ బిల్లు ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటా

జేసీకి గంగాదొడ్డివాసి ఫోనX .. పరుగులు తీసిన అధికారులు

వాల్మీకిపురం: రేపటిలోగా హౌసింగ్ బిల్లు ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని మండలంలోని గంగాదొడ్డి గ్రామానికి చెందిన హౌసింగ్ లబ్ధిదారు నాగమణి భర్త జాయింట్ కలెక్టర్‌కు ఫోనX చేయడంతో హౌసింగ్ అధికారులు మంగళవారం సాయంత్రం గంగాదొడ్డికి పరుగులు తీశారు. ఇటీవల నాగమణి పేరిట ఎన్టీఆర్ గృహకల్పలో ఇల్లు మంజూరైంది. అయితే ఏడాది క్రితమే నాగమణి కుటుంబం పునాది వేసి గోడలు నిర్మించి పైకప్పుపై రేకులు వేసుకుని కాపురముంటున్నారు. మంగళవారం సాయంత్రం నాగమణి భర్త సుబ్రహ్మణ్యంనాయుడుతో హౌసింగ్ డీఈ చంద్రశేఖర్‌బాబు, ఏఈ సదాశివరెడ్డిలు మాట్లాడి కౌన్సిలింగ్ ఇచ్చారు. ఇటీవల నీ భార్య పేరిట ఇల్లు మంజూరైందని అయితే గతంలోనే పునాది వేసి గోడలు నిర్మించి పైకప్పుపై రేకులు వేసుకుని జీవిస్తున్న దృష్ట్యా పునాది బిల్లు మాత్రం మంజూరు చేస్తామన్నారు. పాతగోడను తొలగించి కొత్తది నిర్మించినట్లయితే గోడల బిల్లుకూడా మంజూరు చేస్తామన్నారు. విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు.



లబ్ధిదారుడికి కౌన్సెలింగ్ ఇస్తున్న హౌసింగ్ డీఈ, ఏఈలు

కోలాహలంగా గణేశX నిమజ్జనం

తంబళ్లపల్లె: మండల కేంద్రంలో గణేశX యూతX సభ్యులు ఏర్పాటు చేసిన వినాయకుడిని మంగళవారం కోలాహలంగా నిమజ్జనం చేశారు. లడ్డు వేలం పాటలో స్థానిక హిందూ, ముస్లిం యువకులు పోటీ పడి రూ.12,500 వేలం పాడి దక్కించుకున్నారు. ఉట్టికొట్టేందుకు స్థానిక యువకులు ఆసక్తి చూపారు. అనంతరం గ్రామ పురవీధుల్లో అంగరంగ వైభవంగా టాల్ బాయ్స్ బెంగళూరుకు చెందిన వారు చేసిన విచిత్ర వేషదారణ అందరినీ ఆకట్టుకుంది. ప్రత్యేక పూజలు, మేళతాళాలు మధ్య వినాయకుడి నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో గణేశX యూతX సభ్యులు, భాస్కర్, ఉదయ్‌కుమార్, ప్రవీణ్, వెంకటేష్, విష్ణు, సదాశివ, కిరణ్, వినోద్, తదితరులు పాల్గొన్నారు.



నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు

వైభవంగా గంగజాతర

నగరి: నగరి మున్సిపాలిటీ పుదుపేట, ఒరుగుంటాపురం, సాల్వ పట్టెడల్లో మంగళవారం గంగజాతర ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మండలంలోని బుగ్గదేవాలయం నుంచి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు, గెరిగెలను ఆయా గ్రామాల్లో ఊరేగించారు. రాత్రి నడి వీదిలో గంగమ్మను ప్రతిష్ఠించారు. నగరి ప్రాంతంలో మరో 15 రోజుల పాటు పలు గ్రామాల్లో గంగజాతరలు జరగనున్నాయి.



ప్రమాదాల నివారణకు సహకరించండి

నింద్ర: రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు తమవంతు సహకారం అందించాలని నగరి సీఐ మల్లికార్జునగుప్త పిలుపునిచ్చారు. మంగళవారం నింద్రలోని నేటమ్స్ షుగర్స్ కర్మాగార ఆవరణలో కార్మిక సిబ్బందికి రోడ్డు ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు భారతదేశం 30 శాతం మేరకు కృషి చేయడానికి ఐకరాజ్య సమితిలో ప్రతిజ్ఞ చేసిందని, దీంతో మన దేశంలో ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించినప్పుడు ప్రమాదాలు అరికట్టవచ్చని ద్విచక్ర వాహనదారులు తప్పని సరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. కార్యక్రమంలో ఎస్ఐ నరేంద్ర, పోలీసు సిబ్బంది, కార్మిక సిబ్బంది పాల్గొన్నారు.

నగరి ఉపాధ్యాయుడికి తెలుగుభాష పురస్కారం



అవార్డుతో పురుషోత్తమ ఆచారి

నగరి: తెలుగుభాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని నగరి మండలం నాగరాజకుప్పం ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు ఎం.పురుషోత్తమ ఆచారికి జిల్లా కలెక్టర్ ఉత్తమ సేవా పురస్కారాన్ని అందజేశారు. మంగళవారం చిత్తూరులో జరిగిన తెలుగుభాషా దినోత్సవ సభలో నగరికి చెందిన పురుషోత్తమ ఆచారికి ఉత్తమ అవార్డు అందజేశారు. జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, ఎమ్మెల్సీ రాజసింహులు, ఎమ్మెల్యే సత్యప్రభ, జడ్పీ ఛైర్మన్ గీర్వాణి తదితరులు ఆయనను అభినందించారు.

నల్ల బ్యాడ్జీలతో రెవెన్యూ అధికారుల నిరసన

నాగలాపురం: నాగలాపురం తహసీల్దార్ రేణుకమ్మపై పోలీసులు కేసును ఉపసంహరించుకోవాలంటూ రెవెన్యూ సిబ్బంది నల్లబ్యాడ్జీలతో విధులకు హాజరయ్యారు. తహసీల్దార్ రేణుకమ్మ సహా ఆర్ఐలు, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది నల్ల బ్యాడ్జీలతో విధులు నిర్వహించారు.

సత్యవేడు: నాగలాపురం తహసీల్దార్ రేణుకమ్మపై కేసు నమోదు చేయడం తగదంటూ సత్యవేడు రెవెన్యూ సిబ్బంది నల్ల బ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. తహసీల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

నింద్ర: చిన్నారులకు తల్లిపాలతో పాటు పౌష్టికాహారాన్ని అందిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీవో కృష్ణమంజరి అన్నారు. నింద్ర పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ఇంక్రిమెంటల్ లెర్నింగ్ అప్రోచ్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణమంజరి మాట్లాడుతూ... ఎదిగే పిల్లలకు పోషకాహారాన్ని అందించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా తెలుగుభాషా దినోత్సవం







నగరి డిగ్రీ కళాశాల, కావనూరు ప్రాథమికోన్నత పాఠశాల, ఎస్ఎస్‌పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో జరిగిన కార్యక్రమాలు

నగరి: తెలుగుభాషతోనే ఆధునిక విద్య సామాన్యుడికి చేరువైందని, వాడుక భాషను పుస్తక భాషగా తీసుకురావడానికి గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు కృషి ఎన్నదగినదని నగరి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రాజేంద్రనాయుడు అన్నారు. మంగళవారం నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగుభాషా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుభాష అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. విద్యాన్ మునిరత్నంనాయుడు తెలుగుభాష పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలను వివరించారు. పోటీ పరీక్షల్లో తెలుగు మాధ్యమం అభ్యర్థులకు ఐదు శాతం రిజర్వేషన్ కల్పించాలని, ప్రాథమిక విద్య తప్పని సరిగా మాతృభాషలో చదవాలని, ఇంటర్ విద్యారంగంలో ప్రైవేటు కళాశాలల్లో తెలుగు తప్పని సరి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు మన్యం నరసింహులు, పి.ఎస్.రావు, రాణి, చిట్టి కళావతి, శ్రీదేవి, శ్రీనివాసులు, శివ, పద్మావతి, విద్యార్థులు పాల్గొన్నారు. నగరి పట్టణంలోని వశిష్ఠ, సరస్వతీ విద్యాలయాల్లో మంగళవారం తెలుగుభాష దినోత్సవాలు ఘనంగా జరిగాయి. తెలుగుభాష ప్రాధాన్యం గురించి విద్యార్థులకు వివరించారు.

నింద్ర: వ్యవహారిక భాషా పితామహుడు, తెలుగు భాషోద్యమకర్త గిడుగు వెంకట రామ్మూర్తి జయంతిని పురస్కరించుకుని మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని మండలంలోని కావనూరు ప్రాథమికోన్నత పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల విద్యాశాఖ అధికారి నారాయణ ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన మాట్లాడుతూ పిల్లల్లో తెలుగుభాషపై పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి అందరూ కృషి చేయాల్సి ఉందన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నాగలాపురం: తెలుగు సంస్కృతి దేశాభివృద్ధికి ఆధారమని నాగలాపురం మండలంలోని ఎస్ఎస్‌పురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం సుధాకరరాజు అన్నారు. మంగళవారం వాడుక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు రామ్మూర్తి జయంతి, మాతృభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గిడుగు రామ్మూర్తి జీవిత విశేషాలను, మాతృభాషా అభివృద్ధికి ఆయన చేసిన కృషిని వివరించారు. అలాగే విద్యార్థులు గిడుగు రామూర్తి, తెలుగుతల్లి, ఆది కవులు, నన్నయ, తిక్కన, ఎర్రాప్రగడ, యోగి వేమన వేషధారణలతో అలరించారు. దేశభాష లందు తెలుగు లెస్స అనే విధంగా అ, ఆ లు చక్రాలుగా ఉన్న ప్రదర్శన ఆకట్టుకుంది. అలాగే నాగలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కూడా తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో బాబయ్య ఉపాధ్యాయులు రంజిత్ కుమార్, కార్తికేయ, మోక్షదాయని, శ్రీదేవి, పుష్ప, నిర్మల, ఉదయచంద్రిక, సీఆర్పీ శివయ్య తదితరులు పాల్గొన్నారు.

అవినీతిని వెలికితీస్తే అట్రాసిటీ కేసులు పెడతారా?

నాగలాపురం: నాగలాపురం తహసీల్దార్ కార్యాలయంలో అధికారుల అవినీతిని సాక్ష్యాధారాలతో బయటపెట్టామని, దాన్నుంచి తప్పించుకోవడానికే తమపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టించారంటూ విశ్రాంత సీఐ జయచంద్రరాజు వాపోయారు. మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... భూ ఆక్రమణలు, రెవెన్యూ అధికారుల అవినీతిపై గతంలో పలు పత్రికల్లో అనేక కథనాలు ప్రచురితమయ్యాయని అప్పుడు రెవెన్యూ సంఘాలు, ఉన్నతాధికారులు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. తహసీల్దార్ రేణుకమ్మ భూ మార్పిడికి సహకరించినట్టు సాక్ష్యాధారాలతో ఈనెల 18న రైతులు శ్రీనివాసులు యాదవ్, నారాయణశెట్టి ఆధ్వర్యంలో పోలీసులకు ఫిర్యాదు చేశామన్నారు. ఉన్నతాధికారులతో చర్చించి ఫిర్యాదు అందిన నాలుగురోజుల తర్వాతే తహసీల్దార్‌పై కేసు నమోదు చేశారన్నారు. తహసీల్దార్ లేని సమయంలో ఆవుల శ్రీనివాసులు, తాను కార్యాలయంలోకి చొరబడి విధులకు ఆటంకం కలిగించామంటూ తహసీల్దార్ సంతకంలో జూనియర్ అసిస్టెంట్ కిరణ్ పోలీసులకు ఫిర్యాదు చేయడం, అలాగే రెవెన్యూ కార్యాలయ సిబ్బంది కృష్ణన్ ను తాను, శ్రీనివాసులు కులం పేరుతో దూషించామంటూ రెండుసార్లు ఫిర్యాదు చేయడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. అవినీతి అధికారులను వదిలిపెట్టేది లేదన్నారు.

వేగనిరోధకాలతో ప్రమాదం దూరం

విజయపురం: వేగ నిరోధకాలతో ప్రమాదాలను కొంత వరకు దూరం చేయవచ్చని ఎస్ఐ ప్రసాద్‌రావు అన్నారు. మంగళవారం మండలంలోని పన్నూరు సబ్‌స్టేషన్ సమీపంలో వేగ నిరోధకాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలను అతి వేగంగా నడపడం, పరిమితికి మించి ప్రయాణికులు, ఇతరాలను వాహనాల్లో తరలిస్తుండడంతోనే ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ వాహన రికార్డులను తమ వద్దే ఉంచుకోవాలన్నారు.

నేటికీ రెండు గ్లాసుల పద్ధతా: డీహెచ్ పీఎస్ ఆవేదన

పుత్తూరు: స్వాతంత్ర్యం వచ్చి 70 ఏళ్ల అవుతున్నా జరుగుతున్నా నేటికీ సమాజంలో రెండు గ్లాసుల పద్ధతి కొనసాగుతోందని దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుబ్బయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పుత్తూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... కర్నూలు జిల్లా సిరిమామడొడ్డిలో ఇప్పటికీ రెండు గ్లాసుల పద్ధతే కాకుండా దళితులకు ఆలయ ప్రవేశం లేదన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటు చేయాలని దళితులు ప్రయత్నిస్తే వారిని గ్రామంనుంచి బహిష్కరించారన్నారు. చిత్తూరు జిల్లాలో మహాభారత ఉత్సవాలకు దళితులను బహిష్కరించారని ఆరోపించారు. ఇటీవల దళితులపై దాడులు అధికమయ్యాయని ఆవేదన వ్యక్తం చేశారు. దళితుల్లో చైతన్యం తెచ్చేందుకు రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్నామన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు లక్ష్మయ్య, ఉపాధ్యక్షుడు కాలయ్య, నాగరాజు, బాబురావు, రఘు, మహేష్, బాలాజీరావు పాల్గొన్నారు.



ఆవుల పంపిణీలో చైర్మన్ బాల సురేష్

రుణాలను సద్వినియోగం చేసుకోండి

నగరి: పాడి రైతుల అభివృద్ధికి సహకార బ్యాంకు ద్వారా మరిన్ని రుణాలు అందిస్తున్నామని వాటిని సద్వినియోగం చేసుకోవాలని నగరి సహకార రూరల్ బ్యాంకు ఛైర్మన్ బాలసురేష్ కోరారు. మంగళవారం బ్యాంకులో పాడి రైతులకు రుణాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా సహకార బ్యాంకు, నాబార్డు సంయుక్త ఆధ్వర్యంలో వివిధ రుణాలను పంపిణీ చేస్తున్నామన్నారు. ప్రత్యేకించి ఎస్సీ, ఎస్టీలకు 33 శాతం, ఓసీ, బీసీలకు 25 శాతం రాయితీతో రుణాలు ఇస్తామన్నారు. మండలంలోని మూలనత్తం, చిన్నల్లూరు, అర్జునప్పనాయుడుకండ్రిగలకు చెందిన 12 మంది రైతులకు రూ.10 లక్షల విలువైన పాడి ఆవులను పంపిణీ చేశారు. బ్యాంకు మేనేజర్ కీర్తిసుధ, సీఈవో తులసిపిళ్లై, సిబ్బంది పాల్గొన్నారు.

బూత్‌కమిటీలు బాధ్యతగా పనిచేయాలి

నారాయణస్వామి



మాట్లాడుతున్న వైసీపీ నాయకులు

సత్యవేడు: క్షేత్రస్థాయిలో బూత్‌కమిటీ సభ్యులు సైనికుల్లా పనిచేయాల్సిన అవసరం ఉందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, జీడీ నెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామి పిలుపునిచ్చారు. మంగళవారం సత్యవేడు పట్టణంలోని బేరిశెట్టి కల్యాణమండపంలో నియోజకవర్గ వైసీపీ సమన్వయకర్త ఆదిమూలం ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ధనబలంతో అధికార పక్షం చేసే అగడాలను ప్రజలు చూస్తున్నారన్నారు. 2014 ఎన్నికల సందర్భంగా టీడీపీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదన్నారు. వైసీపీ నవరత్నాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. దీనికోసం పదిమందితో ప్రతిగ్రామంలో బూత్‌కమిటీలను ఏర్పాటు చేయాలన్నారు. తిరుపతి ఎంపీ వరప్రసాద్, సత్యవేడు మండల పార్టీ అధ్యక్షుడు సుశీల్‌కుమార్‌రెడ్డి, నాయకులు బీరేంద్రవర్మ, మునిశేఖర్‌రెడ్డి, బాలజీరెడ్డి, రఘుపతిరెడ్డి, బాస్కర్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ సత్యవేడు అసెంబ్లీ బూత్‌లకు ఇన్‌చార్జిగా తంజా మోహన్

తిరుపతి (పద్మావతినగర్): సత్యవేడు నియోజకవర్గ అసెంబ్లీ బూత్‌లకు బీజేపీ ఇన్‌చార్జిగా తంజా మోహన్‌ను నియమిస్తున్నట్టు జిల్లా అధ్యక్షుడు చంద్రారెడ్డి ప్రకటించారు. బైరాగిపట్టెడలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన ఓ సమావేశంలో ఆయన ఈమేరకు నియామక పత్రాన్ని మోహన్‌కు అందజేశారు. పార్టీ సిద్ధాంతాలు, ఆదర్శాలకు అనుగుణంగా పనిచేయాలని సూచించారు. మోహన్ మాట్లాడుతూ తన పరిధిలోని బూత్‌లలో పార్టీ బలోపేతానికి కృషిచేస్తానని చెప్పారు.

నగరిలో ట్రైనీ కలెక్టర్

నగరి: నగరి రెవెన్యూ కార్యాలయంలో మంగళవారం ట్రైనీ కలెక్టర్ సి.కీర్తి రెవెన్యూ శాఖ కార్యక్రమాలను పరిశీలించారు. శిక్షణలో భాగంగా నగరి రెవెన్యూ కార్యాలయంలో పది రోజుల పాటు విధులు నిర్వహించనున్నారు. రెవెన్యూశాఖలోని వివిధ విభాగాల అంశాలపై అవగాహన పొందుతున్నారు. తహసీల్దార్ వెంకటరమణ, సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు టీకాలు

నింద్ర: ప్రభుత్వం ఉచితంగా అందించే గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పుత్తూరు ఏడీ నింద్ర ఇన్‌చార్జి పశు వైద్యాధికారి రవికుమార్ కోరారు. మంగళవారం మండలంలోని అగరం, అత్తూరు, నింద్ర గ్రామాల్లో పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

మదనపల్లె రూరల్: ప్రభుత్వ నిబంధనలను అతిక్రమించిన ప్రైవేటు డిగ్రీ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని ఆర్‌ఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఉత్తన్న డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఆర్‌ఎస్‌ఎఫ్ కార్యాలయంలో డివిజన్ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తన్న మాట్లాడుతూ యోగివేమన యూనివర్శిటి పరిధిలోని కొన్ని ప్రైవేటు కళాశాలలు జీవో 29ను అమలు చేయడం లేదన్నారు. దీనిపై అధికారులు స్పందించి జీవోను అమలు చేయని కళాశాల గుర్తింపు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్‌ఎస్‌ఎఫ్ నాయకులు శ్రీనాథ్, ఫయాజ్, సలాంబాష, భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హీరో నాగార్జున జన్మదిన వేడుకలు

మదనపల్లె టౌన్: ప్రముఖ హీరో అక్కినేని నాగార్జున 59వ జన్మదిన వేడుకలను మదనపల్లెలో అయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక బర్మావీధిలోని చైతన్య అనాథశ్రమంలో నాగార్జున జన్మదినాన్ని పురస్కరించుకుని అభిమానులు కేక్ కట్‌చేసి పిల్లలకు పంచిపెట్టారు. అనంతరం పిల్లలకు అన్నదానం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున ప్యాన్స్ అసోసియేషన్ నాయకులు కె.బాబ్‌జాన్ మాట్లాడుతూ తమ అభిమాన హీరో జన్మదిన వేడుకలను అనాథపిల్లల మధ్య జరుపుకోవడం సంతోషంగా ఉందన్నారు. ఈకార్యక్రమంలో లోకేష్, రజాక్, యశ్వంత్‌బిట్టు, గంగాధర్, ముకుంద తదితరులు పాల్గొన్నారు.



అనాథశ్రమంలో నాగార్జున జన్మదిన వేడుకలను నిర్వహిస్తున్న అక్కినేని అభిమానులు

పేదలకు ఇంటిపట్టాలు మంజూరు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న మహిళలు

మదనపల్లె రూరల్: అర్హులైన నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించి న్యాయం చేయాలని మదనపల్లె లారీ వర్కర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు జింకా వెంకటాచలపతి కోరారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ నాగార్జునరెడ్డిని కలసిన ఆయన మాట్లాడుతూ మండలంలోని బసినికొండ పంచాయతీ డ్రైవర్స్ కాలనీలో ఎక్కువగా నిరుపేదలున్నారన్నారు. ఇటీవల ప్రభుత్వం నిరుపేదలకు ఇళ్లస్థలాలు కేటాయించడంతో పాటు, హౌసింగ్ పథకం కింద ఇళ్లు కేటాయిస్తున్నారన్నారు. డ్రైవర్స్‌కాలనీలో అర్హులైన నిరుపేదలకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

హక్కుల కోసం చుక్కల భూముల

అనుభవదారులు దరఖాస్తు చేసుకోండి

సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శేషయ్య



మదనపల్లె టౌన్: చుక్కల భూములు అనుభవిస్తున్న రైతులు పూర్తి హక్కుల కోసం మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని సబ్‌కలెక్టర్ కార్యాలయ ఏవో శేషయ్య కోరారు. స్థానిక ఏవో కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లోని 17 మండలాల్లో 58, 653ఎకరాల డాటెడ్ భూములు ఉన్నట్లు చెప్పారు. ఈ భూములను అనుభవిస్తున్న వారు ఆయా మండలాల్లోని మీసేవా కేంద్రాల్లో వారి వద్ద ఉన్న హక్కు పత్రాలను పొందుపరచి దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మీ సేవాలో దరఖాస్తు చేసుకున్న వివరాల మేరకు తహసీల్దార్‌లను నోటీసులు జారీ చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం తమ విచారణ నివేదికను సబ్‌కలెక్టర్‌కు అందజేస్తారన్నారు. సబ్‌కలెక్టర్ పరిశీలించి ఆ నివేదికను కలెక్టర్‌కు పంపుతారని, కలెక్టర్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన కమిటీ నెలలో మూడు రోజులు సమావేశం నిర్వహించి అర్హులైన వారికి పూర్తి హక్కు కల్పించనున్నట్లు చెప్పారు. 12 సంవత్సరాలకు పైగా అనుభవం, హక్కు కలిగిఉన్న వారు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ఈ అవకాశాన్ని అర్హులైన వారు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఆరోగ్యవరంపై ఎమ్మిగనూరు జట్టు విజయం



మూడుగోల్స్‌తో గెలుపొందిన కాకినాడ జట్టు

మదనపల్లె రూరల్: ఆరోగ్యవరంలో సౌత్ ఇండియాస్థాయిలో జరుగుతున్న అలెగ్జాండర్ మెమోరియల్ ఫుట్‌బాల్ టోర్నీలో మంగళవారం జరిగిన మ్యాచ్ లలో అరోగ్యవరం-బి జట్టుపై ఎమ్మిగనూర్ జట్టు 2-0 గోల్స్ సాధించి విజయం సాధించింది. బెంగళూరు జట్టుపై కాకినాడ జట్టు3-0 గోల్స్ సాధించి గెలవగా, ఆత్మకూరు జట్టుపై బిట్రగుంట జట్టు 1-0 గోల్స్‌తో విజయం సాధించింది. మొత్తం 22 జట్లు పాల్గొంటున్న టోర్నీలో ఏడు జట్లు పరాజయం పాలై ఇంటి దారి పట్టాయి. నిర్వాహకులు జానీ, నాషీ, అల్బర్ట్ మహేష్‌లు మ్యాచ్ లను పర్యవేక్షించారు.

బిడ్డ మృతికి టెక్నీషియనే కారణమంటూ డీఎస్పీకి ఫిర్యాదు

మదనపల్లె అర్బన్: పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో టెక్నీషియన్ వైద్యుడిగా చెప్పుకుంటూ తమ కుమారుడి మృతికి కారణమయ్యారని మంగళవారం డీఎస్పీ కె.చౌడేశ్వరికి ఓ వ్యక్తి ఫిర్యాదు చేశాడు. అతడు చేసిన ఫిర్యాదు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణం విజయ్‌నగర్‌కాలనీకి చెందిన పల్లపు రెడ్డెప్ప కుమారుడు పి.రెడ్డిబాబు(25)కు ఈనెల 19 తీవ్రమైన కడుపు నొప్పి రావడంతో పట్టణంలోని ఆనంద్‌బాబు ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరీక్షలు చేసిన వైద్యులు పేగు పుండైందని తేల్చారు. అక్కడే పనిచేస్తున్న మల్లికార్జున అనే టెక్నీషియన్ తాను కూడా డాక్టర్‌నని తిరుపతిలోని హీలియస్ ఆసుపత్రికి తీసుకెళ్ళాలని సూచించాడు. ఈక్రమంలో బాధితులు రెడ్డిఅండ్‌రెడ్డి కాలనీలోని హీలియస్ అనే ఆసుపత్రికి వెళ్లారు. అక్కడి వైద్యులు డాక్టర్ కెనత్ బాధితుని మూడురోజుల పాటు అక్కడే ఉంచుకుని వారినుంచి రూ.3లక్షలు నగదు కట్టించుకుని 24వతేదీ పరిస్థితి విషమంగా ఉందంటూ వేరే ఆసుపత్రికి రేఫర్ చేశారు. దీంతో బాధితులు చేసేదిలేక చెన్నైకి తీసుకెళ్ళగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని ఆవేదన వ్యక్తం చేశాడు. డాక్టర్ కెనత్ స్పెషలిస్టు కాదు మత్తు డాక్టరని ఇటువంటి చోటుకు తాను డాక్టరు కాకపోయినా అబద్ధం చెప్పి పంపిన మల్లికార్జునపై కేసు నమోదు చేయాలని డీఎస్పీని కోరాడు.

సినిమా గైడ్

మదనపల్లె

ఏఎస్ఆర్	ఆనందో బ్రహ్మ
ఎంఎస్ఆర్	జెంటిల్‌మాన్ (హిందీ)
సిద్ధార్థ	అర్జున్ రెడ్డి
మినీసిద్ధార్థ	వీఐపీ-2
శ్రీకృష్ణ	వివేకం
సాయిచిత్ర	నేనే రాజు నేనే మంత్రి
రవి	జయ జానకి నాయక
సునిల్	ఫిదా

రేపు వాల్మీకిపురంలో ఉలవల పంపిణీ

వాల్మీకిపురం: వేరుశనగ పంట సాగు చేయని రైతులకు ప్రత్యామ్నాయంగా గురువారం వందశాతం రాయితీతో ఉలవలు పంపిణీ చేయనున్నట్లు మండల వ్యవసాయ అధికారి మురళి ఓ ప్రకటనలో తెలిపారు. ఉలవలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు, మొబైల్ ఫోన్ తీసుకుని సీడీసీఎంఎస్ గోదాము వద్దకు రావాలని కోరారు.

పాముకాటుతో మహిళకు తీవ్ర అస్వస్థత

మదనపల్లె అర్బన్: పాముకాటుతో ఓ మహిళ తీవ్ర అస్వస్థతకు గురైంది. గుర్రంకొండ మండలం బురుజుపల్లెకు చెందిన ఈశ్వర్‌రెడ్డి భార్య అరుణకుమారి(50)ఇంటి వద్ద వ్యవసాయ పనులు చేస్తుండేది. ఈక్రమంలో మంగళవారం ఈమె పొలం వద్ద పనులు చేస్తుండగా ఓ పాము కాటు వేసింది. దీంతో అరుణకుమారి తీవ్ర అస్వస్థతకు గురై పొలంలోనే పడిపోయింది. గమనించిన కుటుంబీకులు బాధితురాలిని చికిత్స నిమిత్తం హుటాహుటీన 108లో మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తీసుకొచ్చారు. ఇక్కడి వైద్యులు ఆమెకు మెరుగైన చికిత్స అందించి అనంతరం మహిళా వార్డుకు తరలించారు.

ఆంధ్రజ్యోతి
చిత్తూరు
పుత్తూరు జోన్
బుధవారం 30 ఆగస్టు 2017
పుత్తూరు • వడమాలపేట • వెదురుకుప్పం • కార్వేటినగరం • శ్రీరంగరాజపురం • నారాయణవనం



తవ్వేశారు... వదిలేశారు!

పుత్తూరు: పుత్తూరు పట్టణం 14వ వార్డులోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల ప్రహరీ నిర్మాణం కోసం మూడు నెలల కిందట గుంతలు తవ్వారు. అయితే ఈ గోడ నిర్మాణంలో సాంకేతిక లోపం కారణంగా అధికారులు అభ్యంతరం తెలిపారు. దీంతో సంబంధిత కాంట్రాక్టర్ గోడ నిర్మాణాన్ని ఆపారు. ఈ గుంతల్లో విద్యార్థులు పడి గాయాలపాలవు తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.

మాతృభాషపై మక్కువ పెంచుకోండి

పుత్తూరు: దేశంలో ఎన్ని భాషలున్న ప్పటికీ తెలుగుపై మక్కువ పెంచుకోవాలని పుత్తూరు మున్సిపల్ ఛైర్మన్ యుగంధర్ పిలుపునిచ్చారు. మంగళవారం తెలుగుభాషా దినోత్సవాన్ని పుత్తూరు శ్రీచైతన్య పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని భాషల కన్నా తెలుగుభాష తియ్యదని, మాతృభాషపై పట్టు సాధించాలని తెలిపారు. కార్యక్రమంలో వైస్‌ఛైర్మన్ రత్నంభాస్కర్, కౌన్సిలర్లు రాజశేఖర్‌వర్మ, వెంకటేష్, పాఠశాల ఏజీఎం శ్రీనివాసులు, శరవణన్, సంపత్ పాల్గొన్నారు.

పుత్తూరు రూరల్: తెలుగుభాష ఔన్నత్యాన్ని పరిరక్షించడానికి ప్రతి ఒక్కరు ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్ఎం గీతాకుమారి కోరారు. పాఠశాలలో జరిగిన తెలుగుభాషా దినోత్సవ సమావేశంలో ఆమె మాట్లాడుతూ విద్యార్థుల్లో తెలుగుభాషపై పరిజ్ఞానాన్ని పెంపొందించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. అనంతరం విద్యార్థులకు వివిధ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు చంద్రావతి, లక్ష్మీదేవి, నీరజ, ప్రసన్నకుమారి, మంజుల, మల్లికారాణి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ యుగంధర్

నాగలాపురం ఎస్ఐపై చర్యలు తీసుకోవాలి

శ్రీరంగరాజపురం: నాగలాపురం ఎస్ఐ మునిస్వామిపై చర్యలు తీసుకోవాలని ఎస్ఆర్‌పురం తహసీల్దార్ కార్యాలయ సిబ్బంది డిమాండు చేశారు. తహసీల్దార్ వెంకటలక్ష్మమ్మ, డీటీ మధుబాబు, ఆర్ఐ ఏకాంబరం, సర్వేయర్ గోపి, వీఆర్‌వోలు శశి, ప్రభాకర్, గోవర్ధన్ రెడ్డి, రెవెన్యూ సిబ్బంది నల్లబ్యాడ్జీలు ధరించి విధులు నిర్వహించారు.

యాసిడ్ పడి ఆర్టీసీ కార్మికులకు గాయాలు




చికిత్స పొందుతున్న కార్మికులు

పుత్తూరు రూరల్: యాసిడ్ పడి ఆర్టీసీ కార్మికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన మంగళవారం పుత్తూరులోని ఆర్టీసీ డిపోలోని గ్యారేజీ విభాగంలో జరిగింది. గోవిందరాజులు, రామరాజు పుత్తూరు ఆర్టీసీ డిపోలో మెకానిక్‌లు. మంగళవారం గ్యారేజీలో బ్యాటరీకి మరమ్మతులు నిర్వహిస్తుండగా అకస్మాత్తుగా అది పేలింది. దీంతో బ్యాటరీకి వినియోగించిన యాసిడ్ వారి ముఖంపై పడింది. వారిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రథమ చికిత్స చేసిన తరువాత తిరుపతికి తీసుకెళ్లారు.

కారు ఢీకొని...



పుత్తూరు: కారు ఢీకొని ఇద్దరు స్కూటరిస్టులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన మంగళవారం పుత్తూరు సమీపం పిళ్లారిపట్టు వద్ద జరిగింది. ఎస్ఐ హనుమంతప్ప కథనం మేరకు.. పుత్తూరు మండలం గొల్లపల్లి పంచాయతీ ఎస్సీ కాలనీకి చెందిన మునేంద్ర(50), ప్రశాంత్ (20) ద్విచక్రవాహనంలో పుత్తూరుకు వస్తూ పిళ్లారిపట్టు వద్ద బైపాస్ రోడ్డును దాటుతుండగా తిరుపతి నుంచి చెన్నై వెళుతున్న కారు ఢీకొంది. దీంతో మునేంద్ర, ప్రశాంత్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం తిరుపతి రుయాకు తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

సినిమా గైడ్

పుత్తూరు

శాంతి	వీఐపీ2
విష్ణుమహల్	లై
శ్రీనివాస	వివేకం(తమిళం)

20 లీటర్ల సారా స్వాధీనం

ఒకరి అరెస్టు



శ్రీరంగరాజపురం: నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ఎస్ఆర్‌పురం ఎస్ఐ వాసంతి కథనం మేరకు.. మండలంలోని పోదలపల్లెకు చెందిన వెంకటయ్య కుమారుడు చిరంజీవి(45) మంగళవారం చిల్లమాకులపల్లె వద్ద సారా తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో సిబ్బందితో వెళ్లి తనిఖీ చేశామన్నారు. 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని చిరంజీవిపై కేసు నమోదు చేసి పుత్తూరు కోర్టుకు రిమాండ్‌కు తరలించామని తెలిపారు. ఈ దాడిలో కానిస్టేబుళ్లు జనార్దన్, గోపి, ఉమామహేశ్వర్, గోపి పాల్గొన్నారు.

నీరు-ప్రగతి పనులు వేగవంతం చేయండి

శ్రీరంగరాజపురం: నీరు-ప్రగతి పనులు వేగవంతం చేయాలని ఇరిగేషన్ డీఈ శివారెడ్డి ఆదేశించారు. మంగళవారం ఎస్ఆర్ పురం మండలం క్షీరసముద్రం, పద్మాపురం, పుల్లూరు పంచాయతీల్లో జరుగుతున్న చెరువు పనులను పరిశీలించారు. ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి పనులను వేగవంతం చేయాలన్నారు. పనుల వద్ద ఏఈ తప్పని సరిగా ఉండాలన్నారు. అలాగే చెక్‌డ్యాంల నిర్మాణాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ వెంకటరమణ, వర్క్ ఇన్‌స్పెక్టర్ దినేష్ పాల్గొన్నారు.

4న కల్యాణోత్సవం

వడమాలపేట: అప్పలాయగుంటలోని ప్రసన్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో సెప్టెంబర్ 4 తేదీ సోమవారం శ్రీవారి కల్యాణోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారి శ్రీనివాసరాజు తెలిపారు. కల్యాణోత్సవంలో పాల్గొనే దంపతులు రూ.300లు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అలాగే సంప్రదాయ దుస్తులతో హాజరుకావాల్సి ఉందన్నారు. ప్రతి నెలా శ్రీవారి జన్మనక్షత్రమైన శ్రవణం రోజున కల్యాణోత్సవం నిర్వహిస్తున్నారు.

జాడ లేని తెలుగుభాషా దినోత్సవాలు

నారాయణవనం: తెలుగు వ్యవహారిక భాషను అందలాన్ని ఎక్కించిన భాషా భగీరథుడు గిడుగు వెంకటరామ్మూర్తి పంతులు జయంతి సందర్భంగా తెలుగు భాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. అయితే నారాయణవనం మండలంలో మొత్తం 36 ప్రాథమిక, ఏడు ప్రాథమికోన్నత, నాలుగు ఉన్నత పాఠశాలల్లో భాషా దినోత్సవాన్ని నిర్వహించాల్సి ఉంది. మండల స్థాయిలో కూడా నిర్వహించి మాతృభాష ఔన్నత్యాన్ని చాటుకోవాల్సిన అవసరం ఎంతో ఉంది. అయినా ఎక్కడా జరుపుకున్నట్టు లేదు. గతంలో కలెక్టర్‌గా పనిచేసిన సాల్మన్ ఆరోక్యరాజ్ పట్టుబట్టి తెలుగులోనే పాలన జరిపించారు. ప్రస్తుతం అదేమీ కనబడడం లేదు. మాతృభాషపై మమకారం లేనట్టుగా వ్యవహరిస్తూ, తెలుగును కనుమరుగు అయ్యేలా వ్యవహరించడం విచారకరం. సంస్కృతి, సంప్రదాయాలకు సజీవ ప్రతిరూపమే భాష. అలాంటి భాషను భావితరాలకు అందించాల్సిన అవసరం ఉంది. ఆంగ్లభాషపై ఉండే మమకారాన్ని అమ్మభాష తెలుగుపై కూడా ఉండాలని పలువురు అంటున్నారు. అధికారులు కూడా మాతృభాష అభివృద్ధి దిశలో పయనించాలని పలువురు కోరుతున్నారు.

నీరు గారుతున్న స్వచ్ఛభారత్


నారాయణవనం బైపాస్ రోడ్డు వద్ద సామాజిక మరుగుదొడ్డి

పుత్తూరు: బహిరంగ ప్రదేశాల్లో మలమూత్ర విసర్జన నిర్మూలన కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్దేశించిన లక్ష్యాలు నెరవేరడం లేదు. పుత్తూరు మున్సిపాలిటీని స్వచ్ఛ ఆంధ్ర దిశగా తీసుకెళ్లడానికి ప్రజలు అధిక సంఖ్యలో తిరిగే కూడళ్లలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని అధికారులు నిర్ణయించారు. ఇందులో భాగంగా సులభ్ తరహా మరుగుదొడ్లను నిర్మించాలని మున్సిపాలిటీ తీర్మానం చేసింది. పట్టణంలోని అంబేద్కర్ సర్కిల్, హిమజ విద్యాసంస్థలు, ఆర్టీసీ బస్టాండ్, నారాయణవనం బైపాస్ రోడ్డు, పున్నమి బైపాస్ రోడ్డు వద్ద సామాజిక మరుగుదొడ్లు నిర్మించాలని ప్రతిపాదించారు. ఏప్రిల్ 28న నారాయణవనం బైపాస్ వద్ద సామాజిక మరుగుదొడ్డిని ప్రారంభించారు. అయితే మిగతా ప్రాంతాల్లో మరుగుదొడ్ల నిర్మాణాన్ని విస్మరించడంతో స్వచ్ఛ ఆంధ్ర ఆశయం నీరుగారుతోంది. ఇకనైనా ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు మేల్కొని ప్రధాన కూడళ్లలో సామాజిక మరుగుదొడ్లు నిర్మించాల్సి ఉంది.

స్క్రాప్ క్రాఫ్ట్ స్కిల్స్ కాంటెస్ట్‌పై అవగాహన


నమూనాలను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్ నవీన్

పుత్తూరు రూరల్: విద్యార్థిలో దాగి ఉన్న సృజనాత్మక నైపుణ్యం బహిర్గతమవడానికి స్క్రాప్ క్రాఫ్ట్ స్కిల్స్ కాంటెస్ట్‌లు దోహదపడతాయని ఎస్వీపీసెట్ ప్రిన్సిపాల్ నవీన్ అన్నారు. మంగళవారం కళాశాల డిప్లొమా విద్యార్థులకు పోటీలు నిర్వహించారు. నిరుపయోగ వస్తువులను ఎలా వినియోగంలోకి తీసుకురావచ్చో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ పోటీల్లో కాగితం, ప్లాస్టిక్ బాటిళ్లు, అట్ట పెట్టెలు తదితరాలతో చేసిన నమూనాలను ప్రదర్శించారు. హైడ్రాలిక్ క్రేన్ ను తయారు చేసిన విద్యార్థుల తేజారెడ్డి బృందానికి, ఆయిల్ రీసైక్లింగ్ నమూనా రూపొందించిన అమరనాథ్ బృందం, వ్యాక్యూమ్ క్లీనర్ నమూనాను తయారు చేసిన వీరేంద్ర బృందానికి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ఛైర్మన్ రావూరి బాలాజీ, ప్రిన్సిపాల్ మధురాంతకం, వైస్ ప్రిన్సిపాల్ జిలాన్, ఏవో కోటేశ్వరరావు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

వ్యక్తిగత మరుగుదొడ్లపై శ్రద్ధ చూపండి

కార్వేటినగరం: పంచాయతీల్లో మరుగుదొడ్లు లేని వారందరికీ అవగాహన కల్పించాలని ఎంపీడీవో రాజారావు, ఈవోఆర్డీ వెంకటరత్నమ్మ కార్యదర్శులను ఆదేశించారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ మరుగుదొడ్డి ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. మరుగుదొడ్లు మంజూరైన వారికి సకాలంలో బిల్లులు చెల్లించాలన్నారు.

చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.9.60 లక్షలు మంజూరు

కల్లూరు: పులిచెర్ల మండలం రాయవానిపల్లె పంచాయతీ పెద్దవాగులో చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.9.60 లక్షలు మంజూరైనట్లు సర్పంచు జయసుధ, టీడీపీ నాయకుడు నాగరాజనాయుడు తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీరు-ప్రగతి పథకం ద్వారా నిధులు మంజూరయ్యాయన్నారు. చెక్‌డ్యాం నిర్మాణంతో పెద్దవాగు ప్రాంతంలో వర్షపునీరు నిలిచి భూగర్భజలాలు పెరుగుతాయన్నారు

తెలుగుభాష మాధుర్యాన్ని అందరూ గుర్తించాలి

పీలేరు/కలకడ/కేవీపల్లె: తెలుగుభాష మాధుర్యాన్ని అందరూ గుర్తించాలని తెలుగుభాషా సమితి పీలేరుశాఖ ప్రధాన కార్యదర్శి జలకనూరి మురళీధరరాజు అన్నారు. మంగళవారం పీలేరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. గిడుగు రామమూర్తి పంతులు జన్మదినాన్ని పురస్కరించుకుని తెలుగుభాషా సమితి ఆధ్వర్యంలో పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ విద్యార్థులు తెలుగు కథలు, పద్యాలను చదవడం అలవాటు చేసుకోవాలని, మాతృభాషపై మమకారాన్ని పెంచుకున్నపుడే ఇతర భాషలపై పట్టు ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిబాష, ప్రధానోపాధ్యాయులు పూల రామానుజయ్య, మోడెం చెంగల్రాయుడు, పాటల రచయిత శ్రీరాములురాజు, ఉపాధ్యాయులు రత్నాకరం, రెడ్డిశేఖర రాజు, రాజేంద్ర, తెలుగు పండితులు హనుమంత రాజు, కృష్ణమూర్తి, జయశ్రీ, మహ్మద్ రఫీ, బాలాంజనేయులు, భాస్కరరెడ్డి, శ్రీధర్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన తెలుగుబాషా దినోత్సవం కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామకృష్ణ, అధ్యాపకులు అంజలీదేవి, అల్లావుద్దీన్, చెన్నకేశవులు, ఆదిశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ● కేవీపల్లెలో తెలుగుబాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. సమావేశంలో ఎంఈవో రెడ్డిభాషా, ఏఎస్ఐ మునిరత్నం మాట్లాడుతూ అన్ని భాషల్లో కెల్లా తెలుగుభాష గొప్పదన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రయ్య, ఉపాధ్యాయులు వెంకటరెడ్డి, చంద్ర శేఖర్, కిశోర్, మునిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.● కలకడలో ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ బాలాజీ ఆధ్వర్యంలో తెలుగుభాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సమావేశంలో ప్రముఖ కవి వేంపల్లి అబ్దుల్‌ఖాదర్ మాట్లాడుతూ తెలుగుభాష కమ్మదనాన్ని ఔన్నత్యాన్ని ఈతరం వారికి రుచి చూపించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో మునీంద్రనాయక్ విద్యార్థులు పాల్గొన్నారు.




పీలేరులో తెలుగుభాషా దినోత్సవ ర్యాలీ - కలకడలో మాట్లాడుతున్న వేంపల్లి అబ్దుల్‌ఖాదర్

అవ్వాతాతల పెంపకంలోనే నైతిక విలువలు



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ గాయత్రి

పీలేరు: పిల్లలకు అవ్వాతాతల పెంపకంలో నైతిక విలువలు అలవడుతాయని రవీంద్ర భారతి పాఠశాల ప్రిన్సిపాల్ గాయత్రి అన్నారు. మంగళవారం పీలేరు పట్టణంలోని రవీంద్రభారతి పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డేను ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కంప్యూటర్ల రాకతో నైతిక విలువలు క్షీణించి పెద్దలపట్ల గౌరవాభిమానాలు తగ్గిపోతున్నాయని విచారం వ్యక్తం చేశారు. నేటి సమాజంలో పిల్లలు ఉద్యోగాల పేరిట సొంత ఊళ్లకు దూరమౌతుండడంతో అవ్వాతాతల దగ్గర వుండే అవకాశం లేకుండా పోతోందన్నారు. దీంతో పిల్లలకు నైతిక విలువల గురించి తెలియకుండా పోతోందని, పూర్వం అవ్వాతాతలు పిల్లలకు పురాణాలు, సాహస, నీతికథలు చెప్పి వారిలో నైతిక విలువలను పెంపొందించే వారని తెలిపారు. అలాగే అవ్వాతాతల ప్రాముఖ్యం, నైతిక విలువల ప్రయోజనాలను వివరించారు. ఈ సందర్భంగా ఒక వృద్ధ దంపతులకు షష్టిపూర్తి నిర్వహించారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థుల పాల్గొన్నారు.

సీఎం సహాయనిధి పేదలకు వరం



చెక్కులు పంపిణీ చేస్తున్న వెంకటసుబ్బారెడ్డి, ఇక్బాల్‌అహ్మద్

పీలేరు: ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం లాంటిదని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యెం వెంకటసుబ్బారెడ్డి, పీలేరు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ఇక్బాల్‌అహ్మద్‌ఖాన్ అన్నారు. ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి పీలేరు మండలం బోడుమల్లువారి పల్లెకు చెందిన సునీతకు రూ.65వేలు, కోటపల్లెకు చెందిన ఎం.మదనమోహన్‌కు రూ.50వేలు, జాండ్లకు చెందిన సుదర్శనకు రూ.50వేలు, అమర్‌నాయక్‌కు రూ.25 వేలు, పీలేరు సైనిక్‌నగర్‌కు చెందిన రామ్మోహన్‌కు రూ.24వేలు, ఎర్రమరెడ్డిగుట్టకు చెందిన కృష్ణమూర్తికి రూ.15 వేలు, చిన్నగాండ్లపల్లెకు చెందిన రాధమ్మకు రూ.21 వేలు, తలపల రెడ్డివారిపల్లెకు చెందిన అమరనాధకు రూ.33 వేలు, మొరవపడ్డిపల్లెకు చెందిన బుక్కేచినరెడ్డినాయక్‌కు రూ.20వేలు మంజూరైన చెక్కులను మంగళవారం వారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్తలు కోటపల్లె బాబురెడ్డి, చింతగింజల శ్రీరాం, మండల టీడీపీ అధ్యక్షుడు కేశవర్దన్ తదితరులు పాల్గొన్నారు.

రాయలసీమలో వైసీపీ పునాదులు కదులుతున్నాయ్

టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యెం వెంకటసుబ్బారెడ్డి

పీలేరు: నంద్యాల ఉపఎన్నికలో టీడీపీ ఘనవిజయం, గతంలో కడపలో స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ చిన్నాన్న వివేకానందరెడ్డి ఓటమితో రాయలసీమలో వైసీపీ పునాదులు కదిలిపోతున్నాయని టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి రెడ్యెం వెంకటసుబ్బారెడ్డి అన్నారు. మంగళవారం పీలేరులో జరిగిన సమావేశంలో టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ ఇక్బాల్‌తో కలసి పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నంద్యాల ఓటర్లు విజ్ఞతతో వ్యవహరించి వైసీపీని ఓడించడం జరిగిందన్నారు. టీడీపీ డబ్బుతో విజయం సాధించిందని జగన్ ఆరోపించడం విడ్డూరంగా ఉందని, ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులు డబ్బు సంచులతో దొరికిపోవండం అందరికీ తెలిసిన విషయమేనన్నారు. జగన్ తాను సీఎం అవుతానని కలలుకంటున్నారని ఆయన సీఎం అయితే వీధికో రౌడి ఇంటికో గూండా తయారై రాష్ట్రం రావణకాష్టంలా మారుతుందని దుయ్యబట్టారు. నంద్యాలను అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు కృషి చేయడంతో అన్ని కులాలవారు సీఎంపై నమ్మకంతో టీడీపీని అత్యధిక మెజారిటీతో గెలిపించారన్నారు. 2019 ఎన్నికలలో టీడీపీ అత్యధిక స్థానాలు గెలిచి అధికారంలోకి వస్తుందన్నారు. సమావేశంలో టీడీపీ సమన్వయకర్తలు కోటపల్లె బాబురెడ్డి, చింతగింజల శ్రీరామ్, మండల అధ్యక్షుడు కేశవర్ధన్, నాయకులు లడ్డూజాఫర్, కలకడ సయ్యద్‌సాహెబ్, శివ, సుబ్రమణ్యం, ఆంజి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటసుబ్బారెడ్డి

ఉపాధ్యాయవృత్తి పవిత్రమైనది



కేవీపల్లెలో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కల్లూరు/కేవీపల్లె: ఉపాధ్యాయవృత్తి పవిత్రమైనదని పులిచెర్ల మండలం మతుకువారిపల్లె పాఠశాల హెచ్‌ఎం హరినాథనాయుడు అన్నారు. పాఠశాల ఉపాధ్యాయుడు సుధాకరనాయక్ బదిలీ అయిన సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించి జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.● కేవీపల్లె సీఆర్‌పీ పరిధిలో బదిలీ అయిన హెచ్‌ఎం దామోదర్, ఉపాధ్యాయులు సదాశివరెడ్డి, సురేంద్రరెడ్డి, చందన, మంజుల, సుబ్బరామయ్యను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభివృద్ధికి వారు చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎంఈవో రెడ్డిబాషా తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం

కల్లూరు: పులిచెర్ల మండలం కమ్మపల్లి పంచాయతీ దిన్నెదళితవాడలో బుధవారం మధ్యాహ్నం ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ రహంతుల్లా తెలిపారు. సమావేశంలో ఎస్సీ, ఎస్టీల సమస్యలపై చర్చించి పరిష్కరించడం జరుగుతుందన్నారు.

నీటి ట్యాంకర్లకు బిల్లులు చెల్లించండి

కలకడ: గత ఏడాది ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంటను కాపాడేందుకు నీటిని తరలించిన ట్యాంకర్లకు బిల్లులు చెల్లించాలని ట్యాంకర్ల యజమానులు కోరుతున్నారు. మండలంలో రూ3.50 లక్షలు బిల్లులు చెల్లించాల్సి ఉందన్నారు. ఉన్నతాధికార్లు స్పందించి వెంటనే బిల్లులు చెల్లించ విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పాలీ, నెట్‌హౌస్‌లతో అధిక దిగుబడి

పీలేరు: పాలీ, నెట్‌హౌస్‌ల ద్వారా ఉద్యానపంటల సాగులో అధికదిగుబడులను సాధించవచ్చని జిల్లా ఉద్యానశాఖ ఉపసంచాలకురాలు సరస్వతి అన్నారు. మంగళవారం పీలేరు ఉద్యానశాఖ ఏడీ సుభాషిణితో కలసి పీలేరు, పాకాల, చిన్నగొట్టిగల్లు మండలాల్లో పర్యటించి పాలీ, నెట్‌హౌస్‌లను తనిఖీ చేశారు. పీలేరులో మహిళా రైతు గీతారాణి నిర్మించిన పాలీహౌస్‌ను సందర్శించి హైబ్రిడ్ రకం చామంతి పూలసాగును పరిశీలించారు. ఈసంర్భంగా డీడీ సరస్వతి మాట్లాడుతూ పీలేరు ఉద్యానశాఖ డివిజన్ పరిధిలో పాలీ, నెట్‌హౌస్‌ల నిర్మాణానికి వాతావరణం అనుకూలంగా వుందని, రైతులు వీటిని నిర్మించుకుని అధిక దిగుబడులను పొందాలని సూచించారు. వీటిలో పంటలసాగు ఎంతో లాభదాయకమని, తక్కువ నీటితో తక్కువ విస్తీర్ణంలో పంటలను సాగుచేసి ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఉద్యాన పథకాలను, రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని కోరారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులకు ఉద్యాన పంటలసాగు వ్యవసాయంపై భరోసా కల్పింస్తోంద న్నారు. ఉద్యాన పంటలను సాగు రైతులను నష్టాల బారిన పడకుండా కాపాడుతుందన్నారు. కార్యక్రమంలో ఉద్యానశాఖాధికారిణి లక్ష్మీప్రసన్న, ఇంజనీరు వినోద, రైతులు లింగయ్యనాయుడు, యువరాజ్ తదితరులు పాల్గొన్నారు.



పాలీహౌస్‌ను పరిశీలిస్తున్న డీడీ సరస్వతి తదితరులు

ఘనంగా గణేశ్ నిమజ్జనం

కల్లూరు: వినాయక చవితి సందర్భంగా పులిచెర్ల మండలం కొత్తపేటలో ఏర్పాటు చేసిన గణేశ్ విగ్రహాన్ని ఐదో రోజైన మంగళవారం ఘనంగా నిమజ్జనం చేశారు. విగ్రహాన్ని కొత్తపేట పురవీధుల్లో ఊరేగించారు. జైబోలో గణపతి మహారాజ్‌కు జై అంటూ చెరువులో నిమజ్జనం చేశారు. కార్య క్రమంలో మహిళలు, యువకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.



వినాయక నిమజ్జన ఊరేగింపులో యువత

సినిమాగైడ్

షుకూర్	అర్జున్‌రెడ్డి
ఎస్వీ మహల్	వివిపి 2
ఎస్వీ డీలక్స్	వివేకం
అజంతా	జయ జానకి నాయక

పశువైద్య శిబిరానికి స్పందన

కేవీబీపురం: మండలంలోని కళత్తూరులో మంగళవారం తొట్టంబేడు మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ఉచిత పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఏఎంసీ చైర్మX రామాంజుల నాయుడు పశువులకు బూటాక్స్ పిచికారీ చేసి శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పశువైద్యాధికారి లక్ష్మీపతి మాట్లాడుతూ వర్షాకాలంలో పశువులు రోగాల బారిన పడతాయన్నారు. కనుక రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు.కార్యక్రమంలో వైద్యాధికారిణి మంజుల, సర్పంచX రజిత, కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



బూటాక్స్ పిచికారి చేస్తున్న రామాంజులనాయుడు

దేశభాషలందు తెలుగు లెస్స





తొట్టంబేడులో విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న ప్రముఖులు - వరదయ్యపాళెంలో మునెయ్యను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

తొట్టంబేడు: దేశ భాషలందు తెలుగు లెస్సని, తెలుగుభాషను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందని మండల టీడీపీ అధ్యక్షుడు మురళీనాయుడు అన్నాడు. మండలంలోని పెన్నలపాడు ప్రాథమిక పాఠశాలలో మంగళవారం జరిగిన తెలుగుభాష దినోత్సవానికి ఆయన ముఖ్య అతిధిగా విచ్చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు అభివృద్ధికి గిడుగు రామమూర్తి చేసిన కృషి ఎనలేనిదన్నారు. అనంతరం విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయుడు బాలసుబ్రహ్మణ్యం, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: మండలంలోని కారిపాకం జడ్పీ హైస్కూల్ హెచX ఎం మనోహరుడు ఆధ్వర్యంలో పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు ఉపాధ్యాయుడు మునెయ్యను సిబ్బంది ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించి బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు వెంకటస్వామి,మధు, షర్మిల, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించండి





తొట్టంబేడు, కేవీబీపురంలో రైతులకు సూచనలు ఇస్తున్న వ్యవసాయాధికారులు

తొట్టంబేడు: వ్యవసాయంలో రైతులు రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకంపై దృష్టి పెట్టాలని వ్యవసాయాధికారి మణి సూచించారు. మండలంలోని శివనాధపాళెం, గుర్రప్పనాయుడుకండ్రిగ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి మాట్లాడుతూ రైతులు భూసార పరీక్షలు తప్పక చేయించాలన్నారు. వాటి ఫలితాలను బట్టి ఎరువులను వాడాలని తెలిపారు. ఆధునిక పద్ధతుల్లో వ్యవసాయం చేయడంవలన తక్కువ ఖర్చుతో ఎక్కువ లాభాలు పొందవచ్చన్నారు.

కేవీబీపురం: సేంద్రియ ఎరువులతో ఖర్చులను తగ్గించుకుని అధిక లాభాలు పొందవచ్చని వ్యవసాయాధికారి చిట్టిబాబు అన్నారు. మంగళవారం ఆయన ఆదవరం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గిరిజన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రసాయనిక ఎరువుల కన్నా మనకు దొరికే పశువుల పేడ, వర్మీకంపోస్టు ఎరువులు వినియోగిస్తే కల్తీలేని పంటలను పండించుకోవచ్చన్నారు.ఏఈవో శశిధర్‌రెడ్డి, ఎంపీవో భారతి, కో-ఆర్డినేటర్ గణేష్, రైతులు పాల్గొన్నారు.

వరదయ్యపాళెం: రైతులు ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించి తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులను సాధించవచ్చని వ్యవసాయాధికారి ఉమ అన్నారు. చిన్నపాండూరులో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దసంఖ్యలో రైతులు పాల్గొన్నారు.

ప్రార్థన ప్రాంగణానికి భూమి కేటాయించాలని వినతి

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో క్రైస్తవుల ప్రార్థన ప్రాంగణానికి భూమిని కేటాయించాలని ఇండియన్ క్రిస్టియన్ వెల్‌ఫేర్ డెవలప్‌మెంట్ సభ్యులు కోరుతున్నారు. ఆమేరకు వారు మంగళవారం తహసీల్దార్ జయచంద్రకు వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సంస్థ కౌన్సిల్ అధ్యక్షుడు రెవరెండ్ పాస్టర్ సుందరాజు మాట్లాడుతూ మండల కేంద్రంలో పలు గ్రామాలలోని క్రైస్తవులందరు ఐక్యంగా ప్రార్థనలు, మహాసభలు జరుపుకోవడానికి మూడు ఎకరాల భూమిని కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాస్టర్లు, ఏసురత్నం, శామ్యేలు, జాన్, బాబు, రవి కుమార్, తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న పాస్టర్లు

విద్యార్థులకు నోటుపుస్తకాల పంపిణీ



సమావేశంలో పాల్గొన్న శ్రావణ్ తదితరులు

వరదయ్యపాళెం: మండలంలోని రామిరెడ్డిపాళెం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు దాత శ్రావణ్ మంగళవారం నోటుపుస్తకాలను వితరణగా అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శాంతమ్మ, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

సీఎల్ఎనX పల్లె పాఠశాలలో తాగునీటి పైపులైన్ల ఏర్పాటు

వరదయ్యపాళెం: మండలంలోని సీఎల్ఎనX పల్లె ప్రాథమికోన్నత పాఠశాలలో అమ్మాభగవాన్ సేవా ట్రస్టు నిర్వాహకులు విద్యార్థుల సౌకర్యార్థం విద్యుత్ మోటర్‌తోపాటు 500 లీటర్ల ట్యాంకు, పైపులైన్లను ఏర్పాటు చేశారు. వీటిని మంగళవారం ట్రస్ట్ సభ్యుడు శ్రీనివాస్ దాసాజీ ప్రారంభించారు.

వైభవంగా చవితి సంబరాలు





పాపానాయుడుపేట, మర్రిమందలో ప్రత్యేకాలంకారంలో వినాయకుడు

ఏర్పేడు: చవితి వేడుకలలో భాగంగా 5వ రోజైన మంగళవారం మండలంలోని పలు ప్రాంతాలలో వేడుకలు ఘనంగా నిర్వహించారు.పాపానాయుడుపేట ప్రాంతంలోని వికృతమాల దళితకాలనీ, మర్రిమంద బీసీకాలనీ, పాపానాయుడుపేట ధర్మరాజుల స్వామి గుడి ఆవరణంలో గణేష్ యువజన సంఘం ఆధ్వర్యంలో, ఏర్పేడు ఎస్టీకాలనీలో యువత ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలకు ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేపట్టారు. కాగా, ఏర్పేడు, వికృతమాలలో ఏర్పాటు చేసిన ప్రతిమలను నిమజ్జనం చేశారు.

ఈ కార్యక్రమాల్లో వైసీపీ నేత మధుసూదన రెడ్డి, అర్జునX బాబు, సుబ్బులు, తదితరులు పాల్గొన్నారు.

గణపతి ఆలయానికి రూ.1.11 లక్షల విరాళం

తొట్టంబేడు: మండలంలోని గుర్రప్పనాయుడుకండ్రిగలో నిర్మిస్తున్న విజయ గణపతి ఆలయానికి గ్రామానికి చెందిన చెరుకూరు సిద్ధులనాయుడు మంగళవారం రూ.1,11,116 విరాళంగా ఇచ్చారు. సిద్ధులనాయుడు మనుమడు దేవానX జన్మదినం సందర్భంగా ఈ విరాళం అందించారు. అదే విధంగా గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించి, బహుమతులు అందించారు. నోటు పుస్తకాలు, జామెంట్రీ బాక్సులు కూడా విద్యార్థులకు ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామంలో అన్నదానం చేశారు. శివనాధపాళెం సమీపంలోని అమ్మా ఆశ్రమంలో వృద్ధులకు పండ్లు, మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో ప్రదీప్, కోమలి, తదితరులు పాల్గొన్నారు.



విరాళం అందిస్తున్న సిద్ధులనాయుడు

పైపులైన్ మరమ్మతులతో తీరిన నీటి సమస్య

బుచ్చినాయుడుకండ్రిగ: బుచ్చినాయుడుకండ్రిగ పంచాయతీలోని తెలుగుగంగ కాలనీ పైపులైనుకు మంగళవారం అధికారులు మరమ్మతులు చేపట్టడంతో తాగునీటి సమస్య పరిష్కారమైంది. నాలుగు రోజులు క్రితం ఓవాహనం పైపులైను మీదుగా వెళ్ళడంతో పైపులు దెబ్బతిన్నాయి. దీంతో కాలనీవాసులు తాగునీటికి ఇబ్బందులు పడ్డారు. దీనిపై సర్పంచ్ చెంచమ్మ స్పందించి పైపులైకు మరమ్మతులు చేయించి సమస్య పరిష్కరించారు.

పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని వినతి

శ్రీకాళహస్తి అర్బన్: పట్టణంలోని తెలుగుగంగ కాలనీలోని పురపాలక సంఘం ఉన్నత పాఠశాలకు భద్రత దృష్ట్యా ప్రహరీ నిర్మించాలని పీడీఎస్‌యూ నాయకులు కోరారు. ఈ మేరకు మంగళవారం పురపాలసంఘం కార్యాలయంలో ఇనX ఛార్జి కమిషనర్ రవీంద్రనాధ్‌రెడ్డికి వారు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా కార్యదర్శి జాకీర్, నాయకులు ముబషీర్, ప్రశాంతX , తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసులు సేవలు మరువలేనివి



శ్రీనివాసులును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు తదితరులు

ఏర్పేడు: మండలంలోని పిల్లారిగుంట ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు శ్రీనివాసులు సేవలు మరువ లేనివని దళిత హక్కుల పోరాట సమితి శ్రీకాళహస్తి నియోజకవర్గ కన్వీనర్ గురున్నాధం అన్నారు. శ్రీనివాసులు పిల్లారిగుంట ప్రాథమిక పాఠశాల నుంచి సరస్వతికండ్రిగ పాఠశాలకు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఆయనను మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో షీ టీం అర్బనX జిల్లా కన్వీనర్ సుమతి, పాఠశాల హెచX ఎం దేవప్రకాశం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఒక్క టీకాతో రెండు వ్యాధులు దూరం

చౌడేపల్లె: ఒక్క ఎమ్మార్ టీకాతో రెండు వ్యాధులు దూరమవుతాయని డాక్టర్ నిరంజన్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం తన సిబ్బందితో మండలంలోని విజయవాణి స్కూల్‌లో 284 మంది విద్యార్థులకు ఎమ్మార్ టీకా వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మార్ టీకా వేయడం వల్ల మీజిల్స్, రుబెల్లా వ్యాధులు సోకవన్నారు. అనంతరం సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది రాజశేఖర్, మురళి, రుక్మిణి, రత్నమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగులు హెల్మెట్ ధరించి ఆదర్శంగా నిలవాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐ చంద్రశేఖర్

పుంగనూరు: ద్విచక్రవాహనాలు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులు హెల్మెట్లు ధరించి ప్రజలకు ఆదర్శంగా నిలవాలని సీఐ చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మంగళవారం మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల్లో జరిగిన ఉద్యోగుల సమావేశాల్లో ఆయన మాట్లాడుతూ రోడ్డు నిబంధనలను ఉద్యోగులు పాటించాలని కోరారు. లైసెన్స్ లేనివారు వాహనాలు నడిపి ప్రమాదాలు జరిగితే సంబంధిత యజమాని, పిల్లల కుటుంబ సభ్యులపై కేసు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మున్సిపల్ కమిషనర్ వర్మ మాట్లాడుతూ ద్విచక్ర వాహనాలున్న అధికారులు, సిబ్బంది ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు అమ్ము, ఇబ్రహీం, కుమార్‌రాజా, మున్సిపల్ ఉద్యోగ సంఘ గౌరవాధ్యక్షుడు షరీఫ్, మున్సిపల్ మేనేజర్ వెంకట్రామయ్య, టీపీవో కృష్ణారావు, ఏఈ కృష్ణకుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పరిశుభ్రతకు చర్యలు



కంపోస్ట్ యార్డులను పరిశీలిస్తున్న ప్రజాప్రతినిధులు

పుంగనూరు రూరల్: ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో పరిశుభ్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు పుంగనూరు ఎంపీడీవో లక్ష్మీపతినాయుడు తెలిపారు. మంగళవారం వీ.కోట మండలంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంపోస్ట్‌యార్డును పుంగనూరు మండల సర్పంచ్‌లు, ఉపాధి సిబ్బంది పరిశీలించినట్లు ఆయన తెలిపారు. గ్రామాల్లో ఎక్కడపడితే అక్కడ చెత్తను వేయడంతో పారిశుద్యం లోపించి అంటువ్యాధులు వ్యాప్తి చెందుతున్నాయని, ప్రభుత్వం గుర్తించి గ్రామానికి దూరంగా ప్రభుత్వ స్థలాల్లో తడి, పొడి చెత్తలను వేరు చేసి నిల్వ ఉంచి సేంద్రియ ఎరువుల తయారీకి చర్యలు తీసుకుంటుందన్నారు. ప్రతి పంచాయతీలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయడానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు, కార్యదర్శులు, ఉపాధి సిబ్బంది పాల్గొన్నారు.

సాంస్కృతిక పోటీల్లో పాల్గొనండి

రొంపిచెర్ల: రాష్ట్ర ప్రభుత్వం యువజన సర్వీసులు, తిరుపతి సెట్విన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9న జరుగు డివిజన్‌స్థాయి యువజనోత్సవాల్లో వివిధ కళల్లో ప్రావీణ్యం కలిగిన వారు పాల్గొనాలని ఎంపీడీవో ఉమాలక్ష్మి కోరారు. జానపదం, భరతనాట్యం, భరతనాట్యం, తబలా, మృదంగం తదితర అంశాల్లో పోటీలుంటాయని, ఆసక్తి కలిగినవారు 9440573537 నంబరును సంప్రదించాలని సూచించారు.

సినిమా గైడ్

వెంకటేశ్వర	అర్జున్‌రెడ్డి
తాజ్‌మహల్	జయ జానకి నాయక
గోకుల్	వివేకం
ఎంఎస్ఆర్	వివిపి 2

లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు



ఆటో డ్రైవర్లకు రోడ్డు నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ఏఎంవీఐ రాజగోపాల్

రామసముద్రం/సోమల: లైసెన్సు లేకుండా వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని మదనపల్లె ఏఎంవీఐ రాజగోపాల్ హెచ్చరించారు. మంగళవారం రామసముద్రం - మదనపల్లె, పుంగనూరు మార్గాల్లో వాహనాలను తనిఖీ చేశారు. డ్రైవింగ్ లైసెన్సు వాహనాల రికార్డులు, ఇన్సూరెన్స్ లేని వాహనాలను సీజ్ చేశారు. అనంతరం ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. లైసెన్సు లేకుండా డ్రైవ్ చేసి ప్రమాదాలకు కారణమైనా, అధికలోడు, డ్రైవర్ పక్కన ప్రయాణికులను కూర్చోబెట్టుకోవడం, సెల్‌ఫోన్లో మాట్లాడుతూ డ్రైవ్ చేయడం, మద్యం తాగి, ట్రాఫిక్ నిబంధనలు పాటించకుండా వాహనాలు నడిపితే క్రిమినల్ కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరుగుతుందన్నారు. లైసెన్సులేని ఆటో డ్రైవర్లు ఎముకల డాక్టర్ వద్ద వయస్సు నిర్ధారణ సర్టిఫికెట్ తీసుకుని మీ సేవలో దరఖాస్తు చేసుకుంటే లైసెన్సు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఎస్ఐ సోమశేఖర్ అన్ని ప్రభుత్వ కార్యాలయాల అధికారులకు నోటీసులు జారీ చేస్తూ హెల్మెట్, లైసెన్సు లేకుంటే క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందని చెప్పారు. ● సోమలలో ఎస్ఐ లక్ష్మీనారాయణ ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, మద్యం తాగి వాహనం నడపబోమంటూ ఆటో డ్రైవర్లతో ప్రతిజ్ఞ చేయించారు. నంజంపేట, పెద్దఉప్పరపల్లె, కందూరు ఆటో డ్రైవర్లకు ప్రమాణ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు ఆనంద్, మనోహర్, ఆటో యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

బయోమెట్రిక్‌తోనే ఎరువులు విక్రయించాలి



రైతులకు బయోమెట్రిక్ విధానంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ శివకుమార్‌రాజు

పుంగనూరు రూరల్: రైతులు బయోమెట్రిక్ విధానంతోనే ఎరువులు కొనుగోలు చేయాలని ఏడీఏ శివకుమార్‌రాజు కోరారు. మంగళవారం పుంగనూరు పట్టణంలోని ప్రైవేటు బస్టాండ్, మదనపల్లె రోడ్డు మార్గాల్లోని ఎరువుల దుకాణాల్లో బయోమెట్రిక్ విధానంలో ఎరువుల కొనుగోలుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమల, గంగవరం, పెద్దపంజాణి, పుంగనూరు మండలాల్లోని ఎరువుల దుకాణదారులు సెప్టెంబర్ ఒకటి నుంచి బయోమెట్రిక్ ద్వారానే విక్రయించడానికి చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. రైతులు తమ ఆధార్‌కార్డుతో ఎక్కడైనా ఎరువులు కొనుగోలు చేయడానికి అవకాశం ఉంటుందన్నారు. తప్పకుండా బిల్లులు పొందాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో జ్యోతి, డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ క్రీడా దినోత్సవం



పుంగనూరులో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

పుంగనూరు రూరల్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పుంగనూరు బసవరాజ హైస్కూల్ విద్యార్థులు మంగళవారం ఘనంగా నిర్వహించారు. పాఠశాల నుంచి విద్యార్థులు బ్రహ్మణవీధి, బజారువీధి మీదుగా నాగపాళ్యం, ఇందిరా సర్కిల్‌కు ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకట్రామణారెడ్డి మాట్లాడుతూ క్రీడలతో విద్యార్థుల మానసికోల్లాసం, ఆరోగ్యం, దేహదారుఢ్యం కలుగుతుందన్నారు. ప్రపంచ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ ప్రతిభను కొనియాడారు. కార్యక్రమంలో వ్యాయామ ఉపాధ్యాయురాలు రెడ్డెమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.● చౌడేపల్లె ఉన్నత పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించి మానవహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం ఈశ్వర్‌రెడ్డి మాట్లాడుతూ హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ పుట్టిన రోజును జాతీయ క్రీడా దినోత్సవంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. క్రీడలతో విద్యార్థులు శారీరక, మానసిక రుగ్మతలను అధిగమించవచ్చన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అంటువ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయండి



సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ వర్మ

పుంగనూరు: అంటువ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలని మున్సిపల్ కమిషనర్ వర్మ సూచించారు. మంగళవారం శానిటరీ, వైద్యసిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు వార్డుల్లో పర్యటించి ఇళ్ల ముందు ఏర్పాటు చేసుకున్న నీటి సంపులను వారానికి ఒక రోజు శుభ్రం చేయించాల న్నారు. ప్రతి రోజు మురికినీటి కాల్వల్లో క్రిమిసంహారక మందులు పిచికారీ చేయాలని సూచించారు. ఎక్కడైనా జ్వరాలు ప్రారంభమైతే వెంటనే వైద్యసిబ్బందిని అప్రమత్తం చేయాలని సూచించారు. సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ సురేంద్రబాబు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయండి

పుంగనూరు: సీపీఎస్ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 1న విజయవాడలో జరిగే శాంతి ర్యాలీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పుంగనూరు డివిజన్ సీపీఎస్ ఉద్యోగుల సంఘ అధ్యక్షుడు శంకర్ పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయం వద్ద ఆయన మాట్లాడుతూ విజయవాడ వెళ్లేందుకు పుంగనూరులో ఆగస్టు 31న సాయంత్రం బస్సు బయలుదేరుతుందన్నారు. వివరాలకు 9441451586 నెంబరును సంప్రదించాలన్నారు.

జిప్సంతో అధిక దిగుబడి

సోమల: వేరుశనగ పంట సాగులో జిప్సం వాడకంతో నాణ్యమైన అధిక దిగుబడి సాధించవచ్చని వ్యవసాయాధికారి షణ్ముగం అన్నారు. మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో వేరుశనగ సాగును పరిశీలించారు. జూలైలో వేరుశనగ వేసిన రైతులకు ఉచితంగా ప్రభుత్వం జిప్సం అందజేయడం జరిగిందన్నారు. మిట్టపల్లెలో సేంద్రియ ఎరువుల తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో హర్షవర్ధన్, ఇంద్రసేనారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

ఒడ్డు ఆక్రమణలపై ఫిర్యాదు

సదుం: స్థానిక కల్లూరు రోడ్డులోని కుమారుని ఒడ్డు ఆక్రమణలపై ఆయకట్టుదారులు తహసీల్దారు హనుమానాయక్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల రియల్ ఎస్టేట్ వ్యాపారులు కుమారుని ఒడ్డును ఆక్రమించి చదును చేసుకుని ప్లాట్లుగా ఏర్పాటు చేస్తున్నారని, దీనిపై రెవెన్యూ అధికారులు స్పందించి ఆక్రమణలను తొలగించి ఆయకట్టు రైతులకు న్యాయం చేయాలని వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సయ్యద్‌బాషా, రైతులు మహబూబ్‌సాహెబ్, మదన్మోహనరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారిద్దాం



మొక్కలు నాటుతున్న విద్యార్థులు

పుంగనూరు రూరల్: ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించడానికి కృషి చేయాలని బసవరాజ ప్రభుత్వ బాలికల కళాశాల ప్రిన్సిపాల్ ఎల్వీ. రమణారెడ్డి పిలుపునిచ్చారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా పట్టణ సమీపంలోని హనుమంతరాయదిన్నెలో విద్యార్థులు, గ్రామస్తులతో కలసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా మొక్కలు నాటడం వల్ల కలిగే ప్రయోజనాలను, నరకడం వల్ల కలిగే నష్టాలను ప్రిన్సిపాల్ వివరించారు. కార్యక్రమంలో మున్సిపల్ పాఠశాల హెచ్ఎం రెడ్డికుమారి, అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా వినాయక నిమజ్జనం



వినాయకున్ని నిమజ్జనానికి తరలిస్తున్న యువకులు

పుంగనూరు రూరల్/రామసముద్రం: వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన విగ్రహాలను మంగళవారం భక్తి శ్రద్ధలతో ఘనంగా నిమజ్జనం చేశారు. ఈనెల 25నుంచి వినాయకుడికి ప్రత్యేక పూజలు, ముగ్గుల పోటీలు, అన్నదానం, నృత్య ప్రదర్శనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఐదోరోజు మంగళవారం పుంగనూరు పట్టణంలో ప్రైవేటు బస్టాండ్, వ్యవసాయ మార్కెట్ వద్ద ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను వేర్వేరుగా ట్రాక్టర్లపై ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా యువకులు నృత్యాలు చేస్తూ రంగులు చల్లుకుంటూ చదళ్ల చెరువులో నిమజ్జనం చేశారు.● రామసముద్రంలోని గాజులనగరం, వాల్మీకివీధుల్లోని గణేశ్ నిమజ్జనం కోలాహలంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల మధ్య, బాణసంచా పేల్చుతూ ఊరేగింపుగా తీసుకెళ్లి నిమజ్జనం చేశారు.

ఆంధ్రజ్యోతి శ్రీకాళహస్తి టౌన్

చిత్తూరు | బుధవారం 30 ఆగస్టు 2017 |

వేడుకగా జాతీయ క్రీడల దినోత్సవం

శ్రీకాళహస్తి అర్బన్: పట్టణంలోని ఏవీఆర్ పాఠశాలలో మంగళవారం జాతీయ క్రీడా దినోత్సవాలను వేడుకగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల డీజీఎం సుబ్రహ్మణ్యంరెడ్డి మాట్లాడుతూ హాకీ క్రీడాకారుడు ధ్యాన్ చంద్ జయంతి సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం జరుపుకుంటున్నామన్నారు. అనంతరం క్రీడా పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే

శ్రీకాళహస్తి అర్బన్: పట్టణంలోని రవీంద్ర భారతి పాఠశాలలో మంగళవారం గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు.అవ్వ, తాతయ్యల వేషాధారణలో చిన్నారులు అలరించారు. కార్యక్రమంలో ఏజీఎం మృత్యుంజయ రెడ్డి, డీన్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

గొడుగుచింత గోవిందయ్యకు పురస్కారం



గోవిందయ్యను సన్మానిస్తున్న ప్రముఖులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని గిరిజన బాలికల గురుకుల తెలుగు ఉపాధ్యాయుడు గొడుగుచింత గోవిందయ్యకు మంగళవారం చిత్తూరులోని లలిత కళాసాగర్ సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయలు జాతీయ పురస్కారాన్ని అందించారు. గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని జరిగిన ఈ కార్యక్రమంలో గోవిందయ్యకు పురస్కారం అందించారు. ఈ సందర్భంగా గోవిందయ్య తెలుగుభాష అభివృద్ధికి చేస్తున్న సేవలను వారు కొనియాడారు. ఆచార్య అరుణాచలం, మాడభూషి సంపత్ కుమార్, బాలసుబ్రహ్మణ్యం, నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

తెలుగుభాషను కాపాడుకుందాం



సమావేశంలో పాల్గొన్న ధూర్జటి రసజ్ఞ సమాఖ్య సభ్యులు

శ్రీకాళహస్తి: తెలుగుభాషను కాపాడుకుందామని ధూర్జటి రసజ్ఞ సమాఖ్య అధ్యక్షుడు లగడపాటి భాస్కర్ పిలుపునిచ్చారు. గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని సమాఖ్య కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ తెలుగుభాషను కాపాడుకోవడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో యువశ్రీ మురళి, తీగల వెంకటయ్య,జయచంద్ర, గణేష్, గురునాధం, మునిసుబ్బారెడ్డి, రవీంద్ర, బాలముని శివకుమార్ తదితరులు పాల్గొన్నారు. కాగా విక్రమ్ డిగ్రీ కళాశాలలో నిర్వహించిన వేడుకల్లో ప్రిన్సిపాల్ పట్టాభి, వైస్‌ప్రిన్సిపాల్ బాలముని శివకుమార్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు. బాబుఅగ్రహారంలోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో హెచ్ ఎం గోపాలస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పీవీరోడ్డులో ఆక్రమణలు తొలగించండి

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో ఆక్రమణలను వెంటనే స్వచ్ఛందంగా తొలగిచాలని పురపాలక సంఘ ఇన్ ఛార్జి కమిషనర్ రవీంద్రారెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. పాత వరదయ్యపాళెం రోడ్డులో పురపాలకసంఘ స్థలాన్ని ఆక్రమించుకుని డ్రైనేజీలపై అక్రమ నిర్మాణాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. వచ్చే నెల 1వ తేదీ లోగా ఆక్రమణలు తొలగించకపోతే పురపాలక సంఘ సిబ్బందిచే బలవంతంగా తొలగిస్తామని ఆయన హెచ్చరించారు.

సాంకేతిక పరిజ్ఞానంతో చోరీలు నివారిద్దాం

శ్రీకాళహస్తి అర్బన్: సాంకేతిక పరిజ్ఞానంతో చోరీలు నివారిద్దామని శ్రీకాళహస్తి 1వ పట్టణ సీఐ చిన్నగోవిందు తెలిపారు. మండలంలోని కాపుగున్నేరిలో ఉన్న స్కిమ్స్ కళాశాలలో మంగళవారం లాక్‌హౌస్ మానటరింగ్ సిస్టంపై ఆయన అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ చోరీల నియంత్రణకు పోలీసుశాఖ ప్రవేశపెట్టిన మొబైల్ ఫోన్ యాప్ గురించి విద్యార్థులకు వివరించారు.కార్యక్రమంలో ఎస్ఐలు సంజీవకుమార్, ప్రవీణ్ కుమార్, ప్రిన్సిపాల్ రఘురామిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న అధ్యాపకులు, పోలీసులు

అమ్మభాషను బతికించుకుందాం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమావతి

శ్రీకాళహస్తి: అనాథగా మారిపోతున్న అమ్మ భాషను బతికించుకుందామని తిరుపతి శ్రీపద్మావతి మహిళా డిగ్రీ కళాశాల విశ్రాంత తెలుగు అధ్యాపకురాలు డాక్టర్ డీఎం ప్రేమావతి పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాషా దినోత్సవం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ప్రేమావతి మాట్లాడుతూ... మా తెలుగుతల్లికి మల్లెపూదండ అనే గేయం తెలుగువారి సంస్కృతి, సంప్రదాయాలను చాటి చెబుతోందన్నారు. అయితే నేడు పరభాష మోజులో అమ్మభాషను ఆదరించేవారు కరువవుతున్నారన్నారు. తెలుగు భాషను ఉద్ధరించడానికి విద్యార్థులే రథసారధులు కావాలని పిలుపునిచ్చారు. భాష లేనిదే మనిషి మనుగడ లేదన్న విషయాన్ని అందరూ గుర్తుంచుకోవాలన్నారు. సమాజంలో సాహిత్యం సాధించలేనిది ఏదీ లేదన్నారు. సాహిత్యంలో సామాన్యులకు అర్థమయ్యే భాష వినియోగించాలని సూచించారు. తెలుగు భాషకు చావు లేదని... మంచి భవిష్యత్తుందని చెప్పారు. విద్యను ప్రైవేటీకరణ చేయడం వలన తెలుగుభాషపై చిన్నచూపు చూస్తున్నారన్నారు. అనంతరం పలువురు వక్తలు మాట్లాడుతూ అందరూ కలిసి తెలుగు భాషను బతికించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల తెలుగు అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్‌హెచ్ సౌభాగ్యమ్మ, చంద్రశేఖర్, లగడపాటి భాస్కర్, ఆర్‌జేడీ పద్మావతి, సుబ్బరాయుడు, అరవింద్, డాక్టర్ ధరణి, మునిరత్నం, మౌని, సోము ఉమాపతి, తీగల వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాష దినోత్సవం



శ్రీచైతన్యలో తెలుగుభాష దినోత్సవ వేడుకల్లో విద్యార్థులు



వేడుకలలో పాల్గొన్న ఎంఈవో భువనేశ్వరి తదితరులు

శ్రీకాళహస్తి:పట్టణంలోని పలు విద్యాసంస్థల్లో మంగళవారం గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకుని తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు.గిడుగు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. పట్టణంలోని జయరామరావువీధి, శ్రీరామనగర్‌లో గల శ్రీచైతన్య పాఠశాలల్లో తెలుగుభాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ, రూపాదేవి, ఏజీఎం శ్రీనివాసులు, లోకేష్‌రెడ్డి, కాశీరావు, మాధవీలత, గౌరి, తదితరులు పాల్గొన్నారు. స్కిమ్స్ బీఎడ్ కళాశాలలో జరిగిన వేడుకల్లో కరస్పాండెంట్ మిద్దెల హరి, ప్రిన్సిపాల్ శ్రీకుమార్, రఘురామిరెడ్డి, అధ్యాపకులు నరేంద్ర, సత్యనారాయణ, శేఖర్ తదితరులు పాల్గొన్నారు. ది స్కూల్‌లో నిర్వహించిన వేడుకల్లో కరస్పాండెంట్ శాంతారాం పవార్, హెచ్ ఎంలు విశాల, రవికుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎంజీఎం పాఠశాలలో డైరెక్టర్ మయూర్, ప్రధానోపాధ్యాయుడు మునిరత్నం, ప్రిన్సిపాల్ వీఎస్ రత్నం పాల్గొన్నారు.ఏస్వీప ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాలలో వైస్ ప్రిన్సిపాల్ వీరయ్య, బాబూరావు, లక్ష్మీనారాయణ, సుబ్బారావు తదితరుల ఆధ్వర్యంలో తెలుగు భాష దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అలాగే, రవీంద్రభారతి పాఠశాలలో కూడా ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలుగు భాష దినోత్సవం ఘనంగా నిర్వహించారు.

శ్రీకాళహస్తి రూరల్: మండలంలోని ఊరందూరు హరిజనవాడ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన తెలుగుభాషా దినోత్సవంలో ఎంఈవో భువనేశ్వరి పాల్గొన్నారు. కార్యక్రమంలో తెలుగుభాషపై విద్యార్థులకు పద్యాలు, కథలు, రచనల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు అందజేశారు. హెచ్ ఎం సురేష్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలను అమలు చేయాలి



వినతిపత్రం ఇస్తున్న అంగన్ వాడీలు

కేవీబీపురం: కలెక్టర్ ప్రద్యుమ్న జారీ చేసిన ఆదేశాలను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మండలంలోని అంగన్ వాడీలు మంగళవారం కేవీబీపురంలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ హైమావతి మాట్లాడుతూ అంగన్ వాడీ కేంద్రాలన్నింటికీ ఆయా పంచాయతీల సర్పంచ్ లు విద్యుత్ , తాగునీరు, వంటగ్యాస్ ఏర్పాటు చేయాలని ఈ నెల 3న కలెక్టర్ ఆదేశించారన్నారు. నిధులు లేకపోతే 14వ ఆర్థిక సంఘం నిధులను వినియోగించుకోవాలని సూచించారన్నారు. అయితే ఇప్పటి వరకూ సర్పంచ్ లు అంగన్ వాడీ కేంద్రాలను పట్టించుకోలేదన్నారు. ఆమేరకు ఎంపీడీవో సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో సీసీఎల్ఏ అనిల్‌చంద్ర పునేఠా



ముక్కంటి దర్శనానికి విచ్చేసిన అనిల్ చంద్ర పునేఠా

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరుడిని మంగళవారం రాష్ట్ర భూసేకరణ చీఫ్ కమిషనర్ అనిల్‌చంద్ర పునేఠా దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు గురవయ్య నాయుడు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి తహసీల్దారు సుబ్రహ్మణ్యం,వీఆర్వో భక్తవత్సల నాయుడు, పీఆర్వో హరిబాబు యాదవ్, ఏఈవో మోహన్ , తదితరులు పాల్గొన్నారు.

రాధారెడ్డికి ఎస్సీవీ పరామర్శ



రాధారెడ్డిని పరామర్శిస్తున్న ఎస్సీవీ నాయుడు

శ్రీకాళహస్తి: పురపాలక సంఘ చైర్మన్ పేట రాధారెడ్డిని మంగళవారం మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు పరామర్శించారు.రాధారెడ్డి కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో రాధారెడ్డిని ఆయన స్వగృహంలో ఎస్సీవీ నాయుడు పరామర్శించి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆయన వెంట రాజగోపాల్ నాయుడు, శివ, కుమార్, మహేష్, తదితరులు ఉన్నారు.

రేపు పురపాలక సంఘ సమావేశం

శ్రీకాళహస్తి: పురపాలక సంఘ కార్యాలయంలోని జయరామరావు కౌన్సిల్ హాలులో 31వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించనున్నట్లు చైర్మన్ రాధారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కౌన్సిల్ సభ్యులు, అధికారులు సమావేశానికి హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

నేడు బీఎస్ఎన్ ఎల్ మేళా

శ్రీకాళహస్తి: పట్టణంలోని నగరివీధిలో బుధవారం బీఎస్ఎన్ ఎల్ మేళా నిర్వహించనున్నట్టు రీటైల్ మేనేజర్ వినోద్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఈ మేళా ఉంటుందన్నారు. మేళాలో రాయితీలతో కూడిన పలు కనెక్షన్లు అందజేస్తామని, ఈ అవకాశాన్ని వినియోగదారులు వినియోగించుకోవాలని ఆయన కోరారు.

శ్రీకాళహస్తిలో సినిమాలు...

సాయిరాం	: వివేకం
బలరాం	: అహో బ్రహ్మ
శ్రీనివాస	: నేనే రాజు నేనే మంత్రి
విజయలక్ష్మి	: అర్జున్ రెడ్డి
ఆర్.ఆర్	: వీఐపీ
రామచంద్ర	: జయ జానకీ నాయక